The Chintamani.

A MONTHLY TELUGU MAGAZINE

EDITED BY N. SUBBARAU B. A. & B. L.

Vol.4.] RAJAHMUNDRY: NOVEMBER, 1894. [No.5.

CONTENTS.

RAJAHMUNDRY:

Printed for the Proprietor at the Vivekavardhani Press

విషయసూచిక.

శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౪.] రాజమహేంద్రవరము. జయసంవత్సర కార్తికమాసము. [సంచిక. ౫.

ట్రావెన్కూరు రాజ్యము. (Travancore)

చెన్నపురి దొరతనములోఁ జేరియున్న హిందూరాష్ట్రములలో ట్రావెన్కూరు ప్రధానమయినది. దీని విస్తీర్ణత ౬౭౩౦ చదరపుమైళ్లు. ఇందలి జనసంఖ్య ౧౮౮౧ వ సంవత్సరమునందు ౨౪౦౧౧౫౮ ఉండెను. వచ్చుబడి సంవత్సరమున కిరువదియైదులక్షల రూపాయలు. ఈ ట్రావెన్కూరురాజ్యము దక్షిణ మళయాళదేశమనఁబడును. ఇది పూర్వపు కేరళరాజ్యములో దక్షిణభాగము. ఈరాజ్యము మిక్కిలి సుందరమయి భారతఖండమునందుఁ గల దేశములలో నెల్లమిగుల దక్షిణమయి కన్యాకుమారీయగ్రము వఱకును వ్యాపించియున్నది. మలయపర్వతము లనఁబడెడు పడమటికనుమ లీదేశమునందున్నందున దీనికి మలయాళదేశమని పేరువచ్చినది. ఈపర్వతములయందు చందనవృక్షములు జాజిచెట్లు మొదలయినవి విస్తారముగా పెరుగును. ఏలకులు మొదలయిన సుగంధద్రవ్యములవలనను కలపవలనను దొరతనమువారి కీదేశమున సంవత్సరమునకు మూఁడులక్షల ముప్పదివేల రూపాయలు వచ్చును. ఏలకులు, మిరియములు, పోకలు మొదలయిన వీదేశమునందపరిమితముగా పండును. ఈదేశమునందయిదులక్షలు క్రైస్తవులున్నారు. వీరిలో దాదాపుగా మూఁడులక్షలు క్రీస్తుశకారంభమునుండియు తన్మత మవలంబించుచు వచ్చిన సిరియన్ క్రైస్తవుల సంతతివారు; లక్ష యేఁబదివేలు రోమన్ కాథలిక్కులు; ఇంగ్లీషురాజ్యము వచ్చిన తరువాత నిప్పటి క్రైస్తవ మతాచార్యుల బోధనలవలన క్రైస్తవు లయినవారు ఏఁబదియేడువేలుమాత్రమే యున్నారు. ఈ రాజ్యమునకు తిరువనంతపురము రాజధాని; ఇందు నలువదివేల జనులున్నారు. కోటలోపల మహారాజుగారి మందిరమును, అనంతపద్మనాభస్వామి యాలయమును, ఉన్నవి. ఇక్కడ మొదటితరగతి యింగ్లీషుశాస్త్ర పాఠశాలయున్నది. ఇక్కడి యున్నతపాఠశాలలోను శాస్త్రపాఠశాలలోను ౧౮౦౦ విద్యార్థులు చదువుకొనుచుందురు. ఈ పట్టణమునం దొక బాలికా పాఠశాలసహితము గలదు. ఇవిగాక యింకొక్క వైద్యపాఠశాలకూడ ప్రత్యేకముగానున్నది.

ఈ మళయాళదేశమును పరశురాముఁడు సంపాదించి బ్రాహ్మణులకు దానము చేసెనని చెప్పుదురు. ఈ నంబూరి బ్రాహ్మణులయొక్క పరిపాలనము క్రీస్తుశకమునకుఁ బూర్వము ౬౮ సంవత్సరముల క్రిందటఁ బరిసమాప్తినొందినది. ౧౮౮౦ వ సంవత్సరము నుండి యీదేశమును మహారాజా సర్ బలరామవర్మ జీ- సి, యస్, ఐ గారు పాలించు చున్నారు. ఈరాజులు తాము క్షత్రియులమని చెప్పుకొనుచున్నను వీరు వంశపరం పరగా బ్రాహ్మణులకుఁ బుట్టుచున్నవారు. ఈదేశమునందలి యాచార వ్యవహార ములు విచిత్రములయినవి. అందుఁగొన్ని క్రూరములయి మూర్ఖజనైకాదరణీయములుగా నున్నవి. ఇక్కడ బ్రాహ్మణుల ప్రభావ మత్యధికముగానున్నది. ఇక్కడి మహారాజు లింగ్లీషు చదువుకొన్నవారయినను బ్రాహ్మణులకు లోఁబడి బహువిషయములయందు వారి చేతులలో బొమ్మలవలె నాడించినట్లెల్ల నాడుచుందురు. మహారాజు సువర్ణ గోగర్భమునుండి వచ్చుటచేత పవిత్రుఁడయి బ్రాహ్మణతుల్యుఁడగునని చెప్పి, బ్రాహ్మణు లాతనిచేత తనయెత్తు బంగారముతో గోవునుచేయించి యందులోనుండి దూఱి యీవలికి వచ్చి యా బంగారమును బ్రాహ్మణులకు పంచిపెట్టినతరువాత నతఁడు శుద్ధుఁడయ్యె నని చెప్పి తాము భోజనముచేయునప్పు డతనిని జూడనిత్తురు. బ్రాహ్మణులు భోజనము చేయునప్పుడు చూచెడు భాగ్యము లభించినతరువాత మహారాజుగారు తనబంధువు లతో భోజనప్రతిభోజనములు మానివేయవలెను. ఇటువంటి బ్రాహ్మణభక్తిగల మహా రాజుచేత స్థాపింపఁబడిన నలువదిరెండు సత్రములలోను కడుపార భోజనముచేసి కాలమును సోమరితనముతోఁ గడపవచ్చునని బ్రాహ్మణు లనేకు లితరదేశములనుండి సహితమువచ్చి ట్రావెన్కూరులో నివసింతురు.

అద్వైత మతస్థాపకుఁడైన యాది శంకరాచార్యులవారీనంబూరి బ్రాహ్మణవంశ జుఁడు. ఈనంబూరి బ్రాహ్మణులలో జ్యేష్ఠభ్రాతమాత్రము వివాహముచేసికొని దాయము పొందును. ఈ బ్రాహ్మణకన్య లెంతకాలమయినను వివాహములేక యుండవచ్చును; బ్రాహ్మణస్త్రీలుకొందఱు రజస్వలలయిన చిరకాలమునకు వివాహితలగుదురు; కొందఱు వివాహములేక యావజ్జీవమునుకన్యలుగానేయుండిమరణముపొందుదురు. శూద్రులయిన నాయరులలో కన్యలకు చిన్నతనములోనే వివాహమనుపేరుపెట్టి యొకతంతు నడుపు దురుగాని వారు పెద్దవారయినతరువాత పెండ్లిచేసికొన్న భర్తను విడిచి మఱియొక స్వజాతివానితోఁగాని బ్రాహ్మణునితోఁగాని యథేచ్ఛముగా కాపురము చేయవచ్చును. దాయమెప్పుడును తోఁబుట్టి పడుచులకును వారిబిడ్డలకును వచ్చునుగాని పురుషులకు సొత్తునందు స్వాతంత్ర్యములేదు. తోఁబుట్టిన పడుచుగాని యామె కూఁతురుగాని లేకపోయినపక్షమున వంశము నిలుచుటకయి పురుషుఁడొక స్త్రీని చెల్లెలినిగా పెంచు

కొనవలెను. మనదేశమునందు జుట్టు శిరస్సున వెనుకవైపుననుండి వెనుకకు వ్రేలాడు చుండఁగా మళయాళదేశమునందు జుట్టు ముందువైపుననుండి ముందుప్రక్కకు వ్రేలు చుండును. ఈ యాచారము లొక్క ట్రావెన్కూరు రాష్ట్రములోనేగాక కొచిన్ రాజ్యమునందును, ఇంగ్లీషువారి పాలనములోనున్న మలబారు మండలమునందును, కొంత వఱకు దక్షిణకన్నడ దేశమునందునుగూడ నున్నవి. మలబారనఁబడెడి యుత్తర మళయాళములోను కన్నడదేశములోను నాయరు లాఱులక్షలకంటె నధికముగానున్నారు. వీరియొక్క కుటుంబములన్నియు నవిభక్తకుటుంబములు. అవితరవాడులనిచెప్పఁబడును. ఎన్ని తరములు దాటినను, ఆదియందేదో యొక్కొక్కమూల స్త్రీనుండివచ్చిన స్త్రీసంతతివారందఱును నొక్కొక్కతరవాడిలోఁ జేరియుందురు. ఒక్కతరవాడిలోఁ జేరినవారందఱును నైకకంఠ్యముగా నొప్పుకొన్నఁగాని కుటుంబవిభాగము జరగదు. దాయము స్త్రీపరంపరనుబట్టియే వచ్చుచున్నను, కుటుంబకార్యమును నిర్వహించువాఁ డెప్పుడును పురుషుఁడుగానే యుండును. కార్యనిర్వాహకుఁడయిన కుటుంబ యజమానుఁడు కర్ణవానుఁడని చెప్పఁబడును. అతఁడు కుటుంబముపైని నిరంకుశాధికారము చెల్లించుచు, తనయిష్టము వచ్చినవారి నాదరించుచు నిష్టము రానివారి ననాదరించుచు నుండును. అతఁడు కుటుంబవిత్తమునన్యాక్రాంతము చేయఁగూడదుగాని తక్కిన విషయములయందు మనసువచ్చినట్లు వారిపై నధికారము చెల్లింపవచ్చును. కుటుంబములోని తక్కినవారు భరణమునకు మాత్రమర్హులు. పురుషులయొక్కగాని స్త్రీల యొక్కగాని స్వార్జితము వారిబిడ్డలకుఁ జేరక తరవాడికిఁ బోవును. ఒక పురుషుఁ డెంతధనము సంపాదించి మృతుఁడయినను, ఆధనములో కాసయినను వానిభార్యకుఁ గాని బిడ్డలకుఁగానిరాదు. పురుషుని భార్యాపుత్రులాతని తరవాడి (కుటుంబము) లోఁ జేరినవారుకారు. ఒక్క స్త్రీయొక్క భర్తసహిత మామెయొక్క తరవాడిలోఁజేరిన వాఁడుకాఁడు. వివాహబంధమును బలపఱిచి స్వార్జితములో భార్యాపుత్రులకు భాగము వచ్చునట్లు చేయుటకయి యీనడుమఁ గొంత ప్రయత్నము జరగినమీఁదట నొక నిర్ధారణీయ శాసనము పుట్టినదిగాని యాదేశమునందలి బ్రాహ్మణులును ప్రముఖులుగా నున్న ఘనులును దానికి ప్రతిపక్షులయి యా శాసనము నిర్ధారితముగాకుండ రూపు మాపుటకయి బహు ప్రయత్నములు చేయుచున్నారు. పూర్వాచార పరాయణులయిన యాఘనులు తమదేశము విష్ణుదేవునియొక్క యాఱవ యవతార పురుషుఁడయిన పరశురామునిచే సంపాదింపఁబడి బ్రాహ్మణుల కియ్యఁబడినదగుటచే నందలి భూములు విభాగార్హములు కావనియు, అందుచేతనే బ్రాహ్మణకుటుంబములలో జ్యేష్ఠభ్రాత యొక్కఁడు మాత్రమే వివాహమాడి సొత్తనుభవింపవలెనని ధర్మశాస్త్రములు విధించు

చున్నవనియు, తక్కిన సోదరులు యథేష్టముగా నితరజాతుల స్త్రీల నుంచుకొని యనుభవింపవచ్చునని ధర్మశాస్త్రములును మతమును శిష్టాచారమునుగూడ నంగీకరించుచున్నవనియు, చెప్పుచు పరశురామస్మృతిలోనుండి

"నాడయిన యీదేశమునందు సమస్తజాతులలోను సామంతులలోను తదితరులలోను పాతివ్రత్యము లేకపోవునుగాక! బ్రాహ్మణులలోను ద్విజులలోను మాత్రము భార్యలు పాతివ్రత్య విధుల ననుసరింతురుగాక! ఇతరులలో పాతివ్రత్య నియమము లేకపోవునుగాక! ఈసత్యమును నేను ఘోషించుచున్నాను."

అని యర్థమిచ్చెడు శ్లోకములను ప్రమాణవాక్యములుగా నుదాహరించుచున్నారు. ఆదేశమునం దితరజాతులలో వివాహబంధమును నెలకొల్పి భార్యాపుత్రాదులను దాయార్హులనుగా నేర్పఱిచినపక్షమున, బ్రాహ్మణులుంచుకొనుట కర్హురాండ్రయిన స్త్రీలసంఖ్య తక్కువగునన్న భీతిచేతను తమ గౌరవము తక్కువగునన్న సందేహము చేతను వారాదేశములో వివాహాచారస్థాపనమునకు గర్భశత్రువులుగా నున్నారు. ఇచ్చవచ్చినట్లు స్త్రీలు వ్యభిచరింపవచ్చుననియు స్త్రీలు పైటవేసికొనఁగూడదనియు విధించెడుధర్మశాస్త్రముకంటె క్రూరతరమగు నన్యాయగ్రంథము లోకములో నింకొకటి యుండునా? అట్టి దుర్వాక్యములు గల గ్రంథము నీశ్వరకృతమైన ధర్మశాస్త్రమని చెప్పి పేరు పెట్టుటకంటె క్రూరకిరాతకృతమైన యధర్మశాస్త్రమని దానికి నూతన నామకరణము చేయుట యెంతయు యోగ్యముగానుండును. క్రూరాచార పిశాచ ప్రభావముచేత నంధులయి యెట్టివారును దమలోనున్న దురాచారముల స్వరూప స్వభావములను జూడలేకపోదురుగదా! స్త్రీజాతికెల్ల నలంకారమయిన పాతివ్రత్యమును ధర్మశాస్త్రములను నిరర్థక నామమును వహించిన పాపపుస్తకములు బ్రాహ్మణేతర జాతులనుండియపహరించి తుచ్ఛేంద్రియ సుఖలోలురయిన బ్రాహ్మణపశువులకామాగ్నికా యబలల బలిపెట్టుచున్నవిగదా. ఆయుక్తప్రదేశమునందు స్త్రీలకువివాహము లేదు; పాతివ్రత్యము లేదు; బిడ్డలకు తండ్రియెవ్వఁడో నిశ్చయము లేదు. అందుచేత దాయము స్త్రీపరంపరకే వచ్చును. ఈ దాయమునకు మరుమక్కదాయమని పేరు. మరుమక్కశబ్దమునకు మళయాళభాషయందు మేనల్లుఁడని యర్థము; దీనినే కన్నడభాషయందు అళియసంతానమని చెప్పుదురు. అళియ యనఁగా మేనల్లుఁడు.

ఈవిధముగా నిజమయిన వివాహము లేకపోయినను, ఆదేశమునందు ప్రతి స్త్రీకిని రజస్వలకాకముందు తాళికట్టను పేరితో నొక వివాహప్రహసనమును నడుపుదురు. తాళియనఁబడెడు పుస్తెను కన్యకకు బ్రాహ్మణుఁడుగాని స్వజాతిపురుషుఁడుగాని మెడకుకట్టును. ఈదేశమునందలి వివాహములవలెనే జ్యోతిష్కులు వధూవరుల

జన్మపత్రములను పరిశోధించి యిరువురి గ్రహనక్షత్రాదులు ననుకూలముగానున్న
యెడల వైభవముతో వివాహము చేయుదురు. పెండ్లికొమారుఁడుచేత నొకకత్తిధరించి
బంధువర్గముతోఁ గలసి వాద్యములతో నూరేగుచువచ్చి వాద్యములతో నెదుర్కొన్న
తరవాడిలోని వారితో పెండ్లిపందిరికిఁబోయి పెండ్లికొమార్తెతో సరసను పెండ్లిపీట
మీఁదఁ గూరుచుండి కత్తి క్రిందఁబెట్టి మెడకు శతమానముకట్టును. పిమ్మటఁ బెండ్లి
కూఁతురు బాణమును చేత ధరించును. అప్పుడు బ్రాహ్మణులును బంధువులును వధూ
వరుల నాశీర్వదింతురు. ఈవిధముగా మూఁడుదినములు పెండ్లితంతు నడిచినతరువాత
నాలవదినమున వధూవరులు స్నానముచేసి యేకవస్త్రమును ధరించి పెండ్లికూఁతువారి
యింట నొక్క విస్తరిలో బువ్వముబంతి భుజించి తరువాత తిన్న విస్తరిని రెండుగాఁ
జీల్చి ధరించిన బట్టను నడిమికి చింపుకొందురు. అక్కడితో వివాహబంధ విసర్జన
మగును. అనఁబడు నాఁటినుండియు భార్యభర్తనువిడిచిపెట్టి స్వైరిణియయి తనయిష్టము
వచ్చినవానితో సుఖింపవచ్చును. తనకంటె తక్కువజాతివానితో మాత్రము కలియఁ
గూడదు. నంబూరిబ్రాహ్మణులు భూదేవతలనియు వారియొక్క సుఖమునిమిత్తమై మళ
యాళదేశములోని స్త్రీలందఱును సృజియింపఁబడిరనియు, జనులలోఁగల వెఱ్ఱి యభి
ప్రాయమిప్పుడిప్పుడు కొంత వదలుచున్నది. అయినను బ్రాహ్మణప్రభావమేమోగాని
యాదేశమునం దిప్పటికి సహితము దేశపరిపాలకులయిన క్షత్రియులస్త్రీలుకూడ
బ్రాహ్మణులసేవించి వారివలననే సంతానమును గనుచున్నారు. కాఁబట్టి యాదేశము
నకు పరిపాలకులుగావచ్చు రాజుల తల్లులందఱును బ్రాహ్మణులే. రాజకుటుంబములో
నుండు స్త్రీలందఱును బ్రాహ్మణులకు భోగస్త్రీలు మహారాజుయొక్క మరణానంతర
మాతని సొత్తులో నరకాసును చేసికొన్న భార్యకుఁగాని కన్నబిడ్డకుఁగాని చెందదు.

కుటుంబములోనివారిలో నందఱికంటెను వయస్సుచేత పెద్దవాఁడుగా నుండు
వాఁడు తరవాడికి కర్ణవానుఁడుగానుండును. అతఁడు తరవాడిలోఁ జేరినవారెంత
దూరపువారయినను వారినందఱిని సమానముగా నాదరింప వలసినవాఁడయినను
స్వభావమునుబట్టి సాధారణముగా దగ్గఱివారియం దధికాదరముచూపి దూరపువారి
ననాదరణచేయుచు మిగులుపన్ని కుటుంబస్వత్వములోనుండి సొమ్ముమిగిల్చి రహస్య
ముగా తన భార్యాపుత్రుల కిచ్చుచునుండును. తరవాడిలోఁజేరిన స్త్రీలెవ్వరును కర్ణ
వానునియొక్క యనుమతిలేక భర్తలతో కాపురముచేయుటకయినను ఇల్లువిడిచి
పోఁగూడదు. అట్లు పోయినపక్షమున, కుటుంబపు సొత్తులోని స్వత్వమంతయుపోవును.
భర్తల నేర్పఱచుకొనుటలోఁగాని బిడ్డలకు విద్యచెప్పించుటలోఁగాని స్త్రీలకేవిధమైన
స్వాతంత్ర్యమునులేదు. పడుచులకు భర్తల నేర్పఱచువాఁడు కర్ణవానుఁడుగాని తల్లి

దంపతులుగారు. అందుచేత వివాహసంబంధములు సాధారణముగా కన్యలసుఖలాభముల నిమిత్తమయి చేయఁబడక కర్ణవానుని ధనలాభమునిమిత్తమే చేయఁబడును. కుటుంబ యజమానుఁడయిన కర్ణవానుఁడేర్పఱిచినభర్తను స్త్రీ నిరాకరింపఁగూడదు. ఆమసలి వానికి కోపమువచ్చి యదివఱకున్న భర్తను విడిచిపెట్టుమని యాజ్ఞాపించినపక్షమున, నలుగురు బిడ్డలతల్లియైనను భర్తను తత్క్షణమే విడిచిపెట్టి యతని సెలవయినచో వేఱొకభర్తను స్వీకరింపవలెను. అందుచేత పురుషుఁడెప్పుడును తనభార్య తరవాడి యొక్క కర్ణవానునికి కోపమువచ్చినపక్షమున నతఁడేనిమిషమునఁ దనభార్యను బిడ్డలను ఎడఁబాపునోయని భయపడుచు, వానిని దక్షిణలిచ్చి యనుసరించుచుండవలెను. కర్ణవానునికి కుటుంబములోని యేస్త్రీమీఁద కోపమువచ్చినను, అతఁడు తన యిష్టానుసారముగా నదివఱకున్న భర్తను లేవఁగొట్టి స్త్రీ యిష్టపడని మఱియొకభర్తనంటఁగట్టవచ్చును. భర్తలయొక్క యాజ్ఞలకు లోఁబడవలసినవారుగాక బ్రాహ్మణుల యొక్క యింద్రియసుఖార్థమే తాము జన్మమెత్తితిమని భావించుచు తమ యిచ్చవచ్చినప్పుడెల్లను వెనుకటిభర్తనువిడిచి క్రొత్తభర్తను వరించు స్వాతంత్ర్యము కలవారయి తమకిష్టము లేకపోయినను కుటుంబయజమానుని యాజ్ఞానుసారముగా ప్రాఁతబట్టలను వలె భర్తలను విసర్జింపవలసిన స్త్రీలుగల దేశమునందు పాతివ్రత్య బీజమంకురించి యెట్లు వృక్షమయి వెలయఁగలుగును? స్త్రీలస్థితి యిట్లుండఁగా పురుషుఁడు సహితము తనకెక్కువ యందకత్తె దొరకినను యౌవనవతి దొరకినను అదివఱకున్న భార్యను విడిచి క్రొత్తదానిని చేకొనును. పురుషునకు భార్యనుగాని బిడ్డలనుగాని పోషింపవలసిన భారము లేదు. స్త్రీ విద్యాభ్యాసము కొంతకాలముక్రిందట మళయాళదేశములో నధికముగానున్నను, ఇప్పుడది యంతకంతకు క్షీణించుచున్నది. పూర్వకాలమునందు సహితమా యల్పవిద్య యీదేశమునందలి వేశ్యలలోవలెనే పురుషుల నాకర్షించుటకొఱకే యుపయోగపడుచువచ్చెను గాని పాతివ్రత్యమును పెంపొందించుటకుఁ గాదు. ఆకాలమునందు నంబూరి బ్రాహ్మణులు తమ బ్రాహ్మణభార్యలు విద్యాగంధ మెఱుఁగని మూర్ఖురాండ్రుగా నుండినందున విద్యావతులయిన నాయరు స్త్రీలతో కాలక్షేపము చేయుచుండిరి. ఈకాలమునం దంతకంతకు నాయరు కాంతలు విద్యాభావముచేత విప్రాంగనలతో సమానురాండ్రగుచు రాఁగా వెనుకటి సమ్మోహనశక్తియు తగ్గుచున్నది. పురుషులవిద్య సహితమా దేశమునం దంతగా వృద్ధిపొందుట కవకాశము లేదు. కొడుకునకు విద్యచెప్పింపవలసిన భారము కన్న తల్లిదండ్రులయందు లేక యెక్కడనో దూరబంధువైన కర్ణవానునియందుండుటచేత బహుతరముగా బాలుర విద్యావిషయమయి కూడ కుటుంబ యజమానుఁ డంతగా శ్రద్ధవహించుటలేదు. తండ్రికొకవేళఁ దన

కొడుకులకు విద్య చెప్పింపవలెనని యున్నను కర్ణవానుని యిష్టము లేక భార్యను బిడ్డలను తన యింటికిఁ గొనిపోయి యుంచుకొని విద్య చెప్పింపనుగూడదు; తానువచ్చి భార్య యింటివద్దనుండి పిల్లలకు విద్య నేర్పను రాదు. అందుచేత తరవాడిని విడిచి వేఱుగా నుండఁ దటస్థించిన యెక్కుడనో కొందఱి విషయములోఁ దక్క సాధారణముగా విద్యాభివృద్ధికి మార్గము లేదు. అటువంటి సమయములలో సయితము కారణాంతరములచేత నాకస్మికముగా కర్ణవానుఁడు భార్యాబిడ్డలను తండ్రినుండి యెడఁబాపి బిడ్డలకు విద్యావిఘాతము కలుగఁజేయవచ్చును. ఇవియు నిటువంటివే యింకను పెక్కులును క్రూరమయిన దేశాచారమువలన వచ్చిన యనర్థకములు. నీతిని దేశక్షేమమును గోరు ప్రతిపురుషుఁడును తన శక్తినంతను వినియోగించి దేశమునకీవ్యభిచార కళంకమును తొలఁగింపుటకయి పాటుపడవలెను. దొరతనమువారట్టి ప్రయత్నములు చేయువారికి తోడుపడి దేశమునందు నీతివర్తనమును పెంపొందింపవలయును. దొరతనమువారిప్పుడు చేయవలసినదంతయు కామాంధులయినవారు స్వప్రయోజనపరులయి మానవతుల పాతివ్రత్యభంగమువలననే సుఖపడఁగోరి దుర్నీతిని స్థిరపఱుచుటకయి పలుకు యుక్త్యాభాసములను పెడచెవిని బెట్టి, వివాహబంధముచేత బద్ధులయి సుఖపడు వారి కట్టి స్వాతంత్ర్యమిచ్చుట యొక్కటే. ఇప్పటి శాసనములనుబట్టి భార్యయు భర్తయుఁ గలిసి యేకముగా నుండుటకు స్వాతంత్ర్యము లేదు; తాము సంపాదించుకొన్న ధనమును తమబిడ్డలకిచ్చుటకు స్వాతంత్ర్యము లేదు; తాముగన్న సంతానమునకు తాము సంరక్షకులుగా నుండుటకు స్వాతంత్ర్యము లేదు. ఈ నిర్బంధముల మూలమున నా దేశమునందు నిజమయిన వివాహసంబంధమే లేదు. కాఁబట్టి యీ నిర్బంధములను తొలఁగించి భార్యనుండి భర్తను భర్తనుండి భార్యను నెడఁబాపెడి యధికార మితరులకు లేకుండఁ జేసి వ్యభిచారమును వివాహమునుగా మార్చుట ప్రజలక్షేమమును కాంక్షించెడు ప్రభుత్వము వారికి ముఖ్యకర్తవ్యము.

కస్తూరి.

ఎల్లవారును కస్తూరిని జూచియుందురు. ఇది యొకజాతి లేడియొక్క నాభి సమీపమునందుండు తిత్తినుండి లభించునదియగుటచే దీనిని మనవారు మృగనాభియని చెప్పుదురు. మనకు సాధారణముగా శ్రేష్ఠమయినకస్తూరి దొరకదు. ఒక చిన్న మెత్తుమంచి కస్తూరిని బరిణెలో వేసి యొకగదిలో నుంచినక్షమున, బరిణెలోని కస్తూరి యెంతమాత్రమును తగ్గకయే సంవత్సరములకొలఁదిని గదియందంతటను సదా పరిమళము వ్యాపించి యుండును. మనకు కస్తూరి నిచ్చెడు లేడిరూప మీక్రింది పటమునఁ జూపఁబడినది—



కస్తూరిమృగము.

ఈమృగమించుమించుగా మేఁక అంతయుండును. దీనికి కొమ్ములుండవు. పైదౌడయందు రెండువైపులను రెండుకోఱలుండి, అవి క్రిందిదౌడవఱకును వ్యాపించి మెలితిరిగియుండును. కోఱలుగాక యీమృగమున కిరువదియాఱు పండ్లుండును. దీనివెండ్రుకలుపొడుగుగాను బిరుసుగానుండును; ముట్టెపొడుగుగానుండును. దీనికడుపుమీఁద బొడ్డుకుసమీపమున రెండుమూడంగుళములు వ్యాసముగల యొకతిత్తియుండును; ఆతిత్తి మూడంగుళములనిడుపును రెండంగుళముల వెడల్పునుగలదయి, అంగుళమునరపొడుగుగల సగముభాగము కడుపుమీఁద పైకిని తక్కిన సగముభాగము లోపలికిని ఉండును. ఈతిత్తిలోని కొకవిధమయిన ద్రవమూరుచుండి, అది కస్తూరిగా మాఱుచుండును. మనముచూచెడి కస్తూరి పరిశుద్ధమయినదికాదు; అంగళ్లయందు విక్రయింపఁబడెడు కస్తూరి యెండినరక్తముతోను మఱికొన్ని యితరపదార్థములతోను గలిసియుండును. కస్తూరి లేడి ఋతువయియున్న కాలమునందు కస్తూరి పరిపూర్ణదశను బొంది మిక్కిలి పరిమళవంతమయియుండును. ఆకాలమునందామృగము దురదచేత చెట్లకును రాళ్లకును రాచుకొనును. అప్పుడు చెట్లకును రాళ్లకును పట్టినకస్తూరి శ్రేష్ఠమయి యధికసువాసనగలదయియుండును. కస్తూరినిమిత్తము జనులీమృగమును వేటాడుదురు. ఒక్కజంతువును చంపినప్పుడు దానితిత్తిలోనుండెడుకస్తూరి యొకతులమునకంటె హెచ్చుగానుండదు. అందుచేత కస్తూరి మిక్కిలి ప్రియముగా విక్రయింపఁబడును. చిన్నతోలు సంచులలోవేసి విక్రయమునకుఁబంపఁబడెడి యీకస్తూరి చక్కగా పక్వమైనదికానందున, తగినంత పరిమళము కలదిగానుండదు. హిందూ చీనాదేశ మధ్య పర్వతములలోను, హిమవత్పర్వతములలోను, కస్తూరి మృగములు విస్తారముగానున్నవి.

రామాభ్యుదయము. (౧౮౦-పుట శేషము.)

గీ. అలసమునం దూర్ధ్వలోకంబు గెలువఁదలఁచి । తార్క్ష్యశింజిని నర్ధచంద్రంబనంగ
నాభినామంబు గంభీర నాభియొకతె । దీర్చెఁ గనుబొమ్మ నడుమనా ధీరమణికి.
గీ. భువనపావనియగు గంగ పుట్టినిల్లుఁ । దపసి యిల్లాలి ప్రాణదాతయును నైన
యారఘూత్తము నమలతరాంఘ్రి నొకప । డంతి బిరుదంపు గండపెండారమిడియె.
క. నక్షత్ర కంఠమాలిక । చక్షుఃపర్వముగ రామచంద్రునకుం బ్ర
త్యక్షామృతకరునకుఁ బ । ద్మాక్షీమణియొకతె యిడియెనను గుణలీలన్.
ఉ. చందనగంధి యొకర్తు రఘుచంద్రునకున్ నెఱపూఁతలాగునన్
గందములంది బాసికము గట్టి మణీమకుటంబమర్చి చ
క్కఁదన మొప్ప నెన్నుదుటఁ గస్తురిబొట్టిడి చూచువారి క
య్యుడుకళాకిరీటుఁ డితఁడే యనుటల్ దలపించె నయ్యెడన్.
వ. ఇట్లఖిల మణిభూషణ విశేషాంబరాలంకృత జగన్మోహనాకారుండైన రఘువీరుండు
కౌశికవశిష్ఠ విద్వన్మునీంద్ర పుణ్యాంగనా కృతాశీర్వాదలాజాక్షత దూర్వాంకుర
ప్రసూనాంగీకారుండై సమావర్తన హోమాది శుభనిమిత్త క్రియాకలాపంబులు
నిర్వర్తించి తదనంతరంబున.
శా. గారామొప్ప విభుండు సభ్యజనులం గర్పూర తాంబూల క
స్తూరీకుంకుమ గంధసారముల సంతోషంబు నొందించి శృం
గారాధీశ్వరు నీశ్వరప్రముఖ లేఖస్తుత్య చారిత్రు సా
కారశ్రీధరు రాముఁ బెండ్లికొడుకున్ గావించియున్నంతటన్.
గీ. దగ్గఱెను ముహూర్తవేళ యో దశరథేంద్ర । యేల యాలస్యమని మామ లెచ్చరింప
మహితమణి హేమవస్తు సామగ్రి మెఱయఁ । గ్రంతనడిపించి తామును గదలిరపుడు.
గీ. అసమసౌభాగ్య భోగభాగ్యముల మెఱసి । పసిఁడిపక్కెర తేజి సాంబ్రాణి నెక్కి
కదలునపుడు వివాహ లక్షణము లెన్ని । యన్నియును రామచంద్రునియందె యలరె.
వ. కదలియచ్ఛద్మ పద్మరాగరత్న దీపమాలికా జ్వాలికానిర్ధూత తిమిరసర్గంబగు రాజ
మార్గంబతిక్రమించి వందివైతాళికాపార గద్యపద్య గీతికాచాతుర్యంబును విలోక
నాసక్త మత్తకాశినీజన కలకలంబును వినుచు నతి విచిత్ర నర్తనప్రకారంబులఁ
గనుచు వృద్ధవాచావశంవదుండును లజ్జావనతవదనుండునునై యా జనకరాజ
సదనంబుఁ బ్రవేశించి కక్ష్యాంతరంబులు గడచి కన్యావలోకనానురాగంబు తమకంబుఁ
గయికొల్పఁ గల్యాణాగారంబుచేర నరిగెనంతట.
శా. బంగారంపుఁ బడంతితోడ సవతై భాసిల్లు పద్మాక్షియో
యంగశ్రీధర చంచలాలతయొ యుద్యజ్జీవరత్నంబొ త

స్వాంగీరూపముఁ దాల్చుక్రొన్నెలయొ నానాజానకిన్ బెండ్లికూఁ
తుం గావించి వివాహవేదికకుఁ గాంతల్ దెచ్చిరుత్కంఠతన్.

వ. అప్పుడు రాజకుమారమణి మణిమయాసనంబున సమాసీనుండై వశిష్ఠాది బుధజనోప
దిష్ట మార్గంబున జనకరాజన్య మూర్ధన్యుండు యథావిధిం దనకు నొసంగు మధుపర్క
శోభనోపచారంబు లంగీకరించి సమగ్ర హర్షంబునఁ గన్యాదానోదక ధారాపరి
గ్రహణంబుచేసి తెరమఱుంగున వెలుంగు మెఱుంగుబోఁడిన్ గదియవచ్చె నప్పు
డొండొరులం గనుంగొనుకోరిక లీరికలుగొనఁ గీరవాణులు గల్యాణంబులు పాడఁ గుతూ
హలంబున వధూవరులు సిరులు దళుకొత్తఁ గ్రొత్తచెలువంబునం బొలిచిరయ్యెడ.

ఉ. గాలవకణ్వగార్గ్య భృగుగౌతమకశ్యప శౌనకాత్రిజా
బాలివశిష్ఠగాధిసుత పర్వతనారద ముఖ్యమౌనిశుం
డాలములవ్వధూవరుల దగ్గఱఁజేరి ముహూర్తమియ్యను
ద్వేలతరానురాగమునదిన్ దెరయన్ దెరయెత్తనంతటన్.

గీ. ముత్తియంబులు దోయిళ్ళ ముంచిముంచి । కాంచువారల హర్షాబ్ధి ముంచిముంచి
మించి తనచేయిమీఁదు గావించిమించి । విభుఁడు తలఁబ్రాలువోసె నవ్వేళఁ బ్రేమఁ.

క. వరుఁడిడు ముత్తెపుఁ దలఁబ్రా । ల్నెరసినయన్నడుమఁ బొలిచినిల్చెన్ సీతా
తరుణి తెరగడచి రత్నా । కరమునఁ గనుపట్టుకలిమి కన్నియపోలెన్.

చ. సరసిజగంధి లెచ్చరిక సల్పఁ గరంబుల దోయిలించి దా
శరథిశిరః కిరీటమున జానకిముత్తెపుసేసఁ జల్లె ని
ర్ఝరపతి గంగ మేరు శిఖరంబున శుభ్రతరంగశీకరో
త్కరములు నించు చందమునఁ గంకణనాద వినోదమొప్పఁగన్.

ఉ. హాటక గర్భదైవత మహర్షులు దీవనలియ్యఁగా నిరా
ఘాటము తద్వధూ మధురగానము నింగిఁ జెలంగ జానకీ
పాటలగంధి కంధర శుభప్రదవేళఘటించె నాజగ
న్నాటకసూత్రధారి రఘునాథుఁడు మంగళసూత్రమయ్యెడన్.

క. కనదమృతమయము బుధరం । జనమున్నైమించు రామచంద్రు కరస్ప
ర్శన మొదవ వింతసిరిఁ గై । కొని యలరెన్ జానకీ చకోరాక్షి దగన్.

వ. తదనంతరంబున బంధుగురుపురస్సరంబుగాఁ గళ్యాణవేదికడకువచ్చి యేకపీఠా
సనులై యవ్వధూవరులు గలసి కూర్చుండ విధ్యుక్తాచారంబున శుభహోమ
కృత్యంబులు నిర్వర్తించునప్పుడు.

చ. ఇరువురసిగ్గు గ్గలపు లేవఁ గచాకచిఁ జైకొనన్ ముఖాం-
బురుహయుగంబువాంచి తలఁప్రుల్ మదినువ్విళులూరఁ జూపులొం
డొరులపదంబులందొరయ నొండునెపంబున మోముఁ లెత్తి ప
ల్లటు మఱువెట్టి చూడ నెడమంగుడినేయఁ దొడంగెఁ గంతుఁడుం

చ. చెలఁగి వివాహవైభవము చేకొని రాముఁడు సీతయున్ శిఖిన్
వలగొనివచ్చి సప్తమునివందనమున్ గురువృద్ధ బంధు మం
డల యుగపత్ప్రణామము నొనర్చి పరస్పర లజ్జలాత్మరం
జిలఁదగు వారితోడుత భుజించిరి బువ్వమునన్ వధూవరుల్

వ. తత్ప్రకారంబున.

క. అనఘమతి ధారవోసెన్ । జనకుఁడు సౌమిత్రిభరత శత్రుఘ్నులకున్
వనితారత్నమునూర్మిళ । వినయవతిం బుణ్యమాళవినిశ్రుతకీర్తిన్.

వ. ఇట్లు రఘుకుమార చతుష్టయంబునకు వివాహంబుఁ జేసి జనకుండు తదనంతరంబునం బరిణయోత్సవాభీష్టదానంబుల నిఖిలబుధ వితానంబులకు సంతుష్టిఁ గావించి యుత్తుంగ మదమదావళ తురంగ రథసహస్ర ముక్తాఛత్రరత్న శిబికానేక దాసదాసీజన సమస్త వస్తుప్రాజ్య ధరణీరాజ్యంబును వివిధవర్ణస్వర్ణ మణిమయాభరణంబులు నరణం బొసంగినం దదాదేశంబునం జననీజనక బంధుమిత్ర కళత్ర సహితంబుగా రాఘువేశ్వరులు మగుడిచనం దత్కాలకలం బాలకించి.

క. ఆవేళ భార్గవుఁడు ప్రళ । యావసరార్కప్రతాపుఁడై యతికుటిల
భ్రూవికటనిటలతటుఁడై । త్రోవకు నడ్డంబుగా నెదుర్కొని పలికెన్.

ఉ. ఎవ్వఁడవీవు నాయెదుట నిట్లు శరాసనబాణపాణివై
క్రొవ్విభయంబులేక యెటకుంజనువాఁడ వనేకభూపతుల్
ద్రెవ్విరిమత్కుఠారనిహతిన్ భృగురాముని నన్నెఱుంగవే
ఒవ్వకుఁ గాలుఁ ద్రవ్వెదవు నజేయధనుర్ధర సార్వభౌమునిన్.

క. నావుడు సద్విప్రుఁడవు వ । యోవృద్ధుఁడ వింతె కాదు యోగివి నీతో
రావంగడంపు రాముఁడ । నేవిధి రణమాచరింతు నెఱిఁగింపఁగదే.

వ. అనినవిని.

శా. ఏనున్ రాముఁడ నీవు రాముఁడవె యోరీ రాజపుత్రుండ వీ
వైనన్ సాధ్వసమేమిరా వినవె మున్నస్మత్కుఠారోగ్ర ధా
రానిర్భిన్న సమస్తభూవరతనూరక్తంబులన్ శాస్త్ర వి
ద్యానీతిన్ బితృతర్పణాబొసఁగితిన్ ధైర్యంబవార్యంబుగన్.

గీ. పూని గుబ్బలి రాచవిల్కాని తోడఁ । గూడి విలువిద్య గావించినాఁడ నన్ను
నక్కుమారుండు గెల్వలేఁడయ్యెఁ దోడరి । యొక్క నుసికిల్లు విఱిచి పెల్లుబ్బనేల.

క. పురహరుని విల్లువిఱుచుట । యరుదే చిరకాలజీర్ణ మది యిప్పుడు నా
కరకలిత విష్ణుచాపము । నిరుపమభుజశక్తి నిధివి నీ వెక్కిడుమా.

క. పోవిడువనేర్తు నేనిను । నావిల్లెక్కిడినఁ గాక నా విని యేలం
యీ వాచాలత కను నా । లావు భవచ్చాపమేమి లక్ష్యము నాకున్.

మ. అనిభుగ్నభ్రుకుటీకరాళవదనుండై చండిమావార్య శౌ
ర్య నిరూఢిన్ భృగురాము కార్ముక మనాయాసంబు గావించి యా
గౌనయం బెక్కిడి టంకృతల్ సలిపి తళ్కొందూపు సంధించి యి
ట్లని పల్కెన్ రఘురాముఁ డయ్యెడఁ దదీయాహంక్రియాధిక్రియన్.

క. తొడిగితి నే నిది నిఁక నీ । యడుగులు దెగిపడన మోఘమస్త్ర ద్బాణం
బెడయన్నేరదు నావుడు । వడవడ జమదగ్ని సూతి వడఁకెన్ భీతిన్.

గీ. అపుడు దశరథరాము బాహాపటుత్వ । సత్వసంపదఁ గాంచి యాశ్చర్యమంది
సురగరుడసిద్ధసాధ్య కింపురుషవరులు । జయజయనినాదముఖరులై సంతసిలిరి.

గీ. భార్గవుని యందుఁ గలకళా పటిమదక్కె । నంత వైష్ణవధర్మంబు నంతు కెక్కె
నౌరయ రఘురాము చేతనే నిల్చెనప్ప । డన్యులకు నంతపని సాధ్యమగునె తలఁప.

వ. అంత భార్గవరాముండు రఘురాముని నుతియించి యిట్లనియె.

క. నీవా చతుర్భుజుండవు । గావున నెక్కిడితి నిట్టి కార్ముకమింకన్
నీవిజయము నాయది శ్రీ । దేవుని యంశమునఁ బుట్టితిమి మనమనఘా.

క. ధరయెల్లను గశ్యపునకు । నరవరమును ధారవోసినాఁడఁ జరింతున్
బొరిఁబొరి మహేంద్రశిఖరిన్ । జగణము వేయకుము సుకృతశాలివి తలఁపన్.

గీ. కడఁగి మత్పుణ్యలోక మార్గంబు వేయు । మంఘ్రి యుగ్మంబు మన్నింపుమసమశౌర్య
యనిన నట్ల చేసె జయాంకురంబు । డెందమునఁ బాదుకొన రఘునందనుండు.

వ. అంతనప్పరశురాముం డనక్రవిక్రమాభిరాముండగు రఘురామునకుఁ బ్రదక్షిణం
బాచరించి వినుతించి మహేంద్ర పర్వతంబునకుం జనియె నయ్యెడ దశరథుండు
భార్గవు గెల్చి నప్రతిహత ప్రతాపంబునకు మెచ్చి యచ్చెరువునొంది యానందించి
యక్కుమారు నుపలాలించి సకల సేనాసమేతుండై యభంగ మంగళవాద్య కోలా
హలంబు భూనభోంతరాళ గోళంబునం బ్రబలం జని యయోధ్యానగరంబు సొచ్చి
రాజమార్గంబునం బోవునెడ సౌధోపరి పురంధ్రీ జనంబులం గనుంగొనె నివ్విధంబున.

చ. కలికియొకర్తు రాముని జగత్త్రయమోహన దివ్యరూపమున్
గళపటుని గ్రహించు పసఁగాంచు తమిన్ గటిఁబూని మేఖలా
వలయముగీలుకొల్ప మఱువన్ దిగజాఱిన యప్పుడవ్వధూ
కులమణి కోమలాంగలతకున్ గుదురుంబలెనొప్పెఁ జుట్టుచున్.

గీ. ఒకతె ముంగరముత్తెపు నొక్కుయత్తివ | యందుకొనఁ గేలి కెంజాయ నరుణమైనఁ
గాంచి దాడిమబీజశంకను గరాగ్ర | కేలికాకీరముఖమునఁ గీలుకొల్పె.

గీ. మేడపైనెక్కి రఘురాముఁ జూడఁదివిరి | హారలత మల్లికాదామమనియొకర్తు
కప్పుకొప్పున నిడనది యప్పుడొప్పెఁ | దారకాపంక్తి గర్భితాబ్దంబువోలె.

వ. ఇట్లు పౌరవధూజనంబు లపారపారవశ్యంబునొంద నగరు ప్రవేశంబుచేసి వృద్ధగురు
బాంధవ ప్రేరణంబున నొక్కనాఁడు శుభలగ్నంబున యామినీసమయంబున రామ
చంద్రుండు నవ చకోరలోచనాసక్తి కలితానురాగరస తరంగితాంతరంగుండై.

చ. సరసకళావదావద విశారదపంజర శారికా శుకో
త్కరమును రత్నదీపకళికారుచిరంబును ధూపవాసనా
పరిచితమున్ మధువ్రత తపఃఫలదాయక పుష్పమాలికా
సురభియునై వితానముల శోభిలు కేళి గృహాంతరంబునన్.

గీ. అధిపుఁడు మనోజ్ఞశయ్యనున్నంతసఖులు | సమయసముచిత సకలభూషావిశేష
రంజితాకారఁ జేసి సంభ్రమమెలర్ప | నత్తుకొనివచ్చిరొయ్యన నతివనపుడు.

గీ. సిగ్గువెనుకకుఁ దివియఁగ నగ్గలంపు | రాగరజ్జువు ముందుకు సాగఁదివియ
నందులకుఁదోఁపుతోఁదోఁపులాడఁ జెలులు | నడుమఁ జిరపఁకులయ్యె నప్పుడతివపుడు.

గీ. మగువలజ్జాభరంబున మాఱుకొనుచుఁ | జెలులవాగంకుశంబుల చేతఁ భీతిఁ
గాంతుని భుజాంతరపుఁ గట్టుకంబమునకు | మదనమదనాగమోనాఁగఁ గదలివచ్చె.

వ. ఇట్లు సఖీజన సాహాయ్యంబున వచ్చి శయ్యాసమీపమణిమయ స్తంభంబు చాటున
నడుగు గదలక మనోభవ జయ స్తంభంబననున్న కన్నియమొలంగి యచ్చెలులు
విభునకుంగనుగిరపి యొండొరులొక్కక నెపంబున నొయ్యనొయ్యనం జనిరయ్యెడ.

క. తలవంచి లజ్జ పెంపునఁ | జెలువ పదాంగుళుల నేలఁజిమ్మున్ బతిముం
గలనిలిచి పల్లవాయుధ | కలహమునకుఁ గాలు ద్రవ్వుగతిఁ జిత్రగతిన్.

గీ. స్తంభగతరత్నపుత్త్రిక తనకుఁబోటి | యని విలోకించి తోడ మాటాడకునికి
నలుగడలుఁ జూచి తెలిసి యచ్చెలువ బెదరి | వెడలనూహింపఁ జేఁ దమ్మి మొడిసిపట్టె

గీ. దశరథ మహానరేంద్ర నందనుని చేత | నతను విక్రమధనుని చే మత్తుఁదలంకి
యామహీనాథ రాజకన్యాలలామ | తగులువడె నప్పుడేమి చోద్యంబుతలఁప.

చ. నెలయగుఁదతత్క్షణంబ రమణీముఖమెత్తఁగఁ జూచుకోర్కియు
గ్గలిజిగియారునంటు తమకంబునఁ బాటిలు దీర్ఘకాలమై
కలయికనుబ్బు పెంజెమటఁ గన్గొనుకూరిమిఁ జెక్కువర్షముల్
మలయుటదోఁచునప్పతికి మానినిఁజైకొను తత్తరంబునన్.

క. శయ్యాకఁదార్చియనంగుని । సయ్యాటపుఁ జిట్టకంపుఁ జదురులకపుడా
యయ్యాదొరఁకొని ప్రియోక్తుల । నయ్యువతిన్ గలయుత్కహాతహం బ్రార్థించెన్.

ఉ. అంగననాకుఁగొంగు ముడివైచెతగు నీవిపుడిచ్చు నీవి త
న్వంగి! భవన్మనోజ్ఞమధురాధరకాంచన కాంచికాస్థలుల్
తంగెటిజున్ను ముంగిటి నిధానము నౌనటుగానఁబాయలే
నంగజునాన నాదు హృదయం బెఱుఁగున్ వలపంబుజాననా.

గీ. తరుణి! నినుఁగన్న జనకుం డుదారగుణ స । ముద్రుఁడదిగాక సంపద ముదితనీవు
చేవదలవేఁకరుణ వీక్షించి యొక్క । విడెమిడఁగరాదె యీపోకముడివదల్చి.

చ. అనిచతుర్వోక్తి నేఁడుకొని యల్లన నంకతలంబుసేర్చి పే
ర్చినతమిచేవడంక నునుఁజెక్కిలినొక్కి కవుంగిలించినన్
దనువునఁ గంపమొందీ తనుదాసడలెన్ దృఢనీవి బంధమో
చనమగుటద్భుతంబె రఘుచంద్రుని ప్రాపొక యింతఁగల్గినన్.

క. వనితయపుడమిత లజ్జా । వనతాననయగుచునుండ వల్లభుఁడటఁ గ
న్గొనిసతికిఁగూర్మి నాడమన్ । బనిగొనియెదఁగాక యొకయుపాయము కతిమిన్.

వ. అనితలంచి.

గీ. కప్పురముగుల్కు కమ్మబాగాలు మడుపు । లతివచేనిడి తానవి యందుకొనియెఁ
జిట్టకంపుఁదనాలకుఁ జేయిచాచి । విడెముపెట్టుననంగ నవ్వేళవిభుఁడు.

గీ. కొండలకుసన్న లిడుభంగిఁ గోమలాంగి । పయ్యెదమెరంగి చనుదోయి పజ్జదార్చి
నధిపుఁడు కరంబుచాఁచి నూగారు వల్లి । బాముఁబట్టంగఁ జనువీలఁ బట్టు బూనె.

క. రతిపతిహాళి హాళిం దన । యతిధైర్యధనంబు కొల్లలాడెనటంచున్
గతమిచ్చు కరణినిచ్చెన్ । బతియొక తెలనాకుమడుపు ప్రాణేశ్వరికిన్.

గీ. కచకుచాభోగ గండభాగంబులంటి । యారునిఁక నొక్కటియును నీవంటునీవు
లలనమదినేడు గడగాఁదలంచు నన్ను । నేలుకొనుమంచు వేఁడె నవ్వేళవిభుఁడు.

గీ. కుంతలంబుల వాలారుగోళ్లనువ్వి । యాభిముఖ్యంబునకుఁదెచ్చి యనఁగిపెనఁగి
విడెము చవిగొల్ప నపుడ హా విషమశరుఁడు । విభువధూధైర్యపరిపాటిపీటిఁబుచ్చె.

వ. అత్తఱిం దొత్తరంబున.

చ. అలనృపసూతి శాతనఖరాంకుశభీతి యొకింతసూపి వ
ర్తులనవకుంకుమారుణ గురుస్తనకుంభము లప్పళింపఁ బా
టిలు తమిమేలు పట్టుపుఁగటిం జిఱుగంటలఁబొల్చుదానిఁ జి
వ్వల వలరాయరింగెలుచు వైపునకున్ సమకట్టె నేర్పునన్.

ఉ. చేకొనెఁగట్ట్యసీమలు విచిత్రగతిం గుచశైలసర్గముల్
చేకొనె మధ్యదేశమును జేకొనె నూరుయుగంబులోనుగాఁ
బైకొనెబాహుశక్తి సతిఁజల్మలు నాలమునన్ బెనంగి ర
త్నాకర మేఖలాస్థలము నవ్విభుఁడంతయుఁ జేకొనెం ముదిన్.

వ. ఇట్లు వివిధబంధ విశేషంబులఁజొక్కి యక్కన్య కౌఁగిటందక్కి యిట్లనియె.

ఉ. పంటవలంతికిం బొడమి భాసిలు సీతవుగానఁ జేలతో
నంటినఘుర్మవారిఁ బదనై పులకోదయ సస్యసంపదన్
గెంటకయుస్కినీకతగు నేఁడిట నావ్యవసాయ మేర్పడెన్
గంటినిరంతరానుభవ గౌరవసౌఖ్యముఁ బండెఁగోరికల్.

వ. ఇవ్విధంబున సుఖావహాభీష్ట గోష్ఠీవిహారంబున నారాత్రిగడపి ప్రభాతకృత్యంబులు
నిర్వర్తించి రఘునందనుండు నంత దినప్రవర్ధమాన విభవంబునం దేజరిల్లుచుండె
నొక్కనాఁడు దశరథుండును నిఖిలధరణీరాజ్యాభరణోద్ధారుం డెక్కుమారుండే
యని యతుల శుభలక్షణాభిరాముండగు రఘురామునకుం బట్టాభిషేకంబు గావింప
నుద్యోగించి కులగురుండగు నరుంధతీ మనోహరు ననుజ్ఞ సామాత్యభృత్య బంధు
వృద్ధసమ్మతంబుగఁ దనుచిత ప్రయత్నంబు లాచరించునంతట.

క. అంగ మగధాంధ్ర కురుక । ళింగమహీనాథ మండలీకోటీరా
భంగమణి మహితపదయుగ । రంగమ నామాభిరామ రామారమణా.

మాలిని. కదనజయకిరీటీ ఖండితారాతికోటీ
మదనసదృశరూపా మంజుభాషాకలాపా
సదయహృదయపద్మా సద్మసంసక్తపద్మా
యుదధినిభగభీరా యోబమాంబాకుమారా.

గద్య. ఇది శ్రీమదొంటిమెట్ట రఘువీరశతక నిర్మాణకర్మఠ జగదేకఖ్యాతి ధుర్యాయ్యల
రాజు తిప్పయమనీషి పర్వతాభిధానపౌత్రాక్కయార్యపుత్ర పరిశీలిత సమిద్ధ
రామానుజమత సిద్ధాంతమర్మ మమ్మడి వరదాచార్యకటాక్షవీక్షాపాత్రహృదయ
పద్మాధిష్ఠిత శ్రీరామభద్ర రామభద్రకవి ప్రణీతంబయిన రామాభ్యుదయంబను
మహాప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము.

పంచమాశ్వాసము.

క. శ్రీమన్మందిరవిమత । క్ష్మామండలపతికులాబ్ధి మందరకుధరా
భీమభుజాబలభరితవి । రామా గొబ్బూరి నరసరాజలలామా.

వ. అవధరింపుము తదనంతర కథావిధానం బెట్టిదనిన.

శా. రాముం బట్టముగట్టఁగాఁ దొడరు నార్తల్ సుబ్బిసఁ గైకయీ
నామస్త్రీ పతి పూర్వదత్తవర విఘ్నం బాచరింపన్ సతీ
సౌమిత్రుల్ దనుఁగొల్వఁ గానలకుఁ గౌసల్యావశస్యంద నా
జ్ఞామాత్రంబుధరించి యామిహిరవంశస్వామి యేగెన్ ధృతిన్.

వ. ఇట్లు దశరథుండును దురంత సంతాప చింతాపరాధీన మానసుండయి సుమంత్రుం గనుంగొని యిట్లనియె.

గీ. అవనకాంక్షాపరుండు రాఘవుఁడువాసి । నేఁడువనకాంక్ష నేగుచున్నాఁడు నీవు
రథము గొనితెమ్ము విపినమార్గములసీత । యబలచన లేదు నావుడు నతఁడువోయి.

చ. అరదముఁదెచ్చి పంక్తిరథు నానతివచ్చితిఁ జిత్తగించి దా
శరథి రథాధిరోహణము సల్పుము నావుడు జానకీతలో
దరియు సుమిత్రపట్టియును దానునునెక్కి పురంబువెల్వడన్
నరుల మహార్తనాదము వినంబడియెం దలఁకెన్ ధరిత్రియున్.

వ. ఇత్తెఱంగున ధనుర్బాణతూణీరంబులు ధరియించి వారించినంబోక పురజనం బాబాల గోపాలంబుగా వెనుచన నయోధ్యా నగరంబు వెలువడ దశరథుండు కౌసల్యా సుమిత్రాకరంబు లవలంబించి యంతఃపురంబు నిర్గమించి యొండొరులకుం దోరుగు నీరంధ్ర బాష్పధారావర్షంబులవలన రఘునందన స్యందనమార్గంబు గనుంగొన రామికి వగలంబొగులుచు మగువలమరల్చి రథంబుఁగూడ నరిగెదంగాకయనుచు నాకుత్స్థకువంగడల వసిష్ఠుండువారింప నిల్చి మఱియు నద్దేసం గనుంగొనుచుండె నయ్యెడ.

క. ఎదురఁజను రథముగనుఁగొను । నదిగానక తత్పరాగ మాలోకించుం
దుదినదిగానకయడలున్ । మదిలోనన్ రాముఁగూర్చి మహిపతిమఱియున్.

క. కేకయతనయాదత్త వ । రాకృతి నంధమునిశాప మాహా నేఁటం
జేకూరఁబోలుఁజనునె పు । రాకృత కర్మంబు దుస్తరము పాపవిధిన్.

రామచంద్రవిజయము. (౨౦౮-పుట శేషము.)

రామ — శోభనాచలముగారు —

రాజ — (మాటకడ్డమువచ్చి) శోభనాచలము లేదు గీభనాచలము లేదు నాయింటఁ దిన్నవాఁడవు నీవా శోభనాచలమా? నాకతనితో నేమి? ఒడలెఱుగవు? ఎవరియబ్బ సొమ్మని తిన్నావు? డబ్బు పుచ్చుకోకుండ నీకు మూడుపూటలవండి కుడుపుటకు భయముతోడుట కెవరు నీకచ్చియున్నారు? పో. పో నాయింటనుండి లేచిపో. చెంబు, పట్టుపంచె, నేనియ్యను నడునడు.

అంతకఠినముగా రాజమ్మ మాటలాడినపు డింక నచట నుండరాదని చివాలున లేచి రామచంద్రుఁడు వెళ్లుచుండెను. అంతట నాతనిమార్గ మధ్యమందు వెనుకఁ దనకు రెండురూపాయిల నప్పిచ్చిన సహోధ్యాయుఁ డగుపడి రామచంద్రుని నిలువఁబెట్టి తనసొమ్ము తనకిమ్మని యడిగెను. వారిట్లు మాటాడిరి—

సహో. — ఏమోయి! అప్పుపుచ్చుకొని తిరిగి యిచ్చినావు కావు? ఒకనాడా, రెన్నాళ్ళ? అంత గతిలేనివాఁడ వెందుకు పుచ్చుకొన్నావు? పోనీ. ఎగవేయి. దీనితో నీవు పెద్దకాపురము చేయవు. నేను చెడిపోను మర్యాదగాదు. నేనేలాటి యవసరములో నిచ్చినానో, నీవు నాకాలాగు రెండవకంటివాఁ డెఱుఁగకుండ నీయవద్దా? రేపు నీవీయకపోతివా నీకు నాకు బాగుగా జరుగదు. అనిచెప్పి వెళ్ళిపోయెను.

అతని యదృష్టమేమోగాని రామచంద్రునకు బదులిచ్చినవారును నతనియొద్ద బదులుపుచ్చుకొన్నవారునుగూడ నతనిని నిందింపుచుండిరి. శోభనాచలము సొమ్మిచ్చునని యాశ వానికి, లవమును లేదు. గ్రామమందు తన్నెవరు నెఱుఁగరు. రాజమ్మ లేవఁగొట్టినది. మద్దుల కనకరత్నమియ్యవలసిన యారూపాయికూడ తానీయనక్కఱ లేదని చెప్పెను. అందుచేత మహావిచారముగలిగి నిర్విణ్ణుఁడై సాయంకాలమువఱకు, భోజనము లేనందున కడుపులో మలమలమాడుచుండఁగా, ప్రదోషకాలమున నెప్పటి యట్లాలయమునకుఁబోయి దేవదర్శనముఁజేసి తరువాత మంటపముమీఁదను త్తరీయముఁ బఱచుకొని గ్రుడ్లనీళ్లు గ్రుక్కుకొనుచు, తల్లిదండ్రులు చనిపోవుటయు, పినతండ్రి యన్యాయముగ సొత్తపహరించుటయు, ద్రవ్యనష్టమును, ప్రతిష్ఠలమున తిట్లును, తలఁచి తలఁచి విచారించుచు వెల్లకిల పండుకొనెను. రామచంద్రుని సంగతి నంతయు నెవరివలననో విని శరభరాజుగారి కుమారుఁడు గోపాలము గ్రామమంతయు వెదకి, దేవాలయమునకువచ్చి మంటపముమీదనున్న రామచంద్రునియొద్దకువచ్చి, మొగమోటము చేత నతఁడేమియుఁ జెప్పకున్నను, భోజనము చేయనట్లు గ్రహించి “రామచంద్రుఁడూ! మా బాబయ్యగారు నిన్నొక్కసారి రమ్మన్నారు” అని చెప్పి తీసికొని వెళ్ళెను.

నాల్గవ ప్రకరణము.

అమలాపురమునందుఁగల యిండ్లన్నిటిలో మంత్రిప్రగడ శరభరాజుగారి యిల్లే పెద్దది. రెండువీధి యరుగులకును గచ్చువేయఁబడియున్నది. ఇటికలతోఁ గట్టిన స్తంభములు రెండరుగులమీదను గలవు. రాతిమెట్లతో నిండిన గుమ్మముదాటి లోపలికి పోఁగా నెడమచేతివైపున పెద్ద కచ్చేరిసావడి యడుగువేసిన బారునట్లు నున్ననై తెల్లని పాలగచ్చుతో నిండియుండును. సావడికి రెండుప్రక్కల రెండుగదులుండును. అందులో నొకగదిలో శరభరాజుగారి జ్యేష్ఠకుమారుఁడైన రాజగోపాలము చదువుకొనుచుండును. సావడికెదురుగానున్న వాకిట వేసవికాలముగనుక నొక గొబ్బురియాకులపందిరిగలదు. సావడిమీద కూర్చుండుటకు వెదురుపేళ్ళ చాపయు దానిమీదతివాసులును గలవు. గోడదగ్గర మూడుమూళ్ళ పొడుగున నొక పెద్దదిండు, జేరగిలఁబడుటకు వేయఁబడియున్నది. ఇనుపజాల గట్టులుగల యొక గవాక్షము దిండుపైనుండుటయేగాక సావడిలోనుండి దొడ్డిలోకి పోవుటకు కిటికీకి రెండుప్రక్కల రెండుగుమ్మములును, వానికి తెక్కతలుపులును గలవు. వీధిగుమ్మమునకు నెదురుగా లోగిటియొక్క లోపలిభాగమున్నది. అందు మండువాయును, దానికిరుప్రక్కలను రెండుగదులును, వానికిచేరి వడమటియిల్లును నున్నవి. దొడ్డిలోనొక యుప్పునీళ్ళ నుయ్యి త్రవ్వఁబడియున్నది. నూతికి కొంచెము ప్రక్కగా తులసికోట వేయఁబడియున్నది. ఇంటికి దక్షిణభాగమందు పశువులసాల యొకటికలదు. ఈ యింటియందు శరభరాజుగారు తండ్రి తాతలనాటనుండియు కాపురమున్నవారు. శరభరాజుగారి కిప్పటికి నలువది సంవత్సరములుండును. మొలకు బంగారపుగోవ మొలత్రాడును, చేతులనగిషీ చెక్కిన గుల్లమురుగులును, వ్రేళ్ళకు భటువులును, శరభరాజుగా రెప్పుడును దీయక ధరించుచుందురు. ఆయన పచ్చగా కొంచెము స్థూలశరీరమును, బట్టతలయుఁ గలిగియుండును. శరభరాజుగారికి తొలిచూలు మగపిల్లవాఁడు పుట్టుటచేత సంతోషించి రాజగోపాలమని తమ తండ్రిగారిపేరు పెట్టుకొనిరి. రాజగ[illegible]ము తరువాత తొమ్మిది సంవత్సరములవఱకు శరభరాజుగారికి బిడ్డలు లేరుగాని పిమ్మట నొక కొమార్తె గలుగఁగ, నేడవపురిటినాఁ డప్పటికి నాలుగు మాసములక్రిందట చనిపోయిన శరభరాజుగారి చెల్లెలు స్వప్నములో కృష్ణవేణమ్మకు కనఁబడి పేరుపెట్టుమనినందున, నీ కొమార్తెకు పార్వతియను పేరుపెట్టిరి. ఆమెవెనుక మరల నొక కుమారుఁడు గలిగెను. అతనిపేరు నరసింహము. కృష్ణవేణమ్మ శరభరాజుగారి భార్య. శరీరమున ధరించిన యాభరణంబుల కాంతిని వెలవెలబాఱఁజేయు చాయయు, ఆకర్ణాంతములైన

నేత్రములును, దానిమ్మగింజలవంటి పండ్లును, సన్నని నడుమును గలిగి కృష్ణవేణమ్మ, లావణ్యమందే గాక సత్ప్రవర్తనమందును స్త్రీలలో శిరోభూషణమై మగనిమాట జవదాటక సత్కార్యములయందాయనకుం దగిన ప్రోత్సాహము నిచ్చుచు ననుకూల దాంపత్యమునకు నిదర్శనము వీరేయని జనులు స్తోత్రముచేయునట్లు మహాకీర్తినిగాంచెను. శరభరాజుగారికి సంవత్సరమునకు గొబ్బరి తోటలమీఁదను, భూములమీఁదను, మూడు వేల రూపాయలు వచును. గ్రామమునం దాయన తగు పెద్దమనుష్యులగుటచే వివాదలుగల వారందఱు శరభరాజుగారి యొద్దకువచ్చి తగవులు పరిష్కరించుకొందురు. వెంకటరత్నము శ[illegible]క చేలువిడిచిన పినతండ్రికొడుకు. బాంధవ్యమునందే గాక గుణములయందుసూడ వెంకటరత్నము శరభరాజుగారికి దూరమేగనుక నతని తనయింట నుంచుకొనుటకు నిష్టములేకపోయినను తల్లి ప్రోద్బలముచేత నతఁడింట నుండుట కాయన సమ్మతించెను. చిన్నతనమునందే తలిదండ్రు లార్జించిన రొక్కమంతయు విచ్చలవిడిగా వ్యయముచేసి యన్నవస్త్రములకు లోపమురాఁగానే వెంకటరత్నము వీరియింట ప్రవేశించెను. వివాహము కాకపోయినను, అతనికి సంసారికంటె నెక్కువ తాపత్రయములుగల్గియుండెను. ధనమువచ్చుబడి లేకపోయినను, ద్రవ్యముతో నవసర మెక్కువగ నుండెను. రామచంద్రుఁ డమలాపురమువచ్చిన నాటిరాత్రి వెంకటరత్నము చెలువుగట్టున ప్రవేశించిన యిల్లు వాని భోగస్త్రీయైన చంద్రముఖి యిల్లే. లావణ్యమునం దామెకుఁ జంద్రునితో సమానమైన కాంతి లేశమును లేదు సరిగదా చంద్రునివలె గుండ్రని ముఖముగల్గి చంద్రముఖి నామము సార్థకము చేసికొనునేమో యనుకొన్నను మొగము కొంచెమించుమించుగా మూరెడు పొడుగుండును. కొమార్తెకు సార్థకనామము లేకపోయినను తన చిన్నతనమునుండియు నింటికివచ్చిన యనేక నరుల ప్రాణములపహరించి యపహరించి యప్పటికి జవసత్వము లుడిగియున్న దాని తల్లికి నరహరి యను నామము సార్థకమైయుండెను. చంద్రముఖికి చప్పిదవడలుండుట చేత తమలపాకుల యవసర మెక్కువగ నుండెను. అట్లు రామచంద్రుఁడు రాజగోపాలముతో రాఁగానే శరభరాజుగారతనిని తమయింట నుండుమని బలవంతపెట్టిరి. నియోగపుకులమునందుఁ బుట్టిన రామచంద్రునకు పరగృహ నివాసముచేయుట యభిమానమని తోచినను కాలము తప్పివచ్చినందున శరభరాజుగారి యింటనుండి రాజగోపాలముతోఁగలసి చదువుకొనుచుండెను. వచ్చినప్పటినుండియు రామచంద్రునకును వెంకటరత్నమునకును కొంచెము సరిపడకుండెను. శోభనాచలమునకు స్నేహితుఁడగుటచేత వెంకటరత్నమునకు రామచంద్రునిమీఁద కొంచెము కోపముండుట సహజమే. అది యటుండఁగా వెంకటరత్నము నిలువుబొట్టువాఁడగుటచేత రామచంద్రుఁడా బొట్టు

పెట్టుకొననందుకు నాతనిమీఁద కోపమువచ్చెను. తరువాత కొన్నిదినములకు శరభరాజుగారొకనాఁడు రామచంద్రునితో నేదో రహస్యమును చెప్పిరి. ఆ రహస్యము తనకు చెప్పుమని వెంకటరత్నము రామచంద్రు నెంత బలవంతపెట్టినను, నతఁడు చెప్పనందున వానిపై కోపము ద్విగుణమయ్యెను. అందుచేత వెంకటరత్నము రామచంద్రుఁడొంటరిగా తన కంటఁబడినప్పుడెల్ల పొట్టకూటికిఁ జేరినవాఁడనియు, సర్వజ్ఞత్వము మెండనియు, ఇఁక నిటువంటి యెత్తిపొడుపుమాటల ననుటయేగాక రామచంద్రుని గుఱించి తా నెవరితో ప్రసంగించినను తన శక్తివంచనలేకుండ నతఁడు మంచివాఁడు కాఁడని వారి మనస్సులయందు నాటునట్లుగా చెప్పుచువచ్చెను. శరభరాజుగారును, కృష్ణవేణమ్మయు రామచంద్రుని తమ కుమారునితో సమానముగాఁజూచుకొనుచున్నను వెంకటరత్నము తనయెడల చూపుచున్న యసహ్యతవలన రామచంద్రునకు మనస్స్తిమితము లేకపోయెనుగాని సద్గుణసంపన్నుఁ డగుటచే రామచంద్రుఁడు శరభరాజుగారితోనైనను, లేక తన ప్రాణసమానముగాఁ జూచుకొనుచున్న రాజగోపాలముతోనైనను నీసంగతి చెప్పఁడయ్యెను. రామచంద్రునకు తనయిల్లు వెడలిన తర్వాత పూర్వము తనకిష్టములేని వస్తువులెల్ల నిష్టమయ్యెను. అతఁ డమలాపురమున చదువుకొనుచున్నకొలంది విశ్వనాథశాస్త్రులవారికి వాత్సల్యమును, సహాధ్యాయులకు గౌరవమును, శరభరాజుగారికి ప్రేమయు, రాజగోపాలమునకు మైత్రియు, గ్రామస్థులకు మంచి యభిప్రాయమును గలుగఁజొచ్చెను, గాని వెంకటరత్నమునకుమాత్రము ప్రేమాదులు చచ్చి యసహ్యత హెచ్చనారంభించెను. ఇప్పటికి రామచంద్రుఁడు శరభరాజుగారి యింటికివచ్చి పదిమాసములయ్యెను. అమలాపురమునందు గొబ్బరినీళ్ల నిల్వపడక దేహమునందు రామచంద్రునకు కొంచెమప్పుడప్పుడ శీర్ణముగాను ననారోగ్యముగా నుండుచువచ్చెను. ఆ సంవత్సరమునందు జ్యేష్ఠమాసమున నతనికి తీవ్రమైన జ్వరమువచ్చినది. జ్వరము దగులఁగానే శరభరాజుగారు తమదగ్గఱనున్న శీతాంశురసము మాత్రలనిచ్చిరి. విశ్వనాథశాస్త్రులవారు కొంచెము జలముమాత్రము మంత్రించి త్రాగుమని యిచ్చిరి. అంతటిలోనె యెక్కడనుండియో రెండుపొట్లములఁ దెచ్చి రాజగోపాలము తేనెలోఁ గలపి దగ్గఱనుండి మ్రింగించెనుగాని వెంటనే గుణము కనఁబడనందున సాయంకాల మతఁడు కషాయము నిప్పించెను. శరభరాజుగారి తల్లి యొకప్రాఁతకుండలో మిరియముల కలికెనువేసెను. ఎన్నిచేసినను రోగమెక్కువేగాని తక్కువగానందున శరభరాజుగారు తమయింటి వైద్యుఁడు గ్రామమందు లేఁడని తెలిసికొని, పూర్వమునవృత్తి యేదియు దొరకక వైద్యమారంభించి యనేక జనుల కకాలమరణ పూర్వకముగ స్వర్గలోక సుఖముఁ గలుగఁజేసి ప్రాణమువిసికి వైద్యము

చాలించి సంచి మూల పడవైచిన యొక ముసలివైద్యుని పిలిపించి కుఱ్ఱవానిని జూపి చేయిఁజూడుమని చెప్పిరి. అంతట వైద్యుఁడిట్లు పలికెను—

వైద్య—చేయిఁజూడనక్కఱలేదు. లంఘనములఁ గట్టుండి. ఎన్ని లంఘనములు కట్టిన నంత మంచిది.

రామ— అయ్యా! చిన్నతనమునుండియు నాకు లంఘనములు పడవు. అన్నము తినవలయును.

వైద్య—ఎందుకు పడవు? కన్ని రోగములు తియ్యనిమందులు సరిపడఁగలవా? ఉండలేకపోతే జాడ్యము లొంగునా? కన్నులు మూసుకొని పరుండుము.

శర— అయ్యా! ఎన్ని లంఘనములు పడవచ్చును?

వైద్య—ఇది పురాణజ్వరము. శరీరమున జీర్ణించెను. పదిలంఘనములమీదిమాట.

రామ— అయ్యయ్యో! నేనుండలేనండీ. శరభరాజుగారు! నా తత్వమున కది సరిపడదు.

శర— పథ్యము త్వరగానే పెట్టింతునులే నాయనా. (అని వైద్యునితో) అయ్యా! ఏమిమందు వేయఁదలఁచుకొన్నారు? ఆనందభైరవి వేయవచ్చునా?

వైద్య— ఆనందభైరవి యేమిపని చేయఁగలదు? ఇది భోడవాజాతిజ్వరము. రాకడ వేఱుగానున్నది.

శర— ఏదో యొకటి వేయించండి.

అని చెప్పఁగానే వైద్యుఁ డొకమాత్రనిచ్చి వెళ్ళిపోయెను. జ్వరము కొద్దిదైనను, అది యెక్కువ జ్వరమని చెప్పి యెక్కువధనము గ్రహింపవలెనని దురుద్దేశముగలిగి రోగమెక్కువగుటకు వైద్యుఁడు మందిచ్చెను. తరువాత తాను లొంగదీయవలెనను కొన్నను, రోగము త్వరగా లొంగలేదు. ఉష్ణము నిశ్శేషముగా తగ్గినను లంఘనము లింకను గట్టించి వైద్యుఁడు పథ్యము పెట్టించుట మానిపించెను. ఆ మహానీరసముచేత నొకనాడర్ధరాత్రి రామచంద్రునకు నిస్త్రాణవచ్చి నోటరాక కాలుచేతులు చల్లపడెను. ఆసంగతి నెఱుఁగక యీ గుణములు మఱొకవిధముగా భావించి వెంకటరత్నము శరభరాజుగారి చెవిలో మెల్లగా “రామచంద్రునిపని పూర్తిగా నపస్మారముగా నున్నది. మనకు దక్కఁడని తోచుచున్నది” యని చెప్పెను ఆమాట వినఁగానే శరభరాజుగా రదరిపడి లేచిరి. ఇంటనందఱు తొట్రుపాటుతో లేచిరి. వెంకటరత్నము చాకలివానిచేత వీధిలో గోడదగ్గఱ రెండువెదుళ్లు పాతించి రెండు పెడళ్ళడ్డము వేయించి నాలుగుచాపలడ్డముగట్టించెను. శరభరాజుగారితల్లి చప్పుచప్పున రెండుచేదలనీళ్లు మీఁదపోసికొని తడిగుడ్డతో నటకమీఁదికెక్కి యూరుగాయకుండల

దించుచుండెను. శరభరాజుగారు వైద్యునికొఱకు వర్తమానము నంపిరిగాని జరుగుచున్నసంగతినంతయు విని వైద్యుఁడు తన యౌషధప్రభావము తానెఱుఁగునుగనుక మరణమేగాని మఱొకటి జరుగదని నిశ్చయించుకొనిరాక, తుదకు వర్తమానము లెక్కువకాఁగా శరభరాజుగారికి కోపమువచ్చునని యచటికివచ్చి చూచి "చేతిలో చాల జబ్బుగానున్నది. ఇది విషమజాతి నెగ్గదని నేను మొదటనే యనుకొన్నాను. మందులియ్యఁగలముగాని యాయుర్దాయము పోయఁగలమా" అని చెప్పి యొకచోట గుమిగాఁ గూడుకొనియున్న రాజగోపాల, శరభరాజ, వెంకటరత్నముగారులదగ్గఱఁ గూర్చుండెను. అప్పుడు శరభరాజుగారి తల్లి యన్నపూర్ణమ్మవచ్చి యిట్లుపలికెను—

అన్న— ఏలాగున్నదిరా? నాయనా!

వెంక— ఏమిచెప్పను? ఘుడియలమీదనున్నది. ఇప్పుడో యింకనో.

అన్న— ఆమంచముతీసి వీధిలో పారవేయండిరా. ఇంకా యింట్లో నెందుకు?

శర— తొందరయేమిటన్నా? ఇఁక కొంచెమునేపుండు.

అన్న— కొంచెమునేపేమిటి? ప్రాణము గుటగుటలాడుచున్నది.

శర— నాకాపిల్లవానిజూచిఁ గడుపులోజాలిగానున్నది. అవతలపెట్టించలేను.

అన్న— సామానంతా తగలపడిపోతుంది. ఎక్కడో దిక్కుమాలిన ముండా కొడుకు కోసరము నిక్షేపమువంటి యిల్లు పాడుపడ వెయ్యడాని కాలోచిస్తా వేమి? చెప్పినమాట వినవు. ఏగంగలో దిగేదన్నా? మాయసంతవచ్చింది. ఈ నిర్భాగ్యపు చచ్చినాడు మా యింటికోసర మేదాపరించినాడు.

రాజ— ఓర్చుకమ్మా. యేమియు లేదు, ముందుగా చావుమాటలెందుకు?

అన్న— చావక యీవెధవ బ్రతుకుతాడు? మీరుకూడా వాడితో కట్టకట్టుకొని గంగలోదిగండి. ఒక్కయేడుపేడిచి నోరుమూసుకొని యూరుకుంటాము.

వెంక— అన్నయ్యా! వదత్రిపాది నక్షత్రమట. ఇల్లాఱుమాసములు వదలి పెట్టవలెను. పసువులసాలలోనైన పెట్టించుండి. పోవునప్పు డెక్కడయిన నాకటే.

వైద్య— ఆయుర్దాయమున్న పక్షమున చంపినను చావఁడు. వెనుక నాకొక పర్యాయ మీలాగే ప్రాణముమీఁదికి వచ్చినపుడు మావారందరు నన్ను క్రిందపడవేసికొని కూర్చున్నారు. అంతట నాప్రాణముపోయినది. నలుగురు యమదూతలు నల్లలాగులు దొడుగుకొని రోకళ్ళతోవచ్చి నన్ను తీసికొని మాలకాకివలె నల్లనిదేహముగలిగి యొక సింహాసనముమీఁదఁ గూర్చున్న యొకరాజున కెదుట నిలువఁబెట్టిరి. అతఁడు యమధర్మరాజు. నరకములోపడి యేడ్చువారి కేకలను విన్నాను. అప్పుడు యముఁడు నన్నుఁజూచి దూతలతో "ఓరీ మూర్ఖులారా! మఱొకనినిఁ దీసికొనిరమ్మని పంపిన

వీనిని తీసికొనివచ్చినారేమి" యని చెప్పి నన్నుఁ గ్రిందికి పడఁదోసెను. అప్పుడు మావాండ్రు నా శరీరమును తీసికొనిపెళ్లుటకు సిద్ధముగానుండఁగానే బ్రతికినాను. ఏమో యీలాగున నీతఁడును బ్రతికిన బ్రతుకవచ్చును.

రాజ—ఏమివింతలండీ! ఎవరైన నమ్మవద్దా?

వెంక— ఆశ్చర్యమేమున్నది? ఈ పిల్లవాఁడు బ్రతుకడండి. రాత్రి నాకలలో యమదూతలు మట్టిలాగులు తొడుగుకొని మద్దుకఱ్ఱలతోవచ్చి గుమ్మములో నిలుచుండి యెవరినో రమ్మని పిలుచుచున్నారు. దూత దర్శనమైన నింక బ్రతుకుట యబద్ధము. నేననేకపర్యాయములు చూచినాను.

అనిచెప్పి న తలోన విశ్వనాథశాస్త్రులవారికలవలపాటంతయు విని లేచి రామచంద్రునకు తటస్థమైన యీమహాపదకు విచారించి శరభరాజుగారితో నిట్లనిచెప్పెను.

విశ్వ— అయ్యా! రామచంద్రుఁడు మిక్కిలి బుద్ధిమంతుఁడు. అతనికీలాగున కాలము తప్పివచ్చినది. ఇన్నాళ్ళనుండియు మీరే తండ్రివలె సంరక్షణఁ జేయుచున్నారు. అతఁడు పిల్లవాఁడయిన యోగ్యుఁడు. అవతలపెట్టించుట భావ్యముగాదు.

వెంక— ఏమిటయ్యా! అంత జాలిగానున్నపక్షమున మీయింటఁ బెట్టుకోండి. శ్రీరంగనీతు లెన్నైయైనను జెప్పవచ్చును. మీయిల్లు కాకపోయినసరి.

అని పలుకుచున్న సమయమునందు శరభరాజుగారి తల్లివచ్చి వెంకటరత్నమును పిలిచి యతఁడును, తానును, తోడుపట్టి రామచంద్రుని మంచమును పశువులపాకలోఁ బెట్టిరి. మిక్కిలి పరిశుద్ధమయిన వాయువుగల శుభ్రమైనచోట నుండవలసిన రోగిని తీసికొనిపోయి, చుట్టును రొచ్చును దోమలు మొదలగు కీటకముల ధ్వనులును, కడుపులో ప్రేగులు తెగునట్లువమనము గలుగఁజేయు పేడకంపునుగల యీ పాకలో పెట్టుచుండఁగా శరభరాజుగారు చూచియు స్త్రీలమాట కడ్డముచెప్పలేక, స్నేహితుని కొఱకు విచారించుచున్న రాజగోపాలము నూరడించుచు విశ్వనాథశాస్త్రులవారితో మాటలాడుచుండిరి. తరువాత కృష్ణవేణమ్మ రామచంద్రునియొద్దకుఁబోయి యాతని స్థితినిజూచి విచారించి యాతనిసంగతినిఁబట్టి యవి సన్నిపాతలక్షణములుగాని మరణ చిహ్నములుగావని గ్రహించి, కొంచెము చిట్టుడుకుసీళ్లుపోసినచో నది కుదురుననుకొని తన యభిప్రాయమును శరభరాజుగారితో చెప్పెను. ఆయన దానికిష్టపడఁగా తరువాత చిట్టుడుకుసీళ్లు గిద్దెడు రామచంద్రునకామె లోపలపోసెను. అవి త్రాగిన నాలుగు గడియలకు రామచంద్రుఁడు కొంచెము తెల్విదెచ్చుకొని యొత్తిగిలి పండుకొనెను. తక్కినరాత్రియంతయు రామచంద్రునియొద్ద రాజగోపాలము పరుండవలెననుకొని యది తండ్రితో చెప్పుచుండఁగా విని ముసలమ్మ యిట్లనిచెప్పెను—

అన్న— ఓరీ! కుఱ్ఱవాఁడా! నీవక్కడపడుకోకు. ఆనక జడుసుకొన్నపక్షమున దేవుళ్ళాడలేము. నీవు సాకిట్లోపరుండు—

రాజ— అక్కడ పరున్నమాత్రముననే జడిసికొందునా? అంతభయము లేదు.

అన్న— చెప్పినమాట వినవేమిరా? వాఁడెవరు? నీవెవరవు? నీకమ్మవంక చుట్టమా? అబ్బవంకచుట్టమా?

రాజ— నీవు వెయ్యిచెప్పినా నేనువినను. నేనక్కడనే పడుకొనియెదను—

అని రాజగోపాలము చెప్పినమాటలకు మనసులో సణుగుకొనుచు నామె వెళ్ళెను. ఆ మిగిలినరాత్రియంతయు వెంకటరత్నమును రాజగోపాలమును రామచంద్రునియొద్ద పశువులపాకలో పరుండిరి; కాని దుర్వాసనచేత కొంతసేపటికి రాజగోపాలమావలకువెళ్ళెను. అదివఱకు రామచంద్రుఁడు జబ్బుపడకమునుపు రాజగోపాలముయొక్క యుంగరమును తనవ్రేలను బెట్టుకొనెను. అదితీయకముందే రోగక్షీణుఁడగుటచే నా యుంగరమతనిచేతనేయుండెను. రామచంద్రుఁడు కొంచెము కనుమూసి నీరసముచేత పరున్నపుడు పంగనామములఁ బెట్టుకొన్న యొకబ్రాహ్మణుఁడా యుంగరమును మెల్లమెల్లగా లాగుచుండెను. రామచంద్రుఁడులికిపడిలేచి నీరసముచేత మాటలు తిన్నగా రానందున నక్షరములు స్పష్టముగా తెలియకున్నను, హీనస్వరముతో నొకకేకవేసెను. పంచప్రాణములను స్నేహితుని మీఁదనే పెట్టుకొనియున్న గోపాలమామాటలవిని పరుగెత్తుకొని యేమని రామచంద్రునడుగఁగా నతఁడేదో గోపాలముయొక్క చెవిలోఁజెప్పెను. ఆమాటలనాలకించి గోపాలము మహాకోపముతో "ఏమయ్యా! వెంకటరత్నము! అతనిచేతియుంగరము నీవెందుకు లాగినావు?" అని యడిగెను. వెంకటరత్నము మిక్కిలి కోపముతో నిట్లనిచెప్పెను.

వెంక— ఏమిటయ్యా! జబ్బుచేసి సంధించి చావునకు సిద్ధముగానున్నవాని మాటలునమ్మి నన్నీలాగున, ననఁదగినమాట యనరానిమాట తెలియకుండ నిందించెదవా? అతఁడుచెప్పను, నీవు నమ్మను నా? బాగున్నది? ఎంతమాట!

రాజ— పంగనామములువెట్టుకొన్న మనుష్యుఁడు లాగినాఁడట. నీవుగాక యింకెవరు.

వెంక— ఆ! ఈమాట బాగున్నది. కనులుమూసికొని మత్తుగా నతఁడు పరున్నపుడేమో యతనికి వెంకటేశ్వరులువచ్చి ప్రత్యక్షమై యుంగరము లాగినట్లు భ్రమ కలిగినది. వెంకటేశ్వరులు నిలువుబొట్టు దైవమేగదా. ఇతనికేదో భ్రమెక్కున్నది. త్వరగా నాయుంగరము మీఁదుకట్టు. ఇది వెంకటాచలపతి మహత్త్వమే.


245 (సశేషము) చిలకమర్తి-లక్ష్మీనరసింహము.

జ్యోతిశ్శాస్త్రసంగ్రహము. (౨౨౦-పుట శేషము.)

ఇంత పెద్దదిగానున్న యీ సూర్యబింబ మన్ని గ్రహములనుండియుఁ జూచుటకు సమానాకారముతోఁ గనఁబడదు. అన్ని గ్రహములలోను మనుష్యు లున్నపక్షమున, సూర్యబింబము చేరువగ్రహములోనుండి చూచువారికి మిక్కిలి పెద్దదిగాను దూరపు గ్రహములోనుండి చూచువారికి మిక్కిలి చిన్నదిగాను కనఁబడును. భూలోకము నందుండువారికంటె బుధలోకమునందుండువారికి సూర్యమండలము సప్తగుణము లెక్కువ పెద్దదిగాను నధిక కాంతిమంతముగాను గానవచ్చును. ఈ క్రిందిపటము వలన బుధలోకమునందుండువారికి సూర్యబింబమిందుఁ జూపఁబడినంత కనఁబడిన పక్షమున, తక్కినలోకములయందుండువారి కెంతెంతగాఁ గన్పడునో విశదమగును.

శుక్రునినుండి.

బుధుని నుండి.



బృహస్పతి నుండి.

శనినుండి.

ఊరనస్ నుండి.

నెప్ట్యూన్ నుండి.

భూమినుండి.

మేరమీఱియున్న యింతపెద్ద సూర్యబింబమును నెప్ట్యూన్ మండలములో నుండువారి కత్యల్పరూపముతో కనఁబడునని యీ పటమువలననే స్పష్టమగుచున్నదిగదా! ఇంకను బయినున్న యొక చేరువ నక్షత్రమునందుండి చూచుపక్షమున, మన సూర్యబింబను తానొక్క మిణుకు మిణుకుమనెడి చుక్కయయి సామాన్య నక్షత్రసామ్యముపొందక పోదు. అప్పుడది గణనాతీతములయిన నక్షత్రకోట్లలో నొక్కటియయి వానిలోఁగలిసి పోవును. ఇప్పుడు మన కనంతమయిన యాకాశమునందంతటను రాత్రులు మిణుకు మిణుకుమని కుప్పపోసినట్లు కనఁబడుచుండు లెక్కలేని నక్షత్రములన్నియు మన సూర్యునివంటి సూర్యులేయయి తనుచుట్టును గ్రహములచేత ప్రదక్షిణములు చేయించు

కొనుచు ననంతమైన యాకాశాంతరాళమున నొండొంటికి లక్షలకొలఁది యోజనముల దూరమున తమతమ నియమితస్థానములను వదలక వెలుఁగుచున్నవి. భూమ్యాది సమస్త గ్రహములను వెంటఁగొని మన సూర్యమండలమొక మహత్తరమూర్తికి దేనికో ప్రదక్షిణముగాఁ బోవుచున్నదని జ్యోతిశ్శాస్త్ర పండితులు తెలిసికొన్నారుగాని దేనికి ప్రదక్షిణము చేయుచున్నదో మాత్రము చెప్పఁజాలరు. ప్రస్తుతము మన సూర్యగ్రహమండలి యభిజిత్ స్వాతినక్షత్రములకు నడుమఁ గనఁబడు శౌరినక్షత్రమువంక నడుచుచున్నట్టు కనఁబడుచున్నది. ఇప్పుడు నడుచుచున్నగతి వేగము విలిప్త (సెకను) కాఱుమయిళ్లని యూహించుచున్నారు. ఇంతంతనికొలుచుటకు దురూహ్యముగానున్న యాకాశమునం దెన్ని మహాయుగము లీప్రకారముగా సంచారము చేసినను పారము చేరరాదుగదా! అనంతకోటి బ్రహ్మండ భాండము లీవిధముగా నమేయమైన యాకాశాంతరాళమున నిరాధారముగా నిలిచి యాకర్షణాది సుస్థిర నియతధర్మములకు లోఁబడి నడుచుచుండఁగాఁ గన్నులారఁజూచుచు, వానినట్లు నడిపెడి యద్భుతాప్రమేయ బుద్ధిమహిమగల నియంత యొక్కఁడున్నాఁడని తెలిసికొని యా సృష్టికర్తయొక్క యచింత్యాద్భుతశక్తి కాశ్చర్యపడి యానందింపకుండువాఁ డొక్కజడుఁడుదక్క లోకములో మఱి యెవ్వఁడుండును? ఇటువంటి వింతల ననుదినమును గనుఁగొనుచు భావమునం దలపోయు వివేకి యెవ్వఁడు భయాద్భుత ప్రమోదములపాలయి యసంఖ్యగోళ కోటులను సృజించి శాసించుచున్న సర్వశక్తుఁడగు పరమేశ్వరుని భక్తి గౌరవములతో స్మరింపకుండ నేర్చును?

స్థిర యనుపేరు సార్థకమగునట్లుగా మనభూమియే స్థిరముగా నంతరాళమునందు మధ్యగానుండి దానిచుట్టును సూర్యచంద్ర నక్షత్రాదులగు సమస్తగోళములును తిరుగుచున్నవన్న మన పూర్వుల సిద్ధాంతప్రకారముగా చక్రముయొక్క కేంద్రమువలె మధ్యభాగమునందు భూమియు, భూమిపయిని చంద్రుఁడును, చంద్రునిపయిని బుధుఁడును, బుధునిపైని శుక్రుఁడును, శుక్రునిపైని సూర్యుఁడును, సూర్యునిపయి నంగారకుఁడును, అంగారకునిపైని బృహస్పతియు, బృహస్పతిపైని శనియు, శనిపైని నక్షత్రములును, ఉన్నవి. ఈ సంగతి యటుండనిచ్చి యిప్పుడు సూర్యుఁడును సూర్యునిచుట్టి తిరుగు గ్రహములును ఎట్టి సంబంధముచేత నొకదాని నొకటివిడువక సంచరించుచున్నవన్న యంశమునకు రావలెను. సూర్యుఁడు గ్రహములను విడిచి దూరముగా నేల పోరాదు? సూర్యునివిడిచి భూమి యొక్కప్రక్కకును, బుధుఁ డింకొక్కప్రక్కకును, శని మఱియొక్కప్రక్కకును, శుక్రుఁడు వేఱొక్కప్రక్కకును, గ్రహములన్నియు చెదరి నానాముఖముల నేల పఱుగెత్తరాదు? అట్లొండొంటిని

విడిచి పరుగెత్తకుండ వీనినన్నిటి నొక్కటిగా బంధించుశక్తియేది? ఇత్యాదులయిన యంశములను గొంత విచారింపవలెను. ఏకకుటుంబములోఁ జేరినవారందఱును ముఖ్యముగా గృహయజమానునియొక్క ప్రేమానుబంధముచేత నేకముగా గృహమున కాకర్షింపఁబడి యొండొరులతో పొత్తొందియుండునట్లే గ్రహమండలియను పెద్ద కుటుంబమున కంతకును పెద్దయయియున్న సూర్యునికిఁగల యాకర్షణశక్తివలననే యేనియుఁ జెదరిపోక యన్నియుఁ బొందొంది నిలిచి యుక్తరీతిని సంచరించుచున్నవని చెప్పవచ్చును. కుటుంబమునంత నేకముగా బంధించెడి యనురాగపాశ మొక్క కుటుంబ యజమానునియందు మాత్రమే కాక కుటుంబమున కంగభూతులయిన యెల్లవారి యందునుగూడ కొంచెముగానో గొప్పగానో యుండునట్లే యీ యాకర్షణశక్తి సూర్యునియందు మాత్రమే కాక సమస్త గ్రహములయందునుగూడ తమతమ తారతమ్యానుసారముగా నుండును. దీని కార్యమునుబట్టి యీశక్తిని మనపూర్వులుకొందఱు ధారణశక్తియనిరి, ఇప్పటివారు గురుత్వాకర్షణమనుచున్నారు. ఈ గురుత్వాకర్షణము సృష్టియందణువు మొదలుకొని బ్రహ్మాండము వఱకునుగల సమస్తవస్తువులకును ధర్మమయియున్నది. ధర్మమనఁగా సృష్టియందంతటను చిన్నవస్తువునందును పెద్దవస్తువునందును సదాయుండి యెప్పుడును మార్పు చెందక వానిని నడుపుశక్తి. దాని కార్యమువలననే కాక యాశక్తి యెట్టిదో వేఱువిధమున మనము గ్రహింపలేము. అయినను ఆశక్తి యొక్క కార్యములుమాత్ర మెక్కడఁజూచినను భూమిమీఁదను సమస్త సృష్టిలోను ప్రతిస్థలమునందును గానఁబడుచున్నవి. ఈశ్వరకృతమయిన యట్టి ధర్మమునకు మనమెల్లవారమును లోఁబడవలసినవారమే. సృష్టికర్తయైన పరమాత్ముఁ డొక్కఁడు దక్క మఱియెవ్వరు నాశక్తి నొక్క క్షణకాలమయిన నిలుపలేరు. ఈ యాకర్షణశక్తివలననే చెట్టునుండి జాఱిన పండు పయికిఁగాని ప్రక్కలకుఁగాని పోక తిన్నగావచ్చి భూమిమీఁదఁ బడుచున్నది. అట్లు పండువచ్చి భూమిమీఁదఁబడుటకుఁ గారణమేమని యడిగినప్పుడు, అది గురుత్వము (బరువు) గల పదార్థమగుటచేత భూమిమీఁద పడునని కొందఱుత్తరము చెప్పవచ్చును. బరువనఁగా నేమని యిప్పుడు మరల నడుగవలసియున్నది. తనకుఁగల యాకర్షణశక్తిచేత భూమి ప్రతివస్తువును తనప్రక్క కాకర్షించుచుండుటచే తోఁచు గురుత్వమే బరువనుటకు సరియైన యర్థమగును. గురుపదార్థమైనను లఘుపదార్థమైనను ఘనపదార్థమైనను ద్రవపదార్థమైనను ప్రతిపదార్థమును సూక్ష్మములయిన యణువులయొక్క కూడికవలననే యయినదిగానున్నది. ఒక్కొక్క వస్తువులోని ప్రత్యణువును తక్కిన యణువులను తనప్రక్క కాకర్షించుచుండును; అవి యెంత దగ్గఱగానున్న నంత యెక్కువబలముతో నొండొంటిని లాగుకొను

చుండును. ఒక యినుపముక్కలోనున్న యణువులు కొయ్యముక్కలోనున్న యణువులకంటె నొండొంటికి మిక్కిలి దగ్గఱగా నంటిపట్టుకొనియుండును. అందుచేత నా రెంటిలో నినుమధిక సాంద్ర (దట్టము) మయినదని చెప్పుదురు; అనఁగా నినుమా రెంటిలో నెక్కువ బరువుగలదని యర్థము. అణువులను మిక్కిలి దగ్గఱగా నొక్కినకొలఁదిని, తక్కువస్థలములో నెక్కువయణువు లిముడుచుండును. వస్తువులలోని ప్రత్యణువును సమానబలముతో భూమి తనవంక కీడ్చుకొనుచుండునుగనుక, సాంద్రత యెక్కువయినకొలఁదిని వస్తువులను తనవంక కధికబలముతో భూమి యాకర్షించుచుండును. ఇట్లు చేయుచుండుటచేతనే బరువుగల వస్తువులు తేలికయైన వస్తువులకంటె నధికవేగముతో పడుచుండుటయు, దూదిమొదలయిన విరళ (పలచని) పదార్థములను భూమినుండి పయికి లేవనెత్తుటకంటె నంత పరిమాణముగల యినుము మొదలయిన సాంద్ర (దట్టమైన) పదార్థములను లేవనెత్తుట కష్టతరమగుటయు, తటస్థించుచున్నది. మనమొక పర్వతశిఖరమునుండి శిల నొకదానిని బయలవిడిచినపక్షమున భూమియొక్క యాకర్షణము దానిని తనవంక కంతకంతకు మఱింతబలముగా నీడ్చుచు వచ్చుచున్నందున, ఆ రాయిగాలిలోనుండి బయలుదేఱి క్షణక్షణమును వేగాధిక్యముతోవచ్చి భూమిమీఁదపడును. ప్రతివస్తువునందునుగల ప్రత్యణువును చేరువనున్నను దూరముననున్నను ప్రతీతరాణువును నాకర్షించుచునేయున్నను, వస్తువు సమీపమయినకొలఁదిని ఆకర్షణ మధికమగుచుండును. చిన్నవస్తువులొండొంటిని లాగుకొను చిన్నయాకర్షణములన్నియు భూమియొక్క పెద్ద యాకర్షణములో నడఁగిపోవుచుండుటచేత భూమి సమీపముననున్నప్పుడు మనము వానిని తెలిసికోలేము. భూమిమీఁదనున్న యిద్దఱు మనుష్యు లన్యోన్యాకర్షణముచేత నొండొరులమీఁదఁబడక నిలువఁగలిగినను, వారే భూమినివిడిచి పయి కిన్నూఱు మున్నూఱు యోజనములదూరమేగఁ గలిగినపక్షమున నక్కడ నొండొరులచే నాకర్షింపఁబడి దూరముగా నిలువ శక్తులు కాకపోదురు.

*

చెట్టునుండియు గట్టునుండియు జాఱినపండును గుండును భూమిచే నాకర్షింపఁబడు విధముననే, మన భూమియు తక్కిన సమస్తగ్రహములును సూర్యునిచే నాతని ప్రక్కకాకర్షింపఁబడుచు నొండొంటిని దమతమప్రక్కల కీడ్చుకొనుచునుండును. సూర్యుఁడు భూమి నాకర్షించుచుండఁగా, భూమి సూర్యుని నాకర్షించుచుండును. అయినను గుమ్మడికాయముందఱి యావగింజవలెనున్న మన భూమియొక్క యల్పాకర్షణము సూర్యునియొక్క యధికాకర్షణములో నడఁగిపోవుచున్నది. అట్లయినచో సూర్యుఁడంతబలముతో సమస్తగ్రహములను దనవంక కాకర్షించుచున్నప్పుడు, చెట్టును

విడిచినపండ్లు భూమిమీఁద పడునట్లుగా భూమ్యాది గ్రహములుపోయి సూర్యుని మీఁద నేల కూలకున్నవని సందేహము తోఁచకమానదు. భూమ్యాదిగ్రహములుపోయి సూర్యునిపయినిబడక చుట్టును దిరుగుచుండుటకును గారణము లేకపోలేదు. మన మొకబంతికిఁగాని రాతిముక్కకుఁగాని దారమును గట్టిపట్టుకొని మనచుట్టును గిఱ్ఱున త్రిప్పెదుమనుకొనుము, ఆబంతి దారముయొక్క నిర్బంధమును వదల్చుకొని దూరముగా తొలఁగఁ బ్రయత్నించుచున్నట్టును దారమునకుఁ గట్టియున్న బంతి యెంత యెక్కువ బరువుగలదయియుండునో యెంతయెక్కువ వేగముతోఁ దిరుగుచుండునో యాపలా యన ప్రయత్నమంత హెచ్చుచున్నట్టును తెలిసికోఁగలము ఇట్లు మనము త్రిప్పుచున్నప్పుడు నడుమ దారము తెగినను దారము మనచేతినుండి జాఱి పట్టు విడిపోయినను, బంతి మనవంకకు రాక దూరముగాఁబోయి పడుచుండుట చూచినప్పుడు మనమాబంతియొక్క దవ్వుగా తొలఁగు ప్రయత్నమును మఱింత స్పష్టముగాఁ దెలిసికోఁగలుగుదుము. దారము తెగినప్పుడు బంతి యెంతయెక్కువ బరువుగలదో యెంత యెక్కువవేగముతోఁ దిరుగుచుండునో యంతయెక్కువదూరమునకుఁ బోయి పడుచుండుటయు మనకనుభవ సిద్ధమే. ఇట్లు తిన్నగా దూరముగా తొలఁగుట వస్తువులకుఁ గల మఱియొకధర్మము. తిరుగుచున్న వస్తువులు మధ్యప్రదేశమునందున్న పెద్దవస్తువుయొక్క సమీపమునకు రాక దూరముగా నేల తొలఁగవలయునో మన మూహింపలేకపోయినను, అట్లు జరగుట వస్తు ధర్మమని మన మెఱుఁగుదుము. ఆకర్షణరూపమయిన ధర్మమున కెట్లు లోఁబడునో యట్లే యీ ధర్మమునకును సమస్తవస్తువులును లోఁబడును. సృష్టి యందంతటను గనఁబడెడి యీ రెండవధర్మమును మనమిప్పుడు మఱింత స్పష్టముగా విప్పి చెప్పవలసియున్నది. ఈ ధర్మమేమనఁగా నొక్కచోట నిలిచియున్న ప్రతి జడ పదార్థమును తన కన్యమైన కారణముచేత చలనము కలుగఁ జేయఁబడువఱకును స్థిరముగా నక్కడనే నిలిచియుండుటయు, ఒక్కసారి చలనము కలుగఁజేయఁబడిన పిమ్మట మరల నిలుపఁబడువఱకును తిన్నగా ఋజురేఖలోఁ బోవుచుండుటయు, అయియున్నది. ఈధర్మమునే ప్రకృతిశాస్త్రజ్ఞులు జడిమయని చెప్పుదురు. ఈ ధర్మ మునుబట్టి యొక పిరంగిగుండును భూమిమీఁదఁ బడవేసినపక్షమున స్థానము గదలక యది మఱియొకరు కదల్చువఱకును స్థిరముగా నేలనేపడియైన నుండవలెను; లేదా యెవ్వరైనవచ్చి పిరంగిలోఁబెట్టి కాల్చి చలనము కలుగఁజేసినపక్షమున శాశ్వతముగా సూటిగాఁ బోవుచునైన నుండవలెను. ఇతర ప్రతిబంధములు లేకపోయినపక్షమున నట్లే జరగియుండవలెనుగాని, పిరంగినోటినుండి బయలువెడలిన గుండును ప్రతిక్షణ మును భూమి తనవంక నాకర్షించి యొరపడిచేత నిలుపుచుండుటచేతను ప్రతిక్షణమును

గాలి యడ్డుపడి వేగమునకు భంగము కలిగించుచుండుటచేతను కొంతదూరముపోయి యదినిలిచిపోవును. భూమియువాయువునెడి యీ రెండు ప్రతిబంధములును లేకయుండిన పక్షమున, శతఘ్నిముఖమునుండి వెలువడిన యినుపగుండు సదా తిన్నగాఁ బోవుచునేయుండును. రాతికి దారమునుగట్టి మనము త్రిప్పునప్పుడీధర్మమునుబట్టి ప్రతిక్షణమును రాయి తిన్నగా ముందుకుఁబోవఁ బ్రయత్నించుచుండుటచేతను దారము దానినట్లుపోనీయక నిర్బంధించి ప్రతిక్షణమున మనవంక కీడ్చుచుండుటచేతను, ఆ రాయి యీ రెండుగతులకును నడిమిగతి నవలంబించి వలయాకారముగా తిరుగవలసినదగును. భూమి సూర్యునిచుట్టును దిరిగెడు సంవత్సరగతికిని నిదే కారణము. దారము రాతిని మనవంక కీడ్చుచుండునట్లే సూర్యుని యాకర్షణము భూమిని సదా సూర్యునివంక కీడ్చుచుండును; రాయి మనలనువిడిచి ముందుకుఁ దిన్నగాఁ బోవఁ బ్రయత్నించుచుండునట్లే సర్వదా భూమియు సూర్యునివిడిచి తిన్నగా ముందుకు దూరముగాఁ దొలఁగిపోవుటకుఁ బ్రయత్నించుచుండును; ఈ రెంటిచేతను నసఁగా భూమి యథేచ్ఛముగా ముందుకుఁబోవఁ జూచుచుండఁగాఁ బోనీక సూర్యాకర్షణమడ్డుపడి తనవంక కీడ్చుచు నిర్బంధించుచుండుటచేత భూమి మధ్యమార్గమనుసరించి చక్రాకారముగా సూర్యునికిఁ బ్రదక్షిణములు చేయుచుండవలసినదయ్యెను. క్షణకాలమయినను స్థిరముగా నొక్కచోట నిలిచియుండక భూమి నిమిషమునకు ౧౧౩౩ మైళ్లచొప్పునఁ దన కక్ష్యలో సూర్యునిచుట్టును దిరుగుచున్నది. ఆదియందు సృష్టికర్తయైన సర్వేశ్వరునిచేతఁ గలిగింపఁబడినదని యూహించుట దక్క భూమికీచలన మెప్పుడెట్లు కలుగఁజేయఁబడినదో యెవ్వరికి నగోచరమయియున్నది. అను క్షణమును సూర్యుఁడు భూమిని తనవంక నీడ్చుచుండఁడా, అను క్షణమును భూమి సూర్యుని నిర్బంధమును విడిపించుకొని దూరముగాఁబోవ లాగుకొనుచుండఁగా, ఈ యాకర్షణాపకర్షణములు రెండును గలిసి భూమికీ రెండు గతులకును మధ్యస్థమయిన చక్రగతి నిచ్చుచున్నవని పయిని జెప్పఁబడినదికదా! ఈ రెంటిలో సూర్యునిది కేంద్రాకర్షణము; భూమిది కేంద్రోత్సారము. ఈ రెంటి భేదములను బూర్ణముగాఁ దెలిసికొనఁ గలుగుటకుఁ బూర్వము సూర్యునిగూర్చియు గ్రహములనుగూర్చియు కొంత యెఱుఁగవలసియున్నందున ముందుగాఁ బయిప్రకరణమునందు సూర్యునిగూర్చి మఱికొంత వివరింపఁబడును.

మూఁడవ ప్రకరణము.

సూర్యుఁడు.

సూర్యునియొక్క తత్త్వమును గూర్చియే కాక పరిమాణాదులను గూర్చియు భూమినుండిగల దూరమును గూర్చియు గూడ పూర్వులకంతగాఁ దెలియదు. ఈవిషయము లల్పకాలముక్రిందటనే చాలవఱకు సరిగాఁ దెలిసికొనఁబడినవి. సూర్యునికిని భూమికినిగల దూరమించుమించుగా తొమ్మిదికోట్ల యిరువదిలక్షలమైళ్లయినట్లు వెనుకటి ప్రకరణమునందే చెప్పఁబడెనుగదా? మన పూర్వుల సిద్ధాంతములయందా దూరము ("సూర్యోన్నతయోజనాని మహీధ్ర నేత్రాంగగజాష్టతర్కాః" అని) ౬౮౮౬౨౭ యోజనములయినట్టు చెప్పఁబడినది. యోజనమనఁగా ఆమడ. యోజనమునకుపదిమైళ్లు* చొప్పున లెక్కచూచినను హిందూసిద్ధాంతప్రకారముగా భూమి కుపరిభాగమునందు సూర్యునిదూరమఱువదియెనిమిదిలక్షల యెనుబదియాఱువేల యిన్నూటడెబ్బది మయిళ్లే యగుచున్నది. నిజమయినదూర మిప్పటి పశ్చిమఖండ గణికుల గణనను బట్టి దాదాపుగా తొమ్మిదికోట్ల యిరువదిలక్షలమైళ్లగుటచేత, దానికిని దీనికిని నెనిమిదికోట్లయేఁబదిలక్షల మైళ్లకంటె నెక్కువ వ్యత్యాసము కనఁబడుచున్నది. సూర్యునిదూరము సరిగాఁ దెలిసినఁగాని సూర్యునియొక్క పరిమాణము బరువు మొదలయినవి నిర్ధారణము చేయుట సాధ్యముకాదు. జనసామాన్యము నిమిత్త ముద్దేశింపఁబడిన యిటువంటి ప్రాథమిక పుస్తకమునందు జ్యోతిశ్శాస్త్రవేత్తలు సూర్యునిదూరమును నిర్ణయించుటకయి చేసిన గణనలయొక్క వివరములను సుబోధముగాఁ దెలుపుటకు శక్యముకాదు. శుక్రగ్రస్త సూర్యగ్రహణమునుబట్టి సామాన్యముగా సూర్యునిదూరము గణింపఁబడుచు వచ్చినది. శుక్రునియొక్క గతివేగము నిశ్చయముగాఁ దెలిసియుండుటచేత శుక్రగ్రస్త


---

* మతాంతరముచేత యోజన పరిమాణమయిదుమయిళ్లే యయినట్టు కనుపట్టుచున్నది. భూగోళ పరిమాణ నిర్ణయమును జేయుచో సూర్య సిద్ధాంతమున ప్రథమాధ్యాయమునందు

శ్లో. యోజనానిశతాన్యష్టౌ భూకర్ణోద్విగుణానితు
తద్వర్గతో దశగుణాః పదం భూపరిధిర్భవేత్.

అని భూకర్ణము (అడ్డకొలత) ౧౬౦౦ యోజనములనియు, భూపరిధి (చుట్టుకొలత) ౫౦౫౯ పయి చిల్లరయోజనములనియు, చెప్పఁబడియున్నది. ఇక్కడ యోజనమునకయిదేసిమైళ్లచొప్పున లెక్కవేయనిపక్షమున భూపరిమాణము సరిపోదు.

సూర్యగ్రహణమునందు శుక్రుఁడు సూర్యునికిని భూమికిని మధ్యనుండి యెంతసేపటిలోఁ గడచిపోవునో పరీక్షించి గణకులు దానినిబట్టి దూరనిర్ణయము చేయఁగలిగిరి. ౧౭౬౧ వ సంవత్సరమునందుపట్టిన శుక్రగ్రస్త సూర్యగ్రహణమునుబట్టి భూమినుండి సూర్యుని దూరము ౯౪౫౦౦౦౦౦ మయిళ్ళుగా పరిగణింపఁబడినది. అటుతరువాత నూఱుసంవత్సరములవఱకును జ్యోతిష్కులా సంఖ్యనే యంగీకరించిరి. ఎనిమిదేండ్లలో నొక్కటి దక్క మరల ౧౮౭౪ వ సంవత్సరమువఱకును శుక్రగ్రస్త సూర్యగ్రహణమురాలేదు. అయినను ప్రకృతిశాస్త్రజ్ఞానమీలోపల నత్యంతాభివృద్ధి నొందినందున సాధనాంతరములనేకము లేర్పడఁగా, పండితులా నూతనమార్గ సాహాయ్యమున సూర్యునిదూరము నించుమించుగా సరిగా కనిపెట్టిరి. ౧౮౮౨ వ సంవత్సరమునందు పట్టిన శుక్రగ్రస్త సూర్యగ్రహణమునుజూపెడు పటమిందుఁ జేర్పఁబడినది. మనము సాధారణముగాఁ జూచెడు



గ్రహణములయందువలె నిందు సూర్యబింబము కొంతవఱకుఁగాని పూర్ణముగాఁగాని మఱుఁగుపడక బింబము యొక్క యొకప్రక్కనుండి యొకప్రక్కకు నల్లనిచుక్క నడిచినట్లు కనఁబడును. గ్రహణమనక జ్యోతిశ్శాస్త్రజ్ఞులు దీనిని క్రాంతియని వ్యవహరింతురు. శుక్రక్రాంతి ౧౭౬౧ వ సంవత్సరము జూన్ నెల ౬ వ తేదిని వచ్చినతరువాత మరల ౧౭౬౯ వ సంవత్సరము జూన్ నెల ౩ వ తేదిని వచ్చినది. అటుతరువాత నూఱు సంవత్సరములవఱకును మరలరాక ౧౮౭౪ వ సంవత్సరము డిసెంబరు ౮ వ తేదిని, పిమ్మట కడపట ౧౮౮౨ వ సంవత్సరము డిసెంబరు ౬ వ తేదిని వచ్చినవి.

 (సశేషము) కం. వీరేశలింగము.

భాస్కరవిలాసము. (౧౯౨-పుట శేషము.)

అప్పటికి రాత్రిపండ్రెండుగంటలు దాటిపోయెను. అప్పుడు బండి యెక్కడఁగుమరును? ఎవ్వని నడిగినను పగలెల్లను దున్నిదున్నివచ్చిన యెద్దులను కొంత యలపుతీర్చుకొనకుండ నాఁటిరాత్రి బండికిఁ గట్టుననియే చెప్పెను. నాకెప్పటికిని గుణమురాదయ్యెనని నాతండ్రిగారు మిక్కిలి కోపపడెను. ఏప్రమాదమువల్లనయినను నావలెనే పరివారములోని పెక్కండ్రు జాగుచేసి యుందురనియు, సృష్ట్యాదినుండియు నెవ్వరుగాని యంతటి దూరప్రయాణములను అనుకొన్న నాఁడే సాగింపలేదనియు, కాఁబట్టి యొక్క దినము జాలముచేసినందున నష్టముండఁగూడదనియు, చెప్పి నాన్నగారిని గొంతవఱకు శాంతపఱిచితిని. మఱునాఁడు పూర్వయామముననే భోజనముచేసి బయలుదేఱి భీమునిపట్టణము చేరఁగానే నాకు మొట్టమొదట వినఁబడ్డవార్తయేమనఁగా, "మహారాజులుంగారి రాయబారియు పరివారమును తత్పూర్వదినముననే యోడనెక్కి కలకత్తాకు బయలుదేఱి" రని ఈవార్త వినఁగానే నేను నిశ్చేష్టుఁడనయి నిలువఁబడితిని. నాకప్పుడేమిచేయుటకును దోఁచదయ్యెను. అప్పటి నామాటలును చేష్టలును చూడఁగా వెఱ్ఱియెత్తినవానివలెఁ గనఁబడితిని. నేను దిగిన బసలోనే దిగిన పుణ్యాత్ముఁడొకఁడు నాకలవలపాటునుజూచి నన్నడిగి కారణము తెలిసికొని రాయబారిగారి పరివారమునందు వెనుకఁబడ్డ జనులను దీసికొనిపోవుటకు మఱియొకయోడ రేవునందు సిద్ధముగా నున్నదనియు, అదియొక యరగంటలో లంగరెత్తివేయుననియు, చెప్పెను. ఈమాట వినఁగానే, అంతవఱకును ముడుఁచుకొనిపోయియున్న నా మొగము మరల వికసించెను. సామగ్రి పట్టించుకొని సముద్రతీరమునకుఁ బరుగెత్తి, పడవకు అడిగినంత సొమ్మిచ్చుకొని, యోడను జేరుకొని, నిచ్చెన అప్పుడే తీసివేసినను త్రాడుపట్టుకొని యెక్కి, ఓడలోఁబడితిని. ఓడలోఁ గూర్చుండి యొక నిమిషమునకుఁ బ్రాణములు మరలఁ గుదుటఁబడినతరువాత 'నిన్నటికి వచ్చినట్టేయయినది. మించిపోదని యెఱుఁగు మను.' అని నాలో నేననుకొంటిని. ఏమి నా దురభ్యాసమహిమ! అయినను నాఁటిసాయంకాలమునుండి, రాయబారిగారి యోడలోఁ బ్రయాణము లభింపదయ్యెనుగదా! నా సంభాషణములవలన నట్టి పెద్దతలకాయలకు నా తెలివిని నాపాండిత్యమునుకనఁబఱచుట కవకాశము కలుగదయ్యెనుగదా, యని వగవనారంభించితిని. ఎట్లో ఆయోడమీఁద జ్వరములేని లంఘనములును వ్రతములేనియుపవాసములును నాలుగయినతరువాత అయిదవనాఁటి సాయంకాలము కలకత్తాలో దిగితిని. రాయబారము వారందఱును తత్పూర్వదినము సాయంకాలమే పొగబండియెక్కి కాశికి బయలుదేఱిరని తెలిసినందున నేను వెంటనే బయలుదేఱివెళ్లి కాశిలో వారిని గలసికొంటిని. అక్కడ నాలుగుదినములుండి యందఱమును గలసి బయలుదేఱి మఱి వారముదినములకు రీవా రాజ్యమును జేరితిమి.

అక్కడ మాకు సమస్త గౌరవములును సమస్తోపచారములును మిక్కిలి జాగ్రత్తతో జరపఁబడెను. నేను కొన్నిదినము లక్కడ స్వస్థపడినతరువాత, నేను వ్రాయఁదలఁచిన రీవా రాజ్య వర్ణనమునకు సాధన సామగ్రినిగూడఁ జెట్టుఁబూని, అందలి విశేషములను బరిశీలించి స్మరణపుస్తకమున వ్రాయనెంచితినిగాని వెనుకనుండి యా పుస్తకముమీఁద వ్రాయవచ్చునని అప్పటికి విడికాగితపు ముక్కలమీఁద వ్రాయుచుంటిని. నా భాగ్యవశమున, గోదావరీ తీరమునుండి యనేక సంవత్సరముల క్రిందటనే రీవా సంస్థానమునకు వెళ్లి యక్కడి మహారాజులుంగారి మన్ననవడసి ఆదేశము వేషభాషల నవలంబించి యక్కడనే కాపురమున్న యొక వేదశాస్త్రవేత్తయయిన బ్రాహ్మణుని పరిచయము నాకుఁగలిగెను. ఆయనతఱచుగా నాకు దర్శనమిచ్చుచు ఆదేశముయొక్కయు అక్కడి ప్రజలయొక్కయు స్వభావమునుగుఱించి నాతో ధారాళముగా ముచ్చటించుచుండెడి వాఁడు. అక్కడ హిందువులకును మహమ్మదీయులకును వేషభాషలనుబట్టికాని మర్యాదలనుబట్టికాని భేదము కనుఁగొనుట కష్టసాధ్యము. అక్కడివారి మర్యాదలును, ఆచారములును, అతి వినయమును సూచించునవిగాఁ గనఁబడెను. వినయమును గనఁబఱుచునపుడు వారి మాటలును చేఁతలును మనోవ్యాపారమువలనఁ గలుగునవిగాఁ గనఁబడవు. చిరకాలాభ్యాసమువలన నవి యప్రయత్నముగా జరగునట్లు కనఁబడును. దాక్షిణాత్యులందఱును మర్యాదలెఱుఁగని మోటువాండ్రనియు మిక్కిలి స్వాతిశయ బుద్ధి గలవారనియు వారి యభిప్రాయము.

ఈ హేతువుచేత నాకక్కడివారితో నెవ్వరితోను మైత్రి కుదిరినదికాదు. కాఁబట్టి పూర్వోక్తశాస్త్రిగారితోనే నేను ప్రతిదినమును నేనసేపు కడపుచుండెడివాఁడను. ఆయనతో నాకు జరగిన సంభాషణలలో నొకనాఁడు, రీవా మహారాజులుంగారికి సంస్కృత కవిత్వమందు మిక్కిలి యాదరమనియు, వారు సంస్కృత కవులను గొప్పగా సంభావింతురనియు వింటిని. నాఁటనుండియు నా కితరచింతలన్నియుఁ బోయెను. మా మహారాజులుంగారి కార్యమునకును నాకార్యమునకును గూడ అనుకూల్యము కలుగునట్లు పూసపాటివారు విజయనగర సింహాసనము నధిరోహించినది మొదలుకొని విజయనగరరాజుల చరిత్రమును సంస్కృత శ్లోకరూపమయిన గ్రంథముగా రచియించి రీవా మహారాజులుంగారికి సమర్పింపవలయునన్న యుద్దేశము నాకుఁ గలిగెను. వెంటనే తక్కిన పనులన్నియుఁ గట్టిపెట్టి ఆపనికారంభించితిని. పది దినములలో గ్రంథమును ముప్పాతిక మువ్వీసము పూర్తిచేసితిని. ఇఁక నొకటి రెండుదినములలో గ్రంథము సంపూర్ణమగుననఁగా సాయంకాల మయిదు గంటలవేళ, మాకు బసకిచ్చిన మేడమీఁద మోఁచేతిని దలగడమీఁద నానుకొని తల

ఱలచేతిమీఁద నుంచుకొని క్రొత్తగా అలవాటుచేసికొన్న హుక్కాపొగఁ బీల్చుచు ఒరగిపరుండి కాలిమీఁదఁ గాలువేసికొని పాదమాడించుచుఁ పెద విజయరామగజపతి మహారాజులుంగారి చరిత్రమును వర్ణించెడి శ్లోకము నొకదానిని జెప్పుచుంటిని. ఆసమయముననే రీవా మహారాజులుంగారు ఉద్యాన వనమునకు బయలుదేఱిరి. వారు పురవీథులవెంట వెళ్లునప్పుడు చూచువారందఱును లేచి నిలువఁబడుట అక్కడి యాచారము. వారు బయలుదేఱినప్పుడు వాడుకప్రకారముగా కోటగుమ్మమువద్ద డంకా వాయించిరిగాని అదివిని మహారాజులుంగారు బయలుదేఱిరని తెలిసికొని లేవఁ దలఁచుకొనియు వారు మా బసప్రక్కకు వచ్చునప్పటికి లేవలేక పోయెదనాయని యెంచి శ్లోకమును బూర్తి చేయ నట్లే పరుంటిని. శ్లోకము నాల్గవపాదమున 'బుస్సీ' యను పదమునకు ఛేకానుప్రాసము గుదురుపద మాలోచించుచుఁ దదేకహృదయముతోనుండఁగా మహారాజులుంగారు మా బసప్రక్కనుండి వెళ్లిరి. నా మనస్సంతయు ఛేకానుప్రాసముమీఁదనే యుండుటవలన నేను వారివంకఁ జూచుచుండినట్లే కనఁబడుచుండినను వారు వెళ్లుటను తెలిసికొనఁజాలక నేను లేవనైతిని. మఱునాఁటి ప్రాతఃకాలమునుండి త్రోవఁబోవువాండ్రందఱును మా బసవంక మిట్టిమిట్టిచూడ నారంభించిరి. నా మిత్రుఁడయిన శాస్త్రిగారు నేనెన్నివార్తలు పంపినను మాబసకు రాలేదు. సరిగదా, నేనే వారింటికి రెండుపర్యాయములు వెళ్లినను ఇంటివద్ద లేఁడని పించుకొనెను. మఱి రెండుదినములకు రీవా మహారాజులుంగారు మా రాయబారికిఁ దమ మంత్రిచేత మేము విజయనగరమునకు మరలి వెళ్ళవలసినదని సెలవిప్పించిరి. ఆ సెలవయిననాఁటి సాయంకాలముననే బయలుదేఱి ప్రయాగము మీఁదుగాఁ గాశికి వచ్చి అక్కడ మూడుదినములుంటిమి. నా అత్తగారు, అమ్మమ్మ, అమ్మ, భార్య, మఱఁదలు మొదలగువాండ్రు కాశినుండి కొన్నివస్తువులు తెచ్చిపెట్టుమని నన్నుఁగోరిరి. అవి నేను కాశినుండి బయలుదేఱెడు నాఁటిసాయంకాలమునఁ గొని తెప్పించితినిగాని అంతకుమునుపే మా సామగ్రియంతయును పొగబండిమీఁదికిఁ బంపించియుండుటవలన నీ వస్తువులు ప్రత్యేకముగా నొక గంపలోనుంచి బండిమీఁదికిఁ బంపితిని. కలకత్తాలో పొగబండిదిగిన నాఁడే మరల భీమునిపట్టణమునకుఁ బొగయోడనెక్కితిమి. ఓడమీఁదఁ దక్కిన సామగ్రియంతయును గదులలో భద్రముగా దాఁచఁబడెను. కాని నావస్తువుల గంపమాత్రము మాదని తెలియక తట్టుమీఁద నొకమూలఁ బడవేసిరి. ఓడ యొరగి నప్పుడది సముద్రములోఁ బడిపోవునని యోడవాండ్రు చెప్పిరిగాని లోపలఁ బడ వేయించెదనని వారితోఁ జెప్పి యూరకుంటిని. మా భటులతో అట్లు పడవేయుఁడని చెప్పుటకు జాలము చేసితిని. మఱునాఁటి సాయంకాలము నేను కన్నులారఁ జూచు

చుండఁగానే యోడ కొంచెము ఒరగఁగా గంప సముద్రములోనికి జాఱిపోయెను. ఈ విచారము నేను మరల భీమునిపట్టణమున దిగువఱకు నన్ను విడువలేదు.

తృతీయాశ్వాసము.

నేనింటివద్దఁ బ్రవేశించిన మఱునాఁడే రీవావృత్తాంతము వ్రాయనారంభింపుమని నాన్నగారు తొందరపెట్టెను. నేను ఇక్కడనుండి బయలుదేఱునప్పుడు తలఁచుకొన్నంత విస్తారముగా నా గ్రంథమునందు వ్రాయవలసిన ముఖ్యాంశములసూచీపట్టిక రీవాలో వ్రాసికొనియుండలేదు. దీనికిఁ బ్రధాన కారణము నా ధారణాశక్తియందు నాకుఁగల యతివిశ్వాసము. ఇందుకుతోడు మొదట నేను వ్రాసియుంచుకోఁదగిన యంశములని నాకుఁ దోఁచినవానినయినను 'తేపు' వ్రాయవచ్చునని జాగుచేసిచేసి తుదకెప్పటికిని వ్రాయకుండుట. ఈ రెండు కారణములను మీఱి నేను వ్రాసిన స్వల్ప సంఖ్యగల యంశములయినను తాత్కాలికముగా నేదో చిత్తుకాగితముమీఁద పెన్సిలుతో నాలుగయిదు పొడియక్షరములుగా వ్రాసి పెట్టెలోఁ బాఱవేయుచు వచ్చితిని. అవన్నియుఁ బోగుచేసి వరుసగాఁ బెట్టి కుట్టియుంచవలయునని పలుమాఱు అనుకొంటిని. ఏదో తొందరపనివచ్చి దానికి విఘ్నము కలిగించుచువచ్చెను. కొన్నాళ్లు విజయనగర మహారాజులచరిత్ర మడ్డువచ్చెను. కొన్నాళ్లు ప్రయాణము తొందర. కొన్నాళ్లుమఱేదో. తుదకు కలకత్తానుండి యోడనెక్కిన మఱునాఁడు సరిగా పెట్టెతీసి కాగితములు బొత్తిపెట్టుట కారంభించితిని. కాని, అంతలో నా గంప సముద్రములోఁ బడిపోవుట వలన అప్పుడు మఱి పనిచేయుటకు బుద్ధిపుట్టలేదు. ఇంటికి వచ్చినతరువాతనయినను నాన్నగారు చెప్పినప్పుడెల్ల 'తేపు' ఆరంభించెదనని చెప్పుచువచ్చితిని. కాని వారము దినములవఱకును త్రోవ బడలికఁ దీర్చుకొనుచును, మఱివారనుదినములవఱకు నాయీడు స్నేహితులతో నా ప్రయాణవృత్తాంతములు ముచ్చటించుచుఁ దిరుగుచును గ్రంథరచన ప్రయత్నము లేవియుఁ జేయనయితిని. ఇంతట మాతో రీవాకు వచ్చినవారిలో విజయనగర నివాసియొకఁడు రీవా వృత్తాంతమును వ్రాయనారంభించెనని నాన్నగారియొద్దకు జాబువచ్చెను. అది చూడఁగానే ఆయన సరిగా పిడుగుమొత్తినట్టు నిశ్చేష్టుఁడయి కొన్ని నిమిషములకు మరలఁ దెలివితెచ్చుకొని యాజాబు నాచేతికిచ్చెను. అది చదువుకొని నేనును తెల్లపోయితిని. "భాస్కరా! నేనెంత భయపడ్డానో అంత అయినది. చిన్నప్పటినుండియు నీచర్య ఒక్కలాగుననేయున్నది. నీవు విజయనగరములో చదువుకొనేటప్పటినుండి నీవు బాగుపడవలసిన అవకాశము లెన్నెన్నో సంభవించినవి.

(సశేషము) బులుసు-పాపయ్యశాస్త్రి.

పండితరాజశతకము. (౧౯౬-పుట శేషము.)

తే. గీ అవితరణదోషమునఁ బేదయయి జనించు;। లేమి తప్పునఁ బాపము లేమొ సేయుఁ;
బాపములఁ దప్పక నరకపాతమొందు;। మఱి దరిద్రుఁడు పాపసంపన్నుఁడునగు.

తే. గీ. పృథివిఁ బాత్ర మపాత్రము భిన్నఫలద। ములగు ధేనుభుజంగముల విధమునఁ;
దృణము మేపినఁ జేఁపును దియ్యపాలు;। పాలుపోసినఁ బాఁడను నాభీలవిషము.

క. చేయవలయు పని వేగం। జేయఁడు; గానవలయు దానిచేకొనఁ; డీయం
డీయవలయునది యెవ్వం। డీయిలఁ; గాలమ్ము గ్రోలు నీతనికలిమిన్.

ఆ. గీ. ఎవఁ డనుగ్రహమున హేమాభిషేకము,। నాగ్రహమునఁ బ్రాణహాని సేయఁ,
డా మహీకళత్రు నాదరింపరు జనుల్,। జలదదళనయనలు షండునట్లు.

ఆ. గీ. సభ గజగజ వణఁకు జనుని సంగీత సా। హిత్యముఖ సువిద్య లెల్ల నేల;
త్యాగభోగహీను ధన మేల; దురమున్నఁ। బాఱువాని బాహుబలమ దేల. ౧౧.

తే. గీ. శాస్త్రపారగునందు నజ్ఞానియందుఁ,। బ్రధన జయశాలియందు నవధ్యునందు,
వృద్ధధనునందు గర్భదరిద్రునందుఁ;। బక్షపాతము మృత్యుదేవతకు లేదు. ౧౯.

ఆ. గీ. కలరు బుధులు; వారు గారు మేల్గోరెడు।వారు; గలరు హితులు; వారెఱుఁగని
వారు; బుధులు హితులు వసుధనరిది, తెవుల్। మాన్పఁజాలు తియ్యమందుమాడ్కి.

క. తేని యదియూన నెరపం। బూనని సేవకుఁడు నిందఁ బొందందగు; నా
మానిని మనుగడయును ఫల। హీనమజాగళకుచద్వయాన్యాయమునన్.

క. కలిమి యొకఁ గొన్నిదినములు। నిలిచెడు పున్నెమ్ములున్న, నీతిదొలఁగిన
న్దాలఁగున; చము రెపుడందిన,। మలఁపవెదీపశిఖ పీచుమాత్రన చాత్యల్. ౯౨.

ఆ. గీ. షండుఁ డాత్మభార్య జారులకీయను,।దా, రమింపఁగూడ నేరకెపుడు
హస్తమున స్పృశించు; నట్టులోభియు సిరి।యిడక తినక లెక్కలిడుచునురియు.

ఆ. గీ. తల్లి పాపమునకుఁ బిల్లయు లోభంబు;। దీనఁగినుకపుట్టు; దానజంపఁ
దలఁచుఁ; దానఁ జెందుఁ దప్పక నరకంబు;। శాస్త్రతత్త్వ మెఱుఁగు జాణయైన.

చ. తలఁచుచుఁ దాము చిన్నపుడు త్రావిన కొంచెపునీరుకొబ్బరుల్
దల ఫలభారనూరఁగ, సుధా మధురంబగు నీరొసంగుఁ ద్రా
తలకు నిజాసువుల్దలఁగుదాఁక మహాకయొనర్తు) సాధు లిం
తల కొరుచేయుమేళ్ళకు సతంబుశతంబు మహోపకారముల్.

మ. ఇలుదీర్పం దలిదంద్రములుండఁ, దనయుత్సాహలాగతి స్వీద్దల
స్బలిమిం జెందియుఁ, బాటుచేతఁ గలిమిం బ్రాపింప; రట్లోషధు
ల్ఫలవృక్షంబులనట్లఁ బుష్టిఁగనియున్ భావ్యర్థకాంక్షాభి వృ
ద్ధులు మాత్రం బొనరించు శాల్మలిసుమస్తోమంబు భాతింగటా. ౯౬.

ఆ. గీ. ఎతఁడు బ్రతుకఁజాలు నెల్లెడ; నాత్మ దే। శానురక్తి నాతఁ డడలనేల;
తండ్రి నుయి యిడంచుఁ దాత్పర్యమున నుప్పు। నీరు ద్రావువార లేరు భువిని. ౯౭.

శా. వ్యాసుంబోలును గాత నౌపనిషదబ్రహ్మాత్మభావంబున;
న్వ్యాసుక్త్యగ్రజునక్షపాదునిఁ బడన్యాయజ్ఞత న్మించుఁగా
నీ, సాహిత్యవిమండు గాని యెవనిన్వే ప్రొక్కి మెచ్చంగఁ జే
రాసన్మందజకీర్వాలంకులకు నిష్టస్వచ్ఛరంబూఁగెడున్. ౯౮.

మ. అమితానందము పండితామర సమూహంబుం, సారస్వతా
ఖ్య మహావారిధి బుద్ధిమంథమథితం బంమన్నసముద్భూతమై
సమతీతంబగునాత్మ మాధురి సమస్తంబున్ జగన్నాథసూ
రి మహారాట్కవితామృతంబు; భువిఁ గీర్తింపన్ దగున్ నీతికై. ౯౯

మ. అతిపాకక్రమతగోస్తనీ మధు రసాహంకార సంహార ధు
ర్యతఁ జెందంబలుకు స్పృశింపఁ గడు సారజ్ఞుండవైన న్స్వరో
గతముం జేయుము మన్మ బోంట్లు నుపడిన్గ్రావ్యంబు; గావేని దు
ష్కృతముండౌనౌ నరించు దానివలెఁ జైకొందెల్ల గాకోచెలీ. ౧౦౦.

మ. కనకోర్వీధర మూలముత్తరమునంగా, వార్థితీరంబు చం
దనశైలావృతమెల్ల యామ్యదిశఁగా, ధాత్రిన్ గృహస్థుల్ స్వయఁజా
లినవారుందురశంక మొంద; లోకఁడు న్నేఁడీశుమాకిం దుర్ద్రా
క్షులజాల్వాణెడు తేనెపల్కు సిరి నాచార్యత్వప్రాప్తి చేన్. ౧౦౧.

మ. అలరం జేసిన నామపల్కు విబుధస్వాంతంబుఁ గస్తూరికే
మలసుల్ నీటికోలందిదిట్టిన నగుః స్వర్గంబుఁ జెందించు నే
విలసద్రూపయుఁ జాన యౌవనవశావిర్భావ సంపన్నుల
న్బలెబాలాళుల; వారి యాదరము సంపాదింపమిన్నోపమే. ౧౦౨.

ఉ. రాజమహేంద్రపూర్ణిహితపాట్కలశాలఁ బ్రవేశమొంద వి
ద్యాజిపరీక్షకుం జనువుబాలురకున్ స్వరభాష నేర్ప నే
నోజఁ దెనుంగొనర్ప నిపుడోర్చితిఁ బండితరాజరాట్ప్ర ర
వ్యాజితపద్యపఙ్క్తి సమపద్ధతిఁ బంచశతిన్ సమాదృతిన్. ౧౦౩.

చ. సరిగనొనర్పఁజాలుదును జక్కఁగఁ దెల్గరి కాదు; సంస్కృత
మ్మురమణ సద్దియున్ బుధసమూహము వీనుల విందుసేయునం
చరసియుఁగాదు; మానకెపుడభ్యసముం బొనరింపఁ బుష్పన
క్కరమటులెద్దియేనాకఁడుగా దొకొ రుచ్యమటంచు వ్రాసితిన్. ౧౦౪.

ఉ. పండితమండలాగ్రసరు పల్కులవెక్కుడు; నార్యమూని స
బ్బంపుఁ దెలుంగు లెక్కుడు; సభాజనపాత్రమె; తారతమ్య మె
వ్వండెఱుఁగండు, సంస్కృతపుఁ బాగెఱుఁగంగలవారికేల; యా
ఖండలముఖ్యులున్నరులుగారె సదామృతపానతృప్తుల్. ౧౦౫.

మాలిని. కేసినకుర్తిపురీవర దివ్యనికేతనవాసికు లాగ్రసర
వ్యాసకవీశ్వరపూజితలింగ, నతామర భూమిరుహా, నిగమ
శ్వాస, తపోధనమానస నిత్యనివాస, చిదాత్మక చిత్తరిపూ
ద్వాసనమోదిత సాధుజనవ్రజ, వాసవ వందితపజ్జలజా. ౧౦౬.

మ. శ్రిత చింతామణి పత్రికాధిపతి సచ్ఛ్రీతుష్టవిద్వత్తతీ
మతివాస్తోష్పతి నీతిమన్నరగతీ మానోన్నతక్ష్మాపతి
స్థితి సత్సంగతి సుందరాకృతి కృతిస్థేమాదృతీ భారతీ
స్తుతవాక్పద్ధతి పార్వతీపతి సుహృద్భూతి ప్రశంసోద్గతీ. ౧౦౭.

మ. హర, గంగాధర, చంద్రశేఖర, శివాప్రాణేశ్వరా, విఘ్నరా
ట్సురసేనావరలాలనాదర, బుధస్తుత్యాకరా, శంకరా,
పురదైత్యాచలవజ్ర, పాపతిమిరప్రోత్సారణాహస్కరా
వరదాతృప్రవరా పరాశరసుత ప్రారిప్సిత శ్రీకరా. ౧౦౮.

శిఖరిణి. ధరాభృజ్జాచేతోహరసురవరద్రుస్వకహరున్
శిరోగంగాపూరుశ్శ్రితశుభకరుస్స్నుతగుధరున్
నిరాహారాధారున్నిరతిశయ పాండిత్యరుచిరున్
మరున్నారీనీరాజితుఁ గొలుతు సంపత్కరుహరున్. ౧౦౯.

గద్యము. ఇది శ్రీమత్కేసినకుర్తి వ్యాసేశ్వర కృపాపాత్రాశ్వలాయన సూత్రాత్రేయ సగోత్ర ప్రతిప్రస్తావ చాటుపద్యపఠన సమధిగత సకలనరనాయక పారితోషిక వేంకటాంతర్యాశి ప్రపౌత్ర, సతత విహిత విద్యార్థి తైర్థిక మహోపకార వ్యాస భట్టారకపౌత్ర, పారమార్థిక పారత్రైక కార్యయాపితాయుష్కాల సత్యాదిసుగుణవిశాలసనామ కన్యాపరిణేత్రాకుండి వేంకటమనీషిపుత్ర సీతారామాంగ్రజ, శ్రీమద్ద్వివేది సోమనాథగురు కరుణాధిగత కావ్య మీమాంసా శాస్త్రవ్యాసమూర్తి శాస్త్ర్యంఘ్రికృత, కృతమత్యప్పదీక్షితాది మత తృణీకరణ ప్రతిభాచణ జగన్నాథ పండితరాజ విరచిత రస గంగాధర నామాలంకార శిరోమణి రసాద్యుదాహరణీకృత పద్యమయ భామినీవిలాస ప్రాస్తావికవిలాస నామ ప్రథమప్రకరణము సంపూర్ణము.

భామినీవిలాసమున శృంగారవిలాసము.

ఉ. బాలగజాననుండు మముఁబాలనసేయునితండు, మేనిసోఁ
బాలున లేమగల్గు పిత బాధముగాఁగిటఁజేర్చి, పెందొడన్
లీలనిషణ్ణుఁడాత్మజననీ కుచపార్శ్వముఁజేర్ప, జెల్లుచూ
ల్గోరిలఁదలంచుఁ బాలెతని కుంభములన్గని మూడుమోములన్.

ఆ. గీ. వాంఛితాప్తికొఱకు వందింతు; నెదికర్మ। మగును! జెప్పనద్ది యలవికాదు;
దంపతినని చెప్పదగునా, కాదేనట్లు। దంపతులననంగఁ దగునా యెఱుఁగ.

మ. తమమస్పంకముచేత దుర్గమగుసంద్రమ్మందు నిశ్చేష్టులై
నమనుష్యాదిక జంతుసంతతులు మున్కల్గొన్న లోకత్రయ
మ్ము మహాదీర్ఘమరశ్మిసంఘము ధృఢమ్ముంజాఁపిపైకెత్తున
ర్యము, లోకాప్తు సహస్రభాను రవి నారాధింతుస్ఘ్నానికై.

క. అమరీకబరీభార। భ్రమరీ ముఖరీకృతమ్ము పార్వతిచరణా
బ్జము దూరీకృతసేవక। సముదయ దురితమ్ము మమ్ము సంరక్షించున్.

క. శ్రీమద్భూమిధరకుమా। రీమానస సారసరవి శ్రీహరిజగతీ
వ్యామోహనతనుదర్శన। కామవశోదితకుచా.ర గంగాదారా.

తే. గీ. కొంచెమును లేదు రాహుక్రోధించుభయము;
కందఁజెందదు; కనదు తెల్లందనమ్ము;
హెచ్చుచున్నద చోద్యమిదే మొసాగసు
నిత్యమంతటు భామినీ? నీమొగమున.

తే. గీ. అతివనీయంగ సౌకుమార్యంబుగన్న। పిదపఁ దలపెట్టుఁ దలిరుల పేరునెవ్వఁ
డంబుజంబుల చండ యత్యంతకఠిన। మౌ; మృణాళములును గావు కోమలములు.

మ. మొలవంజేసెడు సంతసంబు దళితాంభోజాక్షి ఘర్మాంబుసాం
ద్రలవశ్రీయుతగండమండల చలత్కర్ణద్వయీకుండలో
జ్జ్వలమై సన్నతిపాత్రమైనదశ, సద్భావంబునందేదియో
తలపందోఁచుచు నాల్కకుండలమె తత్ప్రస్తావముంజేయఁగన్.

క. తిలకమిడి నొసటఁగస్తురిఁ। జెలఁగంజిర్నవ్వు సౌధశిఖరముపై వే
వెలయు; వికసించుఁగలువలు। పొలఁతీ? యలరించు దెసల మొగములు తెలివిన్.

క. సాయమాబ్జ సహజలోచన। యీయందపు మందహాసిత, మకలంకాస్య
శ్రీయది, యీయీరుపులుం। జేయునహా, నేఁడు నాదు చిత్తముచలమున్.

260 (సశేషము) ఆ-వ్యాసమూర్తిశాస్త్రి.

సీ. నీవు భీష్మునకు శైనేయుఁ డశ్వత్థామకును వృకధ్వజుఁడు ద్రోణునకుఁ జేకి
తానుండు బాహ్లికతనుజాతునకు ననిరుద్ధుండు కృపునకు నుద్ధవుండు
మత్స్యేంద్రునకు దీప్తిమంతుండు రాజరాజునకు సాంబుఁడు సూర్యతనయునకు గ
దుండు మారుతికి వృకుండు కేకయులకుఁ జారుదేష్ణుండు దుశ్శాసనునకుఁ
బుష్కరుండు పాండ్యభూపాలునకు గాంది । నీసుతుండు ద్రుపదునికి సునంద
నుండు నా సుదక్షిణునకును గృతవర్మ । శల్యునకు శుకుండు సైంధవునకు. ౧౫.
వ. వెండియుఁ దక్కిన యోధులు వారల యోధులకుం జాలినిలుచువారు నేనర్జుననకుం
జాలుపడిన జయింపవచ్చునని కొలువుసాలించి యంతఃపురంబున కరిగె నందఱుం
దమతమ నివాసంబులకుఁ జనిరంత నయ్యదువల్లభుండగు శ్రీకృష్ణుని యనుమతంబునఁ
జారుదేష్ణుండు ప్రయాణభేరి వేయించిన. ౧౬.
మ. శరధివ్రాతము పంకమై నిలిచె నక్షత్రాళి డుల్లె న్దిశా
కరిసందోహము మ్రొగ్గె భూధరము లాకంపించె సూర్యాగ్ని చం
ద్రరుచుల్ మాసె నభంబు బిట్టడరెఁ బాతాళంబు భీతిల్లె శం
కర నీరేరుహసంభవుల్ భ్రమసి రుగ్రంబైన భేరీధ్వనిన్. ౧౭.
వ. అయ్యవసరంబున యదువృష్ణి భోజాంధకాదులు యుద్ధసన్నద్ధులైరి కృష్ణుండును
సముచిత శృంగారం బంగీకరించి యంతఃపురంబు వెడలి. ౧౮.
గీ. సైన్య సుగ్రీవ మేఘపుష్ప బలాహ । కములతోడ నిశాతమార్గణగణాది
సకలసాధనములతోడఁ బ్రకట గరుడ । కేతనముతోడఁ దగు తేరు ప్రీతిఁజూచి.
వ. ఆరథమునకుఁ బ్రదక్షిణము గావించి మహీదేవతల దీవనలుగొని విప్రాశీర్వాదంబులు
చెలంగ రథారోహణంబుచేసిన బలభద్రసాత్యకి ప్రభృతి భ్రాతృవ్రాతంబును
బ్రద్యుమ్న సాంబ సారణ చారుదేష్ణ దీప్తిమ ద్భాను భానువింద శుక వృక పుష్కర
వేదబాహు శ్రుతధేను సునంద చిత్రబర్హ కవిన్యగ్రోధారుణాది కుమారసంఘంబును
గూడి తమతమ బలంబులుగొలువ నిజకేతన చ్ఛత్రచామరశంఖ శిరస్త్రాణతనుత్రాణ
ధనుర్బాణాది నానావిధచిహ్నచిహ్నితంబులగు రథంబులెక్కి రయ్యవసరంబున.
సీ. శుభమస్తు దేవతాచూడావతంసయంచు సరోజగర్భాది సురలుపల్క
భద్రమస్తు సుపర్వపరిపంథిహరయని సిద్ధమునీంద్రు లాశీర్వదింప
మంగళమస్తు రమానాథయని యక్షవనితలు గర్ణపర్వముగఁబాడ
విజయోస్తుతే జగద్వినుత విక్రమయని వందిమాగధులు దైవారముసఁగ
నాగ ఘీంకార ఘంటానినాదములును । ఘోరిగంధర్వ విపులహేషారవంబు
నిష్ఠురస్యందనోదగ్ర నేమిరావ । మును దిశల్ నిండఁ గదలె నా మురహరుండు.

వ. ఇవ్విధంబున నశేషబలసమేతుండై కదలి రాజమార్గంబున నల్లనల్లన చనుదెంచు నప్పుడు. ౨౨.

గీ. పౌరపుణ్యపురంధ్రు లభ్రంకష కన। కమయ సౌధాగ్రములనుండి కంసవైరి
మీఁదఁ జల్లిరి లాజ సమ్మిళితపుష్ప। ములు జయధ్వను లాకాశమునఁ జెలంగ. ౨౩.

వ. అందు. ౨౪.

ఉ. అక్కట యింతమాత్రమునకై భువనంబులయందు నెల్లఁ జే
రెక్కిన యాదవోత్తము లనేకులు గొల్వఁగ మేటికయ్యముల్
పెక్కులు గెల్చినట్టిహరి పెంపునఁ దాఁ జననేల యిందులో
నొక్కఁడ చాలు నోర్వఁగ రణోర్విని గౌరవపాండవేయులన్. ౨౫.

క. అని పలుకువారు గొందఱు। ఘను లర్జునుమూఁకలోనఁ గలరు నదీనం
దన గురు కర్ణాశ్వత్థా। మ నకుల కృప వాయుతనయ మద్రేశాదుల్. ౨౬.

క. వారలయం దొక్కొక్కఁడ। యీరేడుజగంబులను నెక్కటిఁ గడిమిం
దేరినవారలు వీరలు। నారూఢబలాధికులు జయము విధియొసఁగున్. ౨౭.

క. అనువారలునై చూడఁగ। ననుజులుఁ దనుజులునుగొల్వ నతిసంతోషం
బున నేనలు మున్నుగ న। వ్వనజాక్షుఁడు వెడలె ద్వారవతిపురమనఘా. ౨౮.

వ. అప్పుడు. ౨౯.

సీ. పరశు తోమర గదా ప్రాస కృపాణ చాపశరాఢ్యులై వీరభటులుచనఁగ
సమరసన్నాహ భీషణ రౌధజన మనోరథ సమానంబులై రథములరుగ
నిజవేగజిత మనోనిలజవవాజి సంహతి ధరాతలము గ్రక్కదలఁబర్వఁ
బృథులఘంటాజాత భీషణారావంబు సురల బెగ్గిలఁజేయఁ గరులునడవ
నా మహాభారమోర్వక యవని గ్రుంగ। దిక్కరులు ౹మ్రొగ్గ శేషుండు దిరిగె మును క
కచ్ఛపంబును దలయెత్తఁగానదయ్యెఁ। గ్రోడమును నిల్వనోపక కొమ్ము వంచె. ౩౦.

వ. ఇవ్విధంబున బంధు భ్రాతృ పుత్రమిత్రాదిజనంబులు పరివేష్టించికొలువ శమంతక పంచకంబునకుం జనుదెంచి యంతకమున్న పన్నినం గనుపట్టు పట్టాంశుక విరచితాభ్యంతర నివాసంబులును నీలపటకల్పితానల్ప కుంజరశాలలును ధవళాంబర కృత దుగ్ధ జలజంత్రచేల నిర్మితంబులగు గుడారంబులును విలసిల్లు నిజశిబిరంబు గోధూళికా లగ్నంబునం బ్రవేశించి బలభద్రాదుల నుచితస్థానంబుల కనిపి రథంబు డిగ్గి యభ్యంతరంబున కరిగె. ౩౧.

గీ. నలిననేత్రుండు పన్నీరుజలకమాడి। వస్త్రభూషణమాల్యముల్ వరుసఁదాల్చి
బుధులతోఁగూడి సంధ్యాది విధులుదీర్చి। యన్నపానాదికృత్యంబు లాచరించి. ౩౨.

క. అరవిరి పూఁబానుపునై । మురాంతకుఁడు పవ్వళించె మాద్రిజు లడుగుల్
పరిపరిలాగుల నొత్తఁగ । మరువపు సురటీలు వీవ మది ముదమొదవన్. ౩౩.

వ. అనవుడు నుదారస్వాంతుండగు నిలావంతుండు హరిగుణానురాగియగు శుకయోగి కిట్లనియె. ౩౪.

క. హరి యివ్విధమున సేనా । పరికరములతో శమంతపంచకమునకుం
ద్వరితముగ వచ్చినంతట । హరిసూనుం డేమిచేసె నానతియీవే. ౩౫.

వ. అనుడు శుకయోగీంద్రుం డిట్లను నాతెఱంగున హరి సుఖనిద్రం జెందిన తత్సైన్యంబుల వారలును మజ్జనభోజనాది కృత్యంబులుదీర్చి విశ్రమించిరంత నిక్కడఁ బాండవ స్కంధావారంబున నొక్క రమ్యప్రదేశంబునఁ గరదీపికా సహస్రంబులు వెలుంగ బాహ్లికాది కురువృద్ధులును ద్రుపదాది బంధులును ద్రోణాది మాన్యులును గర్ణాది ప్రభులును ధర్మజ సుయోధనాది పౌత్రులును బరివేష్టింపఁ గాంచనపీఠికాసీనుండై యున్న గాంగేయునకు నర్జునుం డిట్లనియె. ౩౬.

మ. హరి యేతెంచె సమస్తబంధువులు సైన్యాధీశులున్ నందనుల్
కరి గంధర్వరథాశ్వసేనలు సమగ్రప్రీతిఁ గొల్వంగ సం
గరకేళీపరులై మదీయ రథులం గాల్ద్రివ్వుచున్నారు ని
ర్భర దర్పంబున రేపకడ సంగ్రామంబు సేయందగున్. ౩౭.

క. అనుడుఁ గిరీటికి గంగా । తనయుం డిట్లనియె నతని తలఁపెఱిఁగి ప్రియం
బున నట్లే చేయుద మీ । జననాథుల ననుపు యుద్ధసన్నద్ధులుగాన్. ౩౮.

వ. అన నప్పార్థుండు పార్థివోత్తముం గనుంగొని యిట్లనియె. ౩౯.

మ. హరితో నీధరణీవరాగ్రణికినై యాయోధనక్రీడకున్
బురికొంటన్ వడి నేఁడు మేనులు తృణంబుల్ గా విచారించి వీ
రరసోద్రిక్తమనస్కులై మెఱయువారల్ నిల్వుఁడాత్మన్ శరీ
రరతిం జెందిన భూవరుల్ చనుఁడు పుత్రభ్రాతృసంయుక్తులై. ౪౦.

వ. అనిన వారెల్లను నైకమత్యంబున నర్జునున కిట్లనిరి. ౪౧.

క. సురనాథతనయ సంగర । ధరణిని బ్రాణంబులాసఁ గెదవము కాచింతా
మరణేరణేయనెడు పలు । కెఱుఁగమె నీకేల మమ్ము నిట్లాడంగన్. ౪౨.

వ. అనిన నట్లేని కయ్యంబునకుఁ జయ్యన సన్నద్ధులై రండని యనిపిన నెల్లవారలుం దమతమ విడుదులకరిగిన యనంతరంబ భీష్ముండును బాహ్లిక ద్రుపదాదులును నిజ నివాసంబుల కరిగి యుచితప్రకారంబున నుండిరంత. ౪౩

క. తెలతెలవేగినఁ బతిహా । రులచే సన్నరుఁడు భూవరులకు దొరలకున్
బలములలో నాయితమై । నిలుఁడని చెప్పించె నంత నిజశిబిరములన్. ౪౪.

సీ. పక్కెరల్ వేయుచో భద్రదంతావళఘటలు గావించు ఘీంకారరవముఁ
బల్లముల్ గట్టుచో నుల్లాసముగఁ జేయు సైంధవశ్రేణి హేషారవంబు
నాయితమొనరింప నందంద తిరుగంగఁ దేరులఁ బరఁగు చక్రారవంబు
సన్నద్ధులగుచు నుత్సాహంబుతో వీరవరులొనరించు నాహ్వానరవము
విజయభేరీమృదంగాది వివిధతూర్య । రవములొక్కట దివి భువి నవియఁజేయఁ
బూర్ణచంద్రోదయాత్యంత ఘూర్ణమాన । సాగరంబును బోలి తత్సైన్యమడరె. ౪౫.

వ. అయ్యవసరంబున సూర్యోదయంబైనఁ జతురంగబలంబులు సవరణలఁ గనుపట్టి నేల యీనినచందంబున సంగరంబునకు నరుగం దొడంగెనంత. ౪౬.

సీ. కాంచన పద్మరాగశ్రేణిచే నొనర్చినయట్టి దివ్యకిరీటమమర
నతులిత వజ్రమయంబై యభేద్యమై తనరు వర్మము మేన ఘనతచూప
మరకతమాణిక్యమయదండయుక్త ప్రతాపాంక వానరధ్వజము మీఱ
నంభోజసంభవస్యందనరథ్యవిభ్రాజితగంధర్వరాజి మెఱయ
మద్రనాథుండు నొగలపై మహిమఁ జెలఁగ । గాండివంబును గవదొనల్ కాంక్షఁ బూని
దేవదత్తనినాదంబు దిశలు నిండ । విజయుఁ డత్యుగ్రమూర్తియై వెడలెననికి. ౪౭.

వ. వెండియు భీష్మ ద్రోణ కృపాశ్వత్థామ కర్ణ బాహ్లిక సోమదత్త భూరిశ్రవులును ధర్మజ భీమ నకుల సహదేవులును దుర్యోధన దుశ్శాసన దుర్ధర్షణ దుష్ప్రహాది ధార్తరాష్ట్రశతంబును ద్రుపద శిఖండి ధృష్టద్యుమ్నాది పాంచాలవర్గంబును విరాట ధృష్టకేతు సుదక్షిణ యవన నీల విందానువిందులును కేకయమహీపాలు రేవురును భగదత్తాలంబస హలాయుధ ఘటోత్కచాదులు రుక్మి సైంధవ శకున్యాది నానాదేశాధీశ్వరులును దమతమ చతురంగబలంబులు గొలువ రథారూఢులై నిజకేతన ఛత్త్రచామరాదిలాంఛనంబులు మెఱయింపుచు నొండొరుల సంగరోచితాలాపంబులాడుచు నద్దేవేంద్రనందనుం గూడ నడచిరంత నందఱుం గలయం జూచి.

సీ. వివిధశస్త్రాస్త్రప్రవీణులై తగు వీరబలము నొక్కమ్మడిఁ బాదుకొలిపి
వారికిఁ బ్రాపుగా వాయువేగములైన గుఱ్ఱంపు దళములఁ గుదురుపఱచి
వానికిఁ గాపుగా నానారణక్రియశూరులచే మీఱు తేరులునిచి
వానికి బాసటగా నున్నతద్విపప్రచయంబు చాలుపువాఱఁ జేసి
నడుమ నొక్కొక్క నేర్పరిఁ దగనమర్చి । యనిమిషాధీశ నందనుం డనువెఱింగి
మానుషవ్యూహమొనరించె భూనుతముగ । సకలయోధులుఁ జూచి యాశ్చర్యమొంద.

వ. ఇవ్విధంబున మానుషవ్యూహంబుఁ బన్ని యందనకుముందట గాంగేయ రాధేయు లును దానును వామభాగంబున గురుకృపాశ్వత్థామలును దక్షిణపార్శ్వంబున భీమ ధృష్టద్యుమ్న ఘటోత్కచులును నడుమ యుధిష్ఠిర నకుల సహదేవ దుర్యోధన దుశ్శాసనాదులును జతుర్ధనుందును వెనుక బాహ్లిక సోమదత్త భూరిశ్రవులును నెడనెడ ద్రుపద శిఖండి విరాట దృష్టకేతు కేకయ నీల సుదక్షిణ విందాను విందులును భగదత్తాలంబస హలాయుధ రుక్మి సైంధవాదులు తమతమ తనుత్రాణ శిరస్త్రాణ చాపబాణతూణంబులు ధరియించి హస్త్యశ్వరథారూఢులై వీరాలాపం బులు నిగుడం బడమరమొగంబైయుండ నంతకమున్న యక్కడ. ౫౦.

మ. వనజాక్షుండును వైదికోత్తములు భవ్యప్రక్రియం బాడ పే
ల్కని కాలోచితకృత్యముల్ నడపి యక్కౌంతేయు లారాధనం
బున కేతెంచువిధంబెఱింగి బలరాముండు న్మదింబొంగి గొ
బ్బున సేనల్ వెడలింప వేత్రసమితిం బంపెన్ రణక్షోణికిన్. ౫౧.

వ తదనంతరంబ. ౫౨.

గీ. గరుడకేతనంబు గగనంబు నొరయంగ । ఖడ్గబాణచాప గదలమెఱుఁగు
లెల్లదిశలునిండ నెలమి దారకుఁ డర । దమ్ముఁదేరఁ గదుముదమున నెక్క. ౫౩.

మ. రమణీయంబగు పాంచజన్య జాతారావంబు గర్జావిశే
షముగా ఖడ్గమరీచిజాలము తటిత్సంఘంబుగా నుగ్రచా
పము దేవేంద్ర శరాసనంబుగను శుంభత్కృష్ణమేఘంబు పా
ర్థ మహాగ్నిచ్ఛటమీఁది కేగె శరధారాలాల నొల్లాసియై. ౫౪.

వ. మఱియు. ౫౫.

ఉ. విధ్వమలాంశురేఖయన వెల్లనిగాత్రము చెంగలింపఁ దా
లధ్వజరాజ సీర ముసలంబులు భీషణవృత్తిఁ జూప శం
ఖధ్వని లోకజాలములు గంపమునొందఁగఁ జేయవచ్చె న
య్యధ్వమునన్ మురారి గొనియాడఁ బ్రలంబవిరోధి యాజికిన్. ౫౬.

ఉ. అత్యధికప్రతాపము జనావళి సన్నుతిఁ జేయ సంగరా
చిత్యము మీఱ వర్మము విచిత్రకిరీటముఁ దాల్చి శస్త్రసాం
గత్యమున న్విరోధులకుఁ గాలుఁడనం గడు భీకరాకృతిన్
సాత్యకివచ్చె ధర్మరథజాలము ప్రోయఁగ యుద్ధభూమికిన్. ౫౭.

శా. విద్యుల్లీలఁ జెలంగు ఖడ్గరుచిరావిర్భూత రుగ్జాలముల్
ఖద్యోతప్రభనించఁ జక్రరవ మాకాశంబునం బర్వ యు

ద్ధోద్యోగంబున మత్స్యకేతనముతో యోధావళుల్వెంటరాఁ
బ్రద్యుమ్నుం డరుదెంచె వైరికులగోత్రచ్ఛేద దంభోళియై. ౫౮.

మ. ఘనబాణాసన బాణమండలిగదా ఖడ్గంబులన్మించు మిం
చిన తేరున్నతలీల నెక్కి సిడముల్ జిత్రాతపత్రంబు మీ
ఱ నవీనోజ్జ్వల దివ్యవర్మము శిరస్త్రాణంబుఁ జూపట్టఁగా
ననిరుద్ధుం డనిరుద్ధవృత్తి నడచెన్ హర్షంబు సంధిల్లఁగన్. ౫౯.

శా. చండప్రక్రియ మేఘడంబరము లాశాచక్ర ముక్కుమ్మడిన్
నిండన్నవ్యరథంబుపై నిలిచి తూణీరంబులున్ సజ్య కో
దండంబున్ ధరియించి కంకట శిరస్త్రచ్ఛన్నుఁడై చారుదే
ష్ణుం డేతెంచె మహోజ్జ్వలాకృతి రణక్షోణీ జయోత్సాహియై. ౬౦.

ఉ. అంబుజలోచన ప్రతిముఁ డాహవకేళి ధురంధరుండు బీ
రంబున విల్లు నమ్ములుఁ గరంబులఁబూని విపక్ష భీకరా
డంబరవృత్తి దిక్కులు వడంక మహారథమెక్కి వేడ్కపై
సాంబుఁడు వచ్చె వాహినులసంఖ్యలు గొల్వఁగ యుద్ధభూమికిన్. ౬౧.

సీ. ఉద్ధసంగ్రామస్థలోద్ధవుం డుద్ధవుం డుగ్రోగ్రసేనుఁ డయ్యుగ్రసేనుఁ
డఖియాతిరాజమహాక్రూరుఁ డక్రూరుఁ డరితమోనిచయోద్య దరుణుఁ డరుణుఁ
డతులిత ధీరతా కృతవర్మ కృతవర్మ కాంచన మణిమయాంగదుఁడు గదుఁడు
దారుణ సమరైకతానుండు చేకితానుం డాస్యజితపుష్కరుండు పుష్క
రుండును శుకుండు దీప్తిమంతుండు భాను। విందుఁడు సునందనుండును వేదవాహుఁ
డును బృహద్భానుఁడును వృకుండును రథంబు। లెక్కి చనిరనికి ధరణి గ్రక్కతిలఁగ.

వ. మఱియు భానుదేవుండును సారణుండును శతదేవుండును వరూధియుఁ జిత్రబర్హియు నాదిగాఁగల యోధులు దమతమ సేనాసమేతులై యొండొరులఁ గడవఁ బంతంబులు వలుకుచు సింహనాదంబులు సేయుచు శంఖంబులు పూరించుచుఁ గృష్ణునిం గూడి చనిరంత గజదానధారా గంధలుబ్ధ పుష్పంధయ ఝంకారబధిరిత దిక్తటంబులై చలితఘంటాఘణాఘణారావ నిజఘీంకార ప్రతిధ్వనిత చక్రవాళాచల గహ్వరంబులైన మత్తదంతావళంబులును మత్తదంతావళి మదజలకలితమార్గ దుర్గమకర్దమంబు డెక్కలత్రొక్కుడుఱచే నింకిపగిలి బీటలై రజోవికారంబుఁ జెంది యొగసి మొగసి చూచు గంధర్వ గరుడసీమంతినుల సీమంతసీమల సిందూరరేఖలై తత్కబరీభర విలసిత మందారతరుప్రసూన నిష్యందమానమరందానంద దిందిందిరంబులపైఁ బుప్పొడి యొప్పునం గప్పి మెఱయ నడతెంచు భీషణహేషాఘోషణంబుల

జయసూచనంబుచేయు వాయువేగ తురంగంబులును వాయువేగ తురంగంబుల గట్టివఱచి సారథులు వలసినయెడలకు నడిపింప యుద్ధసన్నద్ధులగు రథికులకు నెలవులై యిరుగడవచ్చిన భుజంగమంబుల తెఱంగునం దనరు విచిత్రకేతనంబులును గేతనంబులఁ బొ[illegible]ది యాత్మచక్రనేమిధ్వానంబులచేత శైలగహ్వరంబుల నింద్రించు సింగంబుల మెలుకొల్పు రథంబులును రథంబులకంటె వడిగలిగి ధనుర్బాణపట్టిసప్రాసపరశ్వథశూలభిండివాల తోమరక్షురికాగదాది నానావిధాయుధ సన్నద్ధులై యుబ్బున నిబ్బరంబైన బెబ్బులుల చందంబునఁ గొదమసింగంబుల తెఱంగునం బొంగి బ్రహ్మాండంబుపగుల నార్చుచు నుఁడోరులఁ గడవఁబఱతెంచు వీరభటులుం గలిగి యెడలేక ఘోషించు విజయభేరీమృదంగ కాహళాదుల యారావంబుల నమరి యిరువది యక్షౌహిణులుం గనుపట్టి యత్మ సేనాసముద్రం బర్జునద్వీపంబు ముంపుటకునై యెదురునడచి నిల్చిన. ౬౩.

ఉ. ఆహరి పాండవేయులు నయంబున పన్నినయట్టి మానుష
వ్యూహముఁజూచి యందునకు నోర్చి జయించుటకై మహాచల
వ్యూహమునర్చెనంత సరియోధులు విస్మయమొంది సంగరో
త్సాహముఁదక్కిరాత్మల భుజంగమరాజసుతాతనూభవా. ౬౪.

వ. అని మఱియు నిట్లనియె నట్లు పన్నిన యుగ్గ్రరంబుముందఱఁ దానును బలభద్రుండును సాత్యకియును వామభాగంబునఁ గృతవర్మ ప్రద్యుమ్నానిరుద్ధులును దక్షిణపార్శ్వంబున గద సాంబ చారుదేష్ణులును మధ్యప్రదేశంబున బంధుమిత్రామాత్యసహితుండై నెలయేరులతోడి నడగొండలంబోల్పు గంధసింధురంబులు పరివేష్టింప రథారూఢుండై యుగ్రసేనుండును బశ్చాద్భాగంబున నుద్ధవాక్రూరచేకితాన సారణాదులును నెడనెడ బృహద్భాను భానుదేవ శ్రుతదేవ వృక శుక సారణాది కుమారులునుం దమతమ యడియాలంబులు మెఱయనుండిరి వారల యుద్ధంబుఁ జూడ నంతకమున్న పురందరాది బృందారకులు విమానారూఢులై యంతరిక్షంబున నిల్చిరంత. ౬౫.

క. మోహరములు రెండును స। న్నాహంబునఁ దారసించినఁ ఫల్గున సే
నాహంకృతి యుడివో ను। త్సాహంబున శౌరి పాంచజన్యంబొత్తెన్. ౬౬.

క. వెండియు రాముఁడుఁ బ్రద్యు। మ్నుండును సాత్యకియు సారణుండును ననిరు
ద్ధుండును గృతవర్మయు సాం। బుండును శంఖంబులపుడు మొరయించిరొగిన్.

గీ. సకలయాదవసేన యుత్సవముతోడ। సింహనాదంబు లొనరింప సింహనాద
ముల యటంచును భీతిపెంపునఁ గిరీటి। బలములోఁగల కుంజరంబులు వడంకె.

వ. మఱియుఁ గృష్ణుని సైన్యంబునందు విజయభేరీశంఖ కాహళాదులు మొరయించిన నారావంబు ప్రళయకాల ఘూర్ణమానార్ణవ ధ్వానంబు ననుకరించె సకల యోధ వీరులును గయ్యంబునకుఁ గాలుద్రవ్వుచు ధనుర్గుణటంకారంబులు నిగిడింపుచుఁ జతురంగబలంబులు మున్నునడపించిరంత. ౨౦

క. ఈకైవడి హరిసేనా । నీకము నడతేరఁ జూచి నిష్ఠుర కోపో
ద్యద్భ్రూకౌటిల్యమున సుభ । ద్రాకాంతుం డపుడు దేవదత్తంబొత్తెన్. ౨౧

సీ. తదనంతరంబున ధర్మపుత్రుం డనంతవిజయంబును వృకోదరుఁడు పౌండ్ర
మును మాద్రిపెద్దనందనుఁడు సుఘోషంబుఁ దెలివిమీఱఁగ సహదేవుఁడు మణి
పుష్పకంబును నదీపుత్రుండు గురుఁడును గృపుఁడు ద్రౌణియుఁ గురుక్షితివిభుండు
హైడింబుఁడును ద్రుపదాధీశుఁడును మత్స్యపతి వికర్ణుఁడు నలంబుసుఁడు నర్క
పుత్రుఁడు మొదలు యోధులద్భుతముగాఁగ। శంఖములను మ్రోయింపఁ దత్స్వనములను
విజయ దుందుభి తమ్మట ప్రజరవంబుఁ । గూడి యొక్కట సర్వదిక్కులుఁ బగిల్చె.

ఉ. వాసవిఁ జేరవచ్చి మనవారలకున్ నెలవిమ్మటంచు దు
శ్శాసనుఁడాడి యవ్విభుని సమ్మతినొంది చెలంగి యాత్మ సే
నాసమితిన్ రయంబున రణంబునకుం బురికొల్పునంత ను
ల్లాసముతోడ నమ్మొన చలంబున యాదవసేనఁ దాఁకినన్. ౨౩.

చ. హరులు హరుల్ రథావళి రథావళి యోధులు యోధు లుగ్రకుం
జరములు కుంజరంబులును సందడిగాఁ దలపడ్డ నప్పు డ
బ్బరవస మిట్టిదట్టిదనిపల్క నశక్య మహేంద్రునకైన నా
సరసిజసూతికైనను భుజంగమహారునకైనఁ జూడఁగాన్. ౨౪.

వ. మఱియు నుభయసైన్యంబులం గనుపట్టు వీరభటులు చటులచక్ర చంక్రమణవిలాస నిరుపమోద్యములై యీసున రేసి పోతరించి యాఁబోతులరీతి గంధసింధురంబుల చందంబునఁ గొదమసింగంబుల తెఱంగునం దలంపడి పోరుచోఁ గఠారంబుల వారలు మీఱినవంతంబులం బలుకు నుడుగులు లెక్కగొనక యొండొరుల నేరుపునం బొడువఁ గడువడిన్ సందడింపుచు నిష్పలాలుక సరిదాటులుగవిశంగిల వయిచుచు బిరుదునం దివురుకొను నెడ వెఱపులుగని కమ్మి నెమ్మి సంతసిల్లి ఱంకెలు వైవ సంగరంబులకు నూటిపట్టి నెట్టనఁ జంపి చచ్చువారలు నడ్డాయుధంబులఁ బ్రవీణులై సంచలింపక యొకండొకండు పదుగురేగురతోడ బ్రమరి విశేషంబులం జరియింపుచు డాయుచు వ్రేయుచు నొండొరుల వ్రేట్లుదప్పించి దాఁటుచు నీటున నరి కెదిరించి యుఱుకుచుఁ బరస్పరహేతిగతుల నంగంబులు వ్రీలినఁ బిఱికివాఱక

సాహసంబున మించి నేలకొఱగువారును నానావిధాయుధానీకంబులు ధరియించి బంటుతనంబున శూరులతోడం దలపడి సంగరప్రకారంబునం బెఱవారలు చూచుచుండఁ బోరాటం బొనరింపుచు హుంకారంబు నిగిడించుచు నొక్కసాధనంబు దమచే నొప్ప నది నెత్తురు కాఁక వీఁకఁ దిగువరాకున్న నొండొక యాయుధంబు గొని నఱక నదియుఁ దుత్తుమురైన వేఱొక శస్త్రంబునఁ బొడిచి విడిచి పుడమి యంద్రువఁ గలియంబడి బాహాబాహిం బెనంగి త్రెళ్లువారును గైదువులంకించి ఱంకెలు వైచుచుఁ బదువురు నేవురు మూఁకలై యురువడించి మేనులు నింపుచుఁ బొంచి పొంచి లాఘవంబుల నెదిరి యితరేతరముష్టాముష్టి మోములుపగులఁ బోరిపడు వారలును మఱియు నూఱు నిన్నూఱుఁ జటులతుటుములై చటులగతిం గయ్యంబులు సేయఁజొచ్చి హెచ్చినగర్వంబున నన్యోన్యప్రాసంబులఁ గణ్ఠాద్యవయవంబులు దెగిన నిబ్బితి నిబ్బరంబై మగుడఁజాలక విడనిమత్సరంబునఁ గచాకచిం బెనంగి మడియువారును సహస్రసంఖ్యలగు శూరులు గుంపులై గర్వంబు పెంపున మూఁకల కుఱికి గదలఁ గదలనీక పోరి యొండొరులయెట్ల వికలులై కూలువారలును దమతమ వారలరుగఁ దెలిసి పిఱుందన యరిగియరిగి తిరిగివచ్చి పతులకడఁ జతురతఁ బోరి ప్రాణంబులు విడుచువారలును మున్నొకని గుఱిచేసి కూడం జనునెడ నడుమ నొకండు దలద్రెంచినం బడక వాని నఱికి పడు వీరుల మొండెంబులును ధనుజులుం దనుజులుం జుట్టంబులు మొదలగువారలకు నెడనడుము సొచ్చి తెంపుచేసి మృతిఁ బొందువారలును భయంకరంబైన పోలికలనందారఁగు రక్తమాంసపుఁ దిట్టలుసూచి వెఱచి తలకొక లెఱుంగలేక వెఱ్ఱియాటలాడుచు నుభయసైన్యంబులవారలు చూచి నవ్వఁ బరువులువెట్టువారును గశాతాడనంబునం జేసి తురంగమంబులం గదలించి డాసి యితరేతరప్రహరణంబుల సశ్వపల్యాణసహితంబుగా రెండు తునియలై కీలుదప్పిన బొమ్మలచందంబునం గూలు రాహుత్తులును నంకుశాఘాత కుపితంబులై యొండొంటి మర్మంబులు గాఢదంతాదంతిం బోరి మావంతులతోడఁ బీనుంగులైన యేనుంగులును సారథులురవడించి యశ్వంబుల పగ్గంబులు వదలి కదియఁద్రోలినఁ బరస్పరబాణఘట్టనల రథంబులు తిలప్రమాణఖండంబులై దొఱఁగిన విరథులై కరవాలంబులుం బలుకలుంగొని యోలమూసగొనక యొండొరుం డాసియుఁ ద్రేసియుఁ దప్పించియుం గుప్పించియుఁ బోరిపోరి పొలిసిన రథికులుం గలిగి యాసందడి కయ్యంబు భయంకరంబై యుండెనంత. ౭౫.

ఉ. వాసవనందనుం గడచివచ్చి వికర్ణుఁడు దోడుగాఁగ దు
శ్శాసనుఁ డేచి సాంబుని నిశాతశరంబుల నేయ నవ్విభుం

డీనుని మత్సరంబు మదిహెచ్చఁగఁ గృష్ణుఁడు మెచ్చనార్చి యు
ల్లాసముతో డవాఁడు దెరలన్విశిఖంబులనొంచి వెండియుజ్. ౪౬.

క. శరములరెంట వికర్ణుని । తురగంబుల నొంచి పడఁగఁ దొమ్మిదితూపు
ల్వాలపి పొడిఁజేసి సారధి । నురువడి నొకకోలచేత మక్కుడఁగించెన్. ౪౭.

ఉ. అత్తఱి దుస్సేనుఁడు రయంబునఁ దీవ్రశరంబుచేత వీ
రోత్తము సాంబునొంచి మఱియుం బదునేనుమెఱుంగుటమ్ము లు
వ్వెత్తున సారథిం దగులనేసి తెరల్చినఁ గృష్ణనందనుం
డొత్తి నిశాతబాణమున నొక్కటనేసె నతండు మూర్ఛిలన్. ౪౮.

చ. కడువడి సారణుండు తెలిగన్నులఁ గెంపుదలిర్ప నగ్రజుం
గడచి శరద్వయంబున వికర్ణుని సారథిఁ జంపి పుచ్చియున్
నిడ మిరు మూడుబాణములఁ జెక్కులువాపుచు వానిబాహులం
జెడిదపుటమ్ము లాఱువఱపెన్ గగనంబు గలంగనార్చుచున్. ౪౯.

ఉ. వాఁడును రోషమెత్తి హరివాహిని బెగ్గిల సాంబుతమ్ముని
న్వాఁడు నిశాతబాణముల నొంచి హయంబులఁ గేతనంబుఁ గ్రొ
వ్వాఁడి శరంబులేసి నెఱవాదితనంబునఁ ద్రుంప నాతనిన్
బోఁడిమిమాన్చి యార్చెఁ గురుపుంగవసైన్యము దైన్యమొందఁగన్. ౫౦.

గీ. అది గనుంగొని కృష్ణుసైన్యంబులెల్ల । నార్చి భేరులు మొరయింప నర్జునుండు
తనబలంబులఁ బురికొల్పి తానుఁ గడఁగి । తోరమగుకినుకతోడఁ బ్రద్యుమ్నుఁదాఁకి.

గీ. అతనిపై జాలుకొన ముంచెనంపవెల్లి । మీనకేతుండు నతనిపైమించి ఘోర
సాయకంబులు వఱపె మాద్రేయులలిగి । చారుదేష్ణునిఁదాఁకి రుత్సాహమొదవ.

క. ఆ రుక్మిణికొమరుండును । వారల రథ్యములమీఁద వడి నూఱమ్ముల్
తోరముగ నేయ వారును । ఘోరాస్త్రములేసి హరులఁగూల్చిరి నేలన్. ౫౩.

వ. అంత. ౫౪.

సీ. సురనదీసూనుండు హరిపూర్వజన్మపై నాలుగుబాణముల్ నాటె నతఁడు
కోపించి హలము చేఁగూల్చె రథ్యంబుల భీముండు సాత్యకిఁ బేర్చి నూఱు
శరములనేసిన బరవసంబున వాఁడితూపుల నేడింటఁదునిమెఁ బడగ
ద్రోణుండు కృతవర్మఁ దొడరి తొమ్మిది నారసంబులు పరఁగింపఁ జండసాయ
కముల నేనింట నతఁడు దక్కుంకటంబు।చూర్ణమగఁజేసె నల్కమైఁ గర్ణుఁ డమ్ము
లేదుపదులను ననిరుద్ధుఁ గాడనేయ । నతఁడు నన్నింటనొప్పించె నతనిమేను. ౫౫.

గీ. ద్రౌణివడిఁ జేకితానుని తనువు మూఁడు । బాణములనొంప నతఁడు నక్షీణశక్తి
నాలుగమ్ముల నతని గంధర్వములను । దనువు లెడఁబాపి యొకటఁ గేతనము ద్రుంచె. ౮౬.

గీ. బాహ్లికుం డుగ్రసేనునిఁ బదిశరముల । నొంచె నాతండుఁ దూపులేను నిగిడించె
నతనిదేహంబు దల్లడమంద సోమ । దత్తుఁ డొకయమ్ముచేత సుద్ధవుని ద్రుచ్చె. ౮౭.

క. భూరిశ్రవుఁ డరుణునిపై । ఘోరాస్త్రమ్ము లిరువది నిగుడ్పఁగ నాతం
డీరేడు పెద్దతూపుల । సారథి రథచాప కేతుజాలముఁ ద్రుంచెన్. ౮౮.

వ. వెండియు ధర్మనందనుండును సుయోధనుండును ఘటోత్కచుండును నీలుండును గేకయులును ద్రుపదుండును విరటుండును సుదక్షిణుండును విందానువిందులును గురుకరూశాది దేశాధీశులును నొక్కుమ్మడి శరపరిఘ చక్ర తోమర శూలాది బహువిధాయుధంబుల నరిబలంబులు బడలువడ నుద్దండవృత్తి మోదుపఱచి రందు ఘటోత్కచుండు. ౮౯

శా. మార్వీరావము దిక్కులందు వెడల న్మాయాబలస్తోముఁడై
వార్వాహంబున మింటికిం జని శిలల్వర్షించు నొక్కొక్కచో
గర్వోద్రిక్తమనస్కుఁడై రథికులన్ ఖండించు నొక్కొక్కచో
దుర్వారాశుగకోటిఁ గాలుబలముం దూలించు నొక్కొక్కచోన్. ౯౦.

వ. మఱియును. ౯౧.

మ. ఒకచో నాఱుచు నొక్కచోఁ జటుల బాహోల్లాసము ల్సేనవా
రికిఁ గానంబడఁజేయు వేఱ యొకచోఁ గ్రీడాగతిం గుంజర
ప్రకరంబు న్వడిఁజెండివైచు నొకచో రథ్యంబులన్ గూల్చు నొం
డొకచోఁ జీఁకటి గొల్పునంపగమిచే నుద్దామ తేజంబునన్. ౯౨.

క. ఈరీతి నింద్రనందను । వారలు వెఱఁగందఁ గృష్ణవాహిని గలఁగన్
ఘోరాస్త్ర పరంపరచే । వారక పదివేలరథుల వడివధియించెన్. ౯౩.

ఉ. వెండియుఁ గృష్ణసైన్యములు వీఁగినఁ గన్పడి ద్రోలఁజూచి సాం
బుండును సాత్యకిం గలసి పూనికతోడ ఘటోత్కచున్ మహా
కాండములేసి నొంచి తురగంబుల పీఁచమడంచి సారథిన్
గుండెలు వ్రీలఁజేయుటయు ఘోరపరాక్రమవృత్తి నాతఁడున్. ౯౪.

ఉ. ఒందురథంబుపైకుఱికి యుగ్రత సాత్యకిఁ గృష్ణనందనుం
బెండుపడ న్నిశాత శరబృందమువేసిన వారలిద్దఱున్
వెండియు భీమనందనుని విల్లునిడంబునుఁ దేరు సారథిం
జండతరాశుగప్రతతిఁ జక్కఁగఁజేసి చెలంగి యార్చినన్. ౯౫.

క. విరథుండై యవ్వీరుఁడు । కరమున గదఁ బూని విలయకాలుండనఁగా
బలతేరఁ జూచి సాత్యకి । శరముల నేనింట దానిఁ జక్కఁగ నేసెన్. ౯౬.

క. అనిరుద్ధుండును బుషకే । తనుఁడు బలుఁడు సారణుఁడు నుదగ్రస్ఫూర్తిన్
ఘనజాలబాణముల నొం । చిన నాతఁడు ఱిచ్చపడి విచేష్టితుఁడయ్యెన్. ౯౭.

వ. అప్పుడు. ౯౮.

క. తనవారుకుఁ బెక్కురథికులు । గనుకని నొప్పింప నుదరి కడువడిని మరు
త్తనయుఁడు ప్రళయాంబుద ని । స్వనమోయన నార్చి బాహుసారము మీఱన్. ౯౯.

ఉ. సారణు నైదుదూపులను సాంబుని దొమ్మిదిసాయకంబులన్
మీఱి పదేడుబాణముల నిష్ఠురవజ్రుని రెంట సాత్యకిన్
గ్రూరశరంబుచేత ననిరుద్ధకుమారుని మూఁడుకోలలం
దూఱఁగనేయ వారలును దోడనె కప్పిరి భీమునమ్ములన్. ౧౦౦.

వ. వెండియు. ౧౦౧.

మ. అనిరుద్ధుం డొకతూపుచేత బకదైత్యధ్వంసి చాపంబు చ
క్కన ఖండించె బలుండు నాగట రథాంగంబు ల్వడిం గొట్టెఁ గే
తన మా సాత్యకి ద్రుంచివైచె విలసత్కాండద్వయి న్మీనకే
తనుఁడున్ సాంబుఁడు నేసి రాశుగతతిం దత్కాయమత్యుద్ధతిన్. ౧౦౨.

వ. అంత. ౧౦౩.

మ. గదచేఁ ద్రిప్పుచు రౌద్రవైఖరి మహాకల్పాంతక ప్రౌఢి బె
ట్టిదుఁడై భీముఁడు చండభాస్కరునికంటెన్ దీవ్రమై నెమ్మొగం
బు దలిర్పం గనుదోయి నిప్పులురులన్ భూమండలంబెల్ల గ్ర
క్కదలన్ రాముని తేరు దక్షిణము నుగ్రైరాలఁ గొట్టె న్వడిన్. ౧౦౪.

శా. ఆ వీరుండును బాదచారియయి బ్రహ్మాండంబు గంపింపఁ గ్రో
ధావష్టంభమునన్ మరుత్తనయు సంహారంబు గావింపఁగా
వేవేగం బలతేరఁ గన్గొని మహావీరుండు పార్థుండు రో
షావేశంబున నేగుదెంచెఁ బరయోధానీకము ల్బెగ్గిలన్. ౧౦౫.

వ. అతనితోడన తోడన యుత్తమౌజుండును యుధామన్యుండును ధృష్టద్యుమ్నుండును విరాటుండును రుక్మియు భగదత్తుండును గేకయులును నేతెంచి రంతకమున్న.

శా. అశ్వత్థామయు భీష్ముఁడుం గృపుఁడు ద్రోణాచార్యుఁడుం గర్ణుఁడున్
విశ్వంబెల్ల వడంక నార్చి సమరోర్వీరేణుసంఘంబు స

హ్రాశ్వం గ్రమ్మ శతాంగముల్వఱపితాలాంకున్మదఁబేది నీ
లశ్వేతోరుగరుద్వితాన శరజాలంబేయఁగా నత్తఱిన్. ౧౦౭

శా. అభ్రధ్వానసమానశార్ఙ్గనినదం బాకాశ సంచారుల
విభ్రాంతిం బొరలింపఁ గేతసరుచు ల్వెన్నుండ నత్యంత క్రో
ధభ్రూమండలి భుగ్నమై మెఱయ శుంభత్పాంచజన్యారవా
దభ్రవ్యాప్తి మహీధ్రముల్వడఁక దైత్యధ్వంసి యేతెంచుచున్. ౧౦౮

సీ. భీష్ము నిన్నూట నొప్పించి యశ్వత్థామఁ బదియేనుతూపులఁ బాఱఁగొట్టి
ద్రోణుని నిరువదిబాణంబులఁ దెమల్చి భీముని మున్నూట బెండుపఱచి
కర్ణుఁ బంద్రెండుమార్గణముల నోనేసి ద్రుపదనందను మేనఁ దూపునాన్చి
మత్స్యనాయకుని మైమఱు వాఱుశరములఁ జించి యొక్కట రుక్మినొంచి నరక
తనయ కృపులను నిష్ఠురాస్త్రముల గ్రుచ్చి। కాండపంచకమునను గేకయుల నొంచి
నిమిషమున నొక్క యక్షౌహిణీబలంబుఁ। బిలుకుమారిచె నానాస్త్రముల నరేంద్ర.

వ. అయ్యవసరంబున నర్జునుండు గర్జారవ కాలమేఘంబు చందంబున సింహనాదంబుఁ
జేసి దేవదత్తంబు పూరించి కర్ణ గాంధారేయాదులఁ గయ్యంబునకుఁ బురికొల్పిన.

ఉ. వారలు తూర్యబంధురరవంబు లెసంగఁగ సింహనాదముల్
బోరనఁజేసి యద్భుతముఁబొంది సురల్గన శౌరి సైన్యమున్
దారుణలీలఁ దాఁకినఁ బదంపడి యయ్యదుయోధవర్యులుం
ఘోరపరాక్రమస్ఫురణఁ గోల్తలఁజేసిరి పార్థనందనా. ౧౧౧

వ. అందు బలభద్రుండును భీష్ముండును సాత్యకియు, నశ్వత్థామయు ద్రోణుండును
బ్రద్యుమ్నుండును గృతవర్మయు ధృష్టద్యుమ్నుండును నుగ్రసేనుండును బాహ్లికుం
డును సాంబుండును గర్ణుండును నక్రూరుండును నజాతశత్రుండును నుద్ధవుండును
ద్రుపదుండును విరాటుండును గదుండును భీముండును సారణుండును ఘటో
త్కచుండును జారుదేష్ణుండును దుశ్శాసనుండును దీప్తిమంతుండును దుర్యోధనుం
డును భానుదేవుండును భూరిశ్రవుండును బృహద్భానుండును దృష్టకేతుండును
భానువిందుండును రుక్మియు వృకుండును గేకయులును నరుణుండును భగదత్తుం
డును బుష్కరుండును జాంద్రాధీశ్వరుండును సైంధవుండును వేదవాహుండును
సుదక్షిణుండును శ్రుతదేవుండును యవనాధిపుండును సునందనుండును నీలుం
డును జిత్రబర్హియు విందానువిందులును వరూధియు నకుల సహదేవులును న్యగ్రో
ధుండును సైంధవుండును దక్కిన యోధులును దుర్మర్షణాదులును హేతిప్రాస
పరశ్వధ పట్టిస భిండివాల ధనుర్బాణ నానాయుధ సన్నద్ధులై యొండొరుల

ద్రేసియుఁ ద్రోసియుఁ ద్రుంచియుఁ ద్రెంచియుఁ బొడిచియు నడిచియుఁ జిమ్మియుఁ గ్రుమ్మియు మొత్తియు హత్తియు ననేకప్రకారంబులఁ గయ్యంబు సేయునెడఁ గుంజరంబులఁ గుంజరంబులును ఘోటకంబుల ఘోటకంబులును నరదంబుల నరదంబులును బదాతులఁ బదాతులుం దలపడి పిఱుతివియని బీరంబునఁ బరస్పర శస్త్రంబులఁ బొడిచియు నొడిచియు వ్రచ్చియు గ్రుచ్చియుఁ గుదిపియుఁ జదిపియుఁ గొట్టియు ముట్టియు ననేకోపాయంబులఁ బోరుసమయంబున. ౧౧౨.

క. రారాజు తమ్ములెల్లన్ । ఘోరమదేభముల నెక్కుకొని యఱవదివే
లేరుపు టేనుంగులతో । నారాముని మీఁది కేఁగ నతఁ డుద్వృత్తిన్. ౧౧౩.

క. ఏనిక మొత్తము లెదిరెడు । నేనిఁక మొత్తక యడంగ నెగ్గగునని మ
త్తానేకపముల నన్నిటిఁ । బీనుంగులఁ జేయఁ దొడఁగెఁ బేర్చిన కినుకన్. ౧౧౪.

వ. అట్టియెడ నాసుయోధనతమ్ములు దుష్ప్రహ దుర్మర్షణ దుర్ముఖ దీర్ఘబాహు భీమబాహు భీమ సుషేణ సులోచన సేనాపతి జలసంధ విచిత్ర తర్షణోగ్రాలోలుపులు పదుమువ్వురును మత్తకుంజరంబుల నెక్కి పెట్టునం డీకొల్పి చుట్టుముట్టిన నతం డందఱికి నన్నిరూపులై హలంబునన్ దగిలిచి తిగిచి ముసలంబున దత్కుంభమధ్యంబులం దివిచి జంభారాతి కుంభినీధరంబుల దంభోళిచేఁ గూల్చుచందంబున నన్నిటిం గూల్చి దుష్ప్రహుసామజంబుతోడన చదిపి తత్సోదరుఁడగు భీముని శిరంబు డొక్కసొర నడఁచి తత్కుంభికుంభములు వగులందన్ని యనంతరంబ భీమబాహుం డరుదెంచి తన దంతావళంబుచే నవ్వీరునిం బొడిపించిన నతం డచలాకారుండై తద్దంతిదంతంబులు వెఱికి వానిని వాని యేనుంగుతోడఁ బీనుంగుఁ గావించినఁ దక్కిన పదుగురును దలపడి సింహనాదంబులు చేసి యెదిరిన నా హలాయుధుండు వారలతోడన యవ్వారణంబుల మూరిమసంగి పొంగి నింగి వగులనార్చిన.

ఉ. తమ్ములు సచ్చిరంచును ముదంబఱి యర్జునుఁ జేరవచ్చి శో
కమ్మున రాజరాజు పలుకన్ సురరాజతనూభవుండు వే
గమ్మున రాజులన్ గజనికాయములుం దనతోడ రాఁగ నె
క్కుమ్మడిఁ దన్నుఁ దాఁకఁ బలుఁ డుద్ధతితోడ హలంబు ద్రిప్పుచున్. ౧౧౬.

చ. నిలిచిన సర్వసైన్య ధరణీవరముఖ్యులు నేగి సాయకం
బులు నిగిడించి రాకసము పోఁడిమి గానఁగ రాక యుండ న
బ్బలుఁడును వానిఁ గైకొనక బంధురహస్తహలంబుచేత రా
జులఁ బొలియించి వాజుల వసుంధరఁ గూల్చె రథాలి నూచఁగాన్. ౧౧౭.

ఉ. అర్జునుఁ డప్రకల్ప నిబిడాశుగముల్ పరఁగించి వానిపై
నూర్జితశక్తి నూప నతఁ డుగ్రత నాగలిఁ గేలఁ ద్రిప్పుచున్
నిర్జరనాథనందనుని నేలకుఁ దే నడతేర నీ వి
స్ఫూర్జితమూర్తిఁ జూచి దివిజుల్ భయమంది చలించిరందఱున్. ౧౧౮.

వ. అయ్యవసరంబున భీమసేనుండు దలకడచి యమ్మహావీరు నెదురు నెడఁ బ్రద్యుమ్నా
నిరుద్ధ సాత్యకి కృతవర్మ చేకితానులు రథారూఢులై కదలి సేనామధ్యంబున
నొక్కండును బాదచారియై భీమార్జునుమీఁద నురువడించు బలభద్రుం గనుంగొని
వాయువేగంబున వచ్చి విద్వచ్చుండాఁకి. ౧౧౯.

సీ. సాత్యకి యిరువదిసాయకంబుల శల్యునేసెఁ బ్రద్యుమ్నుండు నేడు వెడద
తూపుల వర్మంబు దూఱనిగిడ్చె గదుండు తొంబదియాఱుకాండములను
గపికేతనమునించె విపులాస్త్రముల్ఘు నాల్గు కృతవర్మ హయములఁ గీలుకొల్పెఁ
జేకితానుండు నిశితభల్లముల రెంటఁ దఱిమి గాండీవంబు దాఁకనేసె
మీనకేతనసూనుండు మెఱుఁగులొలుక। రత్నపుంఖశరంబు లుగ్రంబుగాఁగ
భూనభోంతర మదరంగ నా నిలింప। సార్వభౌమాత్మజుని నేసె గర్వమడర. ౧౨౦.

ఉ. ఆ జగదేకవీరుఁడగు నర్జునుఁ డందఱికన్నిరూపులై
రాజితపుంఖసాయక పరంపర లభ్రము నిండ నాత్మ నే
నాజను లెల్ల నుబ్బ నదనం బదునార్వుర నొక్కపెట్టునం
గాజుపడంగఁ గూల్చెఁ దెలిగన్నుఁ గెంపుదొలంక వెండియున్ ౧౨౧.

సీ. కృతవర్మ సారథిఁ గెడపె మూఁడమ్ముల గదునిపై నాల్గు మార్గణములేసె
నంబకయుగళి సాత్యకిమేన నాటించెఁ గ్రూరాస్త్రమున ననిరుద్ధునిడకు
పడవైచెఁ బుడమిని బ్రద్యుమ్ను నక్షుద్రభల్లసంహతి మూర్ఛపాలు చేసె
నతనిసారథి నేరుపడర నవ్వీరునిఁ గొనియేగెఁ దమ సైన్యమునకు వేగ
చేకితానుని యురము నిశితమహాస్త్ర। పంచకమ్మున గ్రుచ్చె నప్పార్థుఁడంతఁ
గర్ణ గాంగేయ గురు కృపు లడిమిమెఱసి। హరికిఁ గేడించి తత్సేన కరిగిరపుడు.

శా. ధృష్టద్యుమ్నుఁడు నా సుయోధనుఁడు మాద్రీసూనులున్ సంగరా
వష్టంభోజ్జ్వలమూర్తులై హరిని దివ్యస్ఫూర్తిబాణంబులన్
దృష్టప్రక్రియ నేసి యార్వ నతఁడున్ ధీరాత్ముఁడై యందఱం
జేష్టల్ దక్కఁగ శార్ఙ్గముక్త విశిఖశ్రేణి న్వ్యసం జేసినన్. ౧౨౩.

మ. భగదత్తుండు నలంబసుండును విదర్భస్వామియున్ సైంధవుం
డు గురుప్రోద్భవుఁడున్ హలాయుధ విరాటుల్ నీలుఁడుం గేకయుల్

దగ భూపాలుఁడుఁగూడి యవ్విభునిమీఁదన్ మార్గణవ్రాతముల్
నిగుడంపేసి ధరాతలంబువడఁకన్ విక్రాంతులై యార్చినన్. ౧౨౪.

గీ. అప్పుడయ్యంపవెల్లికి నరుఁడు గాఁగ । సంచలింపకయుండె నాసారసాంద్రుఁ
డంబుదంబులు జలధార లగ్గలముగఁ । గురియఁ గనుపట్టు నీలాద్రి తెఱఁగుమీఱి.

వ. తదనంతరంబ యతండు. ౧౨౬.

సీ. భగదత్తు మేన డెబ్బదితూపు లెడరించి ద్రౌణిబాహుల శరద్వయము నాఁటి
నారాచయుగళి సైంధవు విల్లుఖండించి బాణములార్మ డలంబనుని మేనఁ
గీలించి యొకవాఁడికోల రుక్మిఁ దెమల్చి ద్రుపదనందను మేను దూసిపాఱ
భల్లపంచకమేసి బాణషట్కమున సుయోధను మూర్ఛపాలొనరిచి విశి
ఖములరెంట విరాటువక్షంబు వ్రచ్చి । కవల నెనిమిదియమ్ములఁ గాడనేసి
కాండవింశతిలీలఁ గేకయులఁ గ్రుచ్చి । యుగ్రమార్గణమున హలాయుధుని వైచె.

వ. అయ్యవసరంబున. ౧౨౮.

ఉ. వీరరసంబు వెల్వడిన వీఁకను మేనులఁ గ్రమ్మనెత్తురుల్
గోరకితోరుకింశుకములోయనఁ బొల్చియు ధీరచిత్తులై
తోరము గాఁగనార్చి జయదుందుభు లాక్రుటఁ మ్రోయఁ బేర్చియ
వ్వీరశిఖామణిం దఱిమి వేయిశరంబులనేసి రుద్ధతిన్. ౧౨౯.

ఉ. అత్తఱిఁ గృష్ణుఁ డార్చుచు మహాశుగసంహతి వానినన్నిటిన్
దుత్తుములై పడంగ వడితో నొనరింపుచు వారికెల్ల వి
ల్లెత్త శరంబులెత్తఁ దలలెత్త నశక్యము గాఁగనేసె ను
వ్వెత్తున యాదవోత్తములు హెచ్చఁగఁ బాండవసేన ఖేలనన్. ౧౩౦.

చ. మఱియు నతండు వారలఁ దెమల్పఁగఁ బూని తదీయవాజులన్
నెఱి చెడఁగొట్టి సారథుల నేలపయిం బడఁద్రోచి తేరుల
న్విఱుగఁగ మోఁది కేతువులు విండ్లును నొక్కుటఁ ద్రుంచి వర్మము
ల్పఱియలుచేసి తత్తనువులన్ నిగిడించె ననేకబాణముల్. ౧౩౧.

గీ. వారలెల్లను విరథులై పోరికెడగఁ । దలఁగిపోయినఁ గృష్ణుఁ డుద్దండవృత్తి
నరిబలంబులు దల్లడమందఁ జొచ్చి । యశనికల్పాశుగంబు లేయంగనంత. ౧౩౨.

క. మరలెడు మత్తేభంబులుఁ । దెరలెడు తురగములు నేలఁ ద్రెళ్లెడు రథముల్
పొరలెడు యోధులు నల్లడ । వఱచెడు రక్తంబులయ్యె వాసవిసేనన్. ౧౩౩.

వ అది గనుంగొని యర్జునుండు. ౧౩౪.

మన్యవ్యాఘ్రము.

ప్రథమాంకము.

[వర్తకశ్రేష్ఠుఁడైన విజయసేనుఁడును, ఆయన చెల్లెలు విమలయుఁ బ్రవేశించుచున్నారు.]

విమల — (కుడివైపుననున్న తలుపుదగ్గఱ చెవియొగ్గి వినుచున్నది.) చిననాయన యింకా మేలుకొనలేదనియే తోఁచుచున్నది.

విజయసేనుఁడు — (ముందుకు, వెనుకకు నడచుచు) విమలా! అక్కడ నిలుచుండుట నిష్ప్రయోజనము. చిననాయన నిద్రనుండి లేచెడిమార్గము లేదు.

విమల — (అతనికేసివచ్చి) ఆయన కదలుచుండుటను, ఇంతకుముందే వింటిని.

విజయ — ప్రక్కమీఁద నిటునటు కదలుట నీవు వినియుందువు. ఈ పల్లమందున కలవాటుపడ్డవారు మనలను రాత్రి ఆలస్యముగాఁ గాని పడకకు వెళ్లనందు కాక్షేపించి రాత్రిని బగలు చేయుచున్నారందురు గాని మధ్యాహ్నముదాఁక నిద్రించుచు పగటినే వారు రాత్రిగాఁ జేయుదురు.

విమల — ఇప్పు డెనిమిదిగంటలయియుండును.

విజయ — తొమ్మిది గావచ్చినది. చిననాయనగారి ముఖదర్శనము మనకు లభించుసరికి, వాడుకచొప్పున, పదియుఁగూడ నగునని తోఁచుచున్నది.

విమల — సరే! అన్నయ్యా! ఇందుకొఱ కిఁక విచారింపకు. నీ మనస్సంక్షోభమునకు నీ వ్యాపారనష్టమే చాలును.

విజయ — నిజము. సరకులు దగ్గఱ లేనప్పటికిని, సాహసించి క్రయవిక్రయములు చేసిన యీదుర్వ్యాపారమువలని దురంతనష్టముచేత సొమ్మంతయుఁ బోవుటయు, ఇఁక మునిఁగి కొట్టుకొనిపోవుట తరువాయిగా, ఇపుడు నేను దారిద్ర్య ప్రవాహము ఒడ్డునఁ గొట్టుకొనుచుండుటయు, నా సావుకారులను జూచుటకు మొగము చెల్లకుండుటచేత బస్తీలోకి వెళ్లుటకయినను సిగ్గగుచుండుటయు, ఇవియే చాలును. నేనింటియొద్దనున్న సమయమున నయినను విశ్రాంతి లేక, విషాదమును, ఈ మన్నెపు ముసలి బెబ్బులి యీయింటనుండుట పదిరెట్లు హెచ్చుగా—

విమల — (అడ్డగించి) ఊరుకో! అన్నయ్యా! ఇట్లనకు. నీకు కలిగిన నష్టములచేత నీస్థితి చెడినదాఁక, మున్నెప్పుడు నిట్లన్నవాఁడవు గావు.

విజయ— సరే! సరే! ఇంక అనను. ఇపుడు నాకొక్కరూపాయి కావలసినను దొరకని యీ యవస్థలో బంధువులుగూడ, ఇంటఁజేరి సత్కార మపేక్షించుట ఆగ్రహహేతువుగదా! ఆ బంధువుఁడయినను, భాగ్యముతోఁ దులతూఁగుచు మన్నెమునుండి వచ్చినవాఁడై, ఒల్లిగవ్వయయిన వ్యయపెట్టకుండ, తానును తన పరివారమును, ఇంట దాఁపరించుట, అంతకంటెను కోపహేతువుగదా!

విమల— నీస్థితి అనుకూలముగానే యున్నట్లు ఎల్లప్పుడును అతఁడు తలఁచుటకు హేతువులుండెను. ఇపుడారీతిని లేదని యాతనికిఁ దెలియఁజేయుటకు నీవంగీకరించని యెడల—

విజయ— (మాటకడ్డమువచ్చి) విమలా! మన యిరువురకును బ్రాయశః భేదము గలిగింపఁజాలిన విషయ మిదియొక్కటే! ఈసంగతి యెత్తుకొనుచున్నావు!

విమల— నేనిఁక నొక్కమాటయిన నాడను. నీతో భేదముగలిగించు సామ్రాజ్యమయిన నాకక్కఱలేదు.

విజయ— నీవు మంచిపిల్లదానవు. నేను భాగ్యస్థితిలో నున్నప్పుడు నాకభిమాన మెంతయుండెనో నీవెఱుఁగుదువు. దారిద్ర్యము వచ్చిన యిప్పుడా యభిమానము పదిరెట్లు హెచ్చయ్యెనన్నమాట యెన్నటికిని మఱువకు.

తెరవెనుక— (తలుపుచప్పుడువలె వినఁబడుచున్నది.)

విమల—అది సుమంత్రుని పిలుపు. బస్తీనుండి యాతఁడు నీకు శుభవార్తలు తెచ్చినాఁడేమో! ఎవ్వరెఱుఁగుదురు!

విజయ— నాకట్టిసంభావన లేదు. సుమంత్రుఁడు బాలసరసుఁడు, అయినను నామాట విందువా అతనిని పెండ్లాడు నుద్దేశము పూర్తిగా విడిచిపెట్టు.

సుమం— (ప్రవేశించుచున్నాఁడు.) ఎంత దొడ్డవాఁడవోయి! విజయసేనా! నీకు చాలకృతజ్ఞుఁడనయియున్నాను. తెల్లవాఱినదిమొదలు నీమేలుకొఱకే యత్నించుచు బస్తీయెల్లఁ దిరుగుచుంటిని. అందుకుఁ బ్రతిఫలమేమనఁగా, నన్ను విడనాడుమని నీ చెల్లెలి కుపదేశించుచున్నావు.

విజయ— నా యుపదేశమునకుఁ గారణము నీకుఁ దెలిసియుండవలసినదే! నేను పూర్వము తలఁచుకొన్న హరణమును మాచెల్లెలికిచ్చుట కిపుడు నాకు శక్తిలేదు. కాఁబట్టి—

సుమం— (మాటకడ్డమువచ్చి) కాఁబట్టి పరాపేక్షవిషయమయి తటస్థించిన యీ ప్రథమావసరమునందు, ఆమెకు విధివిహితముగా దొరకఁదగిన నాసంరక్షణ మామెకు లేకుండఁజేయుట యుచితమని తలఁచుచున్నావు.

విమల— (సుమంత్రునితో) నాకిష్టమయిన విచార మిపుడు కట్టిపెట్టి, అంతకంటెను అత్యావశ్యకమయిన సంగతినే మా యన్నయ్యతో మాటాడుటకు నిన్నుఁ గోరుచున్నాను. అనఁగా, అతని స్థితిగతులనుగుఱించి ప్రశంసింపుము.

విజయ— ఆహా! అది యెంత వినోదకరమయిన విషయము!

సుమం— నిశ్చయముగా! నీవు తలఁచుచూనికంటె వినోదకరమే! ఒక్కఁడయిన దక్కవకాకుండ నీ సావుకారులందఱును, నీ ఋజుప్రవర్తనము విషయమయి తమకు సంపూర్ణవిశ్వాసము గలదనియు, విశేషోల్లాసముతో [illegible]క మూఁడు సంవత్సరములవఱకును గడువిత్తుమనియు, నాచేత నీకిపుడు [illegible]ర్తమాన మంపుచున్నారు.

విజయ— వారికిని, నీకునుగూడ నావందనములు. కాని, నేను నష్టపడ్డ ద్రవ్యము నీ గడువులోపల మరల నార్జింపఁగలనను నమ్మకముమాత్రము నాకు లేదు.

విమల— అన్నయ్యా! నిశ్చయముగా నీవు సంపాదింపఁగలవు.

సుమం— ఇంతేకాక, నీ పినతండ్రి కుబేరసేనుఁడు నీవు కడగండ్లఁ బడుట కెన్నటికిని సహింప —

విజయ— (మాటకడ్డమువచ్చి) నాకుఁ బిచ్చయెత్తించుటకు నీయుద్దేశము గాని యెడలఁ ఆతనిసంగతి నింక నెన్నఁడును ప్రస్తావింపకు. అతని నొక్కఁడమ్మిడియయిన అడుగుటకంటె నేను బంటూపనిలోకి వెళ్లి పొట్టపోసికొందును.

సుమం— ఇదియేల? అతనియొద్ద పదిలక్షలకు పయిగా ధనమున్నదని విన్నానే!

విజ— అసామ్మాతఁడు నానిమిత్తమయి దాఁచవచ్చును.

సుమం— సరే! అతఁడు దాఁచుఁగాక యని నేనును గోరుచున్నాను.

తెరవెనుక— (తలుపుచప్పుడువలె వినఁబడుచున్నది)

విమల— ఈసంగతి నింక నెక్కువగా వాదించుటచేత ప్రయోజనములేదు. మా యన్నయ్య యభిమానమును నీవెఱుఁగుదువు. మా చిననాయన కన్నులువిచ్చుటకును హృదయము చల్లఁబడుటకును దైవసహాయమేతప్ప సాధనములేదు.

విజయ— (తెరనుండి చూచుచు) ఎంత దౌర్భాగ్యము!

విమల— ఇపుడేమివచ్చినది!

విజయ— ఇదిగో! అసహ్యము పుట్టించు నాముసలివిధవ చండసేన మరల వచ్చుచున్నది. ఆమెను, ఈయింటికి రాకుండ నాపు మార్గములేదా!

విమల— సరే! రానీ! ఆమె యిచ్చట చాలసేపుండదు.

విజయ— ఉండదందువా? మన భాగ్యవంతుఁడయిన బంధువుఁడు వచ్చినప్పటినుండి

గూడ నీమె యొప్పుడును ఇక్కడనే నివసించుచున్నది.

సుమం— కూఁతును బెండ్లిచేసెదనని చెప్పి కుబేరసేనున కీమె టోపివెయ్య నుద్దేశిం చిన దని నాకు తోఁచుచున్నది.

విజ— పోనీ! మన కేమి? టోపివేసిననుసరే! గొంతుపిసికిననుసరే!

చండసేన— (తెరలోపల) ఇదిగోనోయి! నేను వచ్చినానని మీ యజమానునకుఁ జెప్పనక్కఱలేదు. లోపలకు వెళ్లుటకు ముందు వర్తమానమంపుట యంటే నా కసహ్యము. (తెరఁజిమ్ముకొని ప్రవేశించి) ఎవ్వరికిఁ దెలియకుండ హఠాత్తుగా నాస్నేహితుల యొద్దకిఁకి వెళ్లి వారికి సంతోషము గలిగించుట నాస్వభావము. సంతృప్తికి సాధనమును ఇదియే!

విజయ— (ప్రక్కకు మొగముత్రిప్పి) నీ కౌతుక సంతృప్తికి సాధనమిదే!

చండ— నాయనా, విజయసేనా! క్షేమమా? విమలా! బాగున్నావా! సుమంత్రా! సుఖముగా నున్నావుగదా! కుబేరసేనుఁడు గా రెట్లున్నారు!

విమల— అవ్వా! సుఖముగా నున్నారు.

చండ— ఆమాటవిని చాల సంతోషించుచున్నాను. ఆయనయేఁడీ?

విమల— అదిగో! గదిలో.

చండ— నిజముగా? అతఁడు స్నేహపాత్రుఁడు! (లేచి ముందుకు నడచుచు) అతనినిఁ జూచినదాఁక నాకు తోఁచకున్నది. ఇప్పుడే అతనిదగ్గఱకు వెళ్లవలెను. (కుడి వయిపు గుమ్మములోపలకు వెళ్లుచున్నది.)

విజయ— ముఖ్యముగా! అయితే, ఆయన యింకను లేవలేదు.

చండ— (తొందరతోఁజూచి మరల వచ్చి) అయ్యో! విజయసేనా! ఈమాట ముందరనే చెప్పినావుకావేమి? లోకాతీతులాలసయైన యాదుదానననిన న్ను నీ వెంచినావు గాఁబోలు!

విజయ— తొందరపడకు. నిన్ను సామాన్యునిగానే తలఁచినానుగాని యంతకంటె కించిత్తయిన నెక్కువదానవని తలఁపలేదు.

చండ— నామీఁద నీకు చాలదయ! (విమలతో) కుబేరసేనుఁడు వాడుకకంటె నీదినము దాలస్యముగా నిద్రించుచున్నాఁడు. కాదా?

విమల— కాదు. పదిగంటలకు లోపుగా నెన్నఁడును ఆయన యీవలికి రాఁడు.

సుమం— చండసేనగారితోడి సల్లాపసౌఖ్యము దొరుకునని ఆయనకుఁ దెలిసి యుండెనా, యీసరికే యిక్కడికి వచ్చియుండును.

చండ— ముఖస్తుతిచేయకు నాయనా! స్తుతిలేకుండనే మా ఆటువాండ్రము సహజ

సౌందర్యము చేతనే గర్వోన్నతలము.

విజయ— (రవికకుట్టుచున్న చెల్లెలితో) అవ్వ జాము ప్రొద్దువేళవచ్చెనా, చిననాయన అప్పుడు మేల్కొని యుండఁగలఁడు.

విమల— అక్కనవ్వా!

చండ—అమ్మాయీ! నేనిప్పుడు వెళ్లను. ఈదిన మిక్కడనే యుండఁదలఁచినాను. మీకు అనుకూలమయినయెడల—

విజయ— (ప్రక్కకు మోముత్రిప్పి) ఏమి యాసుకూల్యము!

చండ— విజయసేనా! ఏమనుచున్నావు?

విజయ— మిక్కిలి అనుకూలమని.

చండ— ఎంతదయయోయి! హేతువేమందువా? నీ వ్యాపారవిషయము కొంత కొంత నాకుఁ దెలియుటచేత—

విజయ— (ప్రక్కకు మోముత్రిప్పి) నీకుఁ దెలియవలెనని యెవ్వరును గోరలేదు.

చండ— ఇక్కడ నీ పినతండ్రిగారి సార్వకాలిక నివాసము నభినందించుచున్నా—

విజయ— (ప్రక్కకు మొగముత్రిప్పి) అభినందనమున కెంత చక్కనివిషయము!

చండ— ఆపినతండ్రి భాగ్యవంతుఁడని విన్నాను. అతఁడు ధనవంతుఁడే. కాఁడా?

విజయ— అవును. అవునని నమ్ముచున్నాను.

చండ— చాల- కాదా?

విజ— ఆలాగే తెలిసినది.

చండ— తెలిసినదా? ఏమిది? ఈవిషయమును నిష్కృష్టముగా విమర్శించుట నీవు ముఖ్యకృత్యముగాఁ జేసికొనలేదా?

విజ—ఇతరుల స్థితిగతులను విమర్శించుట నేనెన్నటికిని ముఖ్యకృత్యముగాఁ జేసికోను.

చండ— ఎంత యసంగతము! ఇట్లు ఇంత సాక్షాత్తుగా నీకు సంబంధించెడి యీ విషయములోఁ జెప్పుచున్నాను.

విజ— ప్రస్తుత వ్యవహారమునందు నీకేవిధమయిన సంబంధము లేకున్నను విమర్శన బుభుక్షమాత్రము నీకు సంపూర్ణముగానే యున్నది.

చండ— (ప్రక్కకు మొగముత్రిప్పి) నా కేవిధమయిన సంబంధమును లేదని నిశ్చయించుకోకు. (పయికి) విమర్శన బుభుక్ష యని నీవిపుడంత సరసముగాఁ బలికిన వృత్తి నాకు ఏమియు ఫలాపేక్ష లేకుండ కేవలము నీక్షేమముకొఱకే నాకుదయించి నట్లు నీకుఁ దోఁచలేదటోయి!

విజ— (ప్రక్కకు మొగముత్రిప్పి) ఆలాగు తోఁచుటకు వీలులేదు.

చండ — ఒక బంధువుఁడు మన్యములో మిక్కిలి భాగ్యము సంపాదించివచ్చుట యెవరికి సంతోషము పుట్టింపకుండును.

విజయ— అవును. మానాభిమానములు పరిత్యజించి మరణశాసన భాగధేయము కొఱకు మరాశపెట్టుకొను ప్రతివానికిని సంతోషము పుట్టింపవలసినదే!

చండ— అయ్యయ్యో! ఇక్కడ మరణశాసన ప్రసక్తిలేదోయి! అతఁడు మీకు మిక్కిలి ప్రయాసము గలిగించుచున్నాఁడు.

విజయ— అది సత్యమే!

చండ— ఆతనివల్ల మీకు విస్తారము ధనవ్యయమగుచున్నది.

విజ— ఆమాటయు నీవనవచ్చును.

చండ— అందుకుఁ బ్రతిఫలముగా మీకేమైన నిచ్చుట న్యాయము.

విజ— ఆమాటమాత్రము నీవనరాదు. అతని కిల్లిచ్చినందుకును, అన్నపానము లిచ్చినందుకును, వంటపూటివానివలె లెక్కకట్టి పుచ్చుకొమ్మన్నావా యేమి?

చండ — కాదు! కాదు! ఇట్టి సంగతులన్నియు ప్రజలు తమకుతామే గ్రహింపవలెను. అతనిని మీరు సంరక్షించుచున్నారు. ఇదిగాక అతని చలచిత్తమునకు లొంగి నడచుకొనుచున్నారు. సరే! మీరేమియు ఇందుకు ప్రతిఫల మపేక్షింపకున్నను తనంతటది తాఁగలదు. ఏలాగందువా? నాబిడ్డ విమలకు వివాహము తలపెట్టినారుగదా! దాని కేమి కోరికలేకున్నను పెండ్లివేళకు తన పినతండ్రి చక్కని వస్త్రవాహనములను గొనియిచ్చినయెడల నాపిల్లది సంతోషించునని ఆతనికేమాత్రము సూచించినను తత్క్షణమే వేయిరూపాయిలసంచిని ఇయ్యకమానునా?

విమల— (ముందుకువచ్చి) అవ్వా! నేనట్టిదాననుగాను. ఇది గుర్తుంచుఁగుము. నేను సూచనలుచెయ్యను. నాకు సొగసులక్కఱలేదు.

చండ— అన్నకూఁతురా! ఇఁకఁ దెలిసినది. నీవును సుమంత్రుఁడును ఇట్టి స్వల్ప విషయములను గణింపరు. పెద్ద అరణ ముక్కదానికే కాఁబోలు మీయపేక్ష!

సుమం— (ముందుకువచ్చి) ఓ ముసలమ్మా! ఇట్టి దురపేక్షలు నాకులేవు. నేను విమలను వివాహమాడుట సొమ్ముకోసముగాదు. అమెకొక దమ్మిడియయినను ఉన్నదో లేదో నేఁ దెలిసికోను. అందుకు లక్ష్యమును జేయను.

చండ— చేయవేమి? ఆలాగయితే నీవు అసాధారణుఁడవయిన పడుచువాఁడవు. అన్నా! నేనెంత తెలివితక్కువదాననయితిని. సరే! ఇపుడు తెలిసినది. మీరిద్దఱు గూడ మన విజయసేనుని లాభముకొఱకు మీకోర్కులను మానుకొన్నారా?

ఆతనియొక్క యిప్పటి చిక్కులు తీరునిమిత్తమయి మీరందఱు గలిసి ముసలాతని నొప్పించుప్రయత్నము చేయుచున్నారేమి?

విజ— (ముందుకువచ్చి) ఓ వృద్ధురాల! ఒకమాట! నాకు చిక్కులువచ్చెనా వానిని నేనే తీర్చుకొందును. సహజముగాఁ గనఁబడుపవలసినదయినను వెనుకకుఁ బెట్టఁబడ్డ సహాయమునిమిత్తము బంధువునికిఁగాని వంగి వంగి నమస్కారములు నక్కవైశ్యములు చేయువానిని జూచితినా నాకసహ్యము.

చండ— (ప్రక్కకు మొగముత్రిప్పి) ఇందుల రహస్యము నాకుఁ దెలిసినది. (పయికి) విజయసేనా! నావలన నాయూస మక్కఱలేదు. నేను మొదటినుండి మీకు హితురాలను గనుక, ఆచనువుచేత నీ చిక్కులసంగతి తలపెట్టినాను. ఆచనువు చేతనే, నీ స్థితిగతులను నీ పినతండ్రితో సూచించువిషయమయి యత్నించుటకు.

విజ.— నీవు మిక్కిలి మంచిదానవు. ఈ సూచనలపద్ధతికంటె నాకసహ్యకరము లేదు.

చండ— సూచనయనఁగా సంగతులన్నియు తెలియునంత స్పష్టముగా ప్రశంస చేయుట యనియే నా తాత్పర్యము.

విజ— ఎప్పటికిని జ్ఞాపకముంచుకో! నీవు తలఁచునట్లు నాకుపకారముకొఱకు నా పినతండ్రిగారితో ప్రశంసించుట మానుకొంటివా, అదియే నాకు మహోపకారము.

చండ— (ప్రక్కకు మొగముత్రిప్పి) నీకోర్కెయే జరుగఁగలదు.

విజ— అతని యొద్దనుండి నాకపేక్షలులేవు. నేనుగాని మాచెల్లెలుగాని అతని ధనము నాశింపము.

చండ— (ప్రక్కకు మొగముత్రిప్పి) నే నాశించుచున్నాను గనుక నా ప్రయత్నమును మీరు విఘటింపఁజాలరు. అతఁడు నిద్రనుండి లేచువఱకును ఈచోటు విడిచిపెట్టుటయే మంచిది. (పయికి) సుమంత్రా! కొంచెము నాతో రావోయి! పువ్వుల తోటలోకి వెళ్లుదము.

సుమం— (సంశయించుచున్నాఁడు.)

విమల— (చేయెత్తమిడి సుమంత్రునితో) రానని, ఆమెను అవమానము చేయకుండుటయే మంచిది. ఆమెచలపాది.

సుమం— (ప్రక్కకు మొగముత్రిప్పి) భయంకరమయిన ముసలికోఁతి.

చండ— ఏమోయి రావయితివి!

సుమం— ఇదిగో! వచ్చుచున్నాను.

చండ—
సుమం— } (వెళ్లుచున్నారు.)

విమల — (తెరవైపు చూచి) ఇదిగో! మన కరణము కృష్ణశర్మతాతగారు వచ్చుచున్నారు.

కృష్ణశర్మ—(ప్రవేశించి ఒక కాగితముఁ జూచుచు) ఇది దురన్యాయము! నిశ్చయముగా నిది దురన్యాయము!

విమల— కృష్ణతాతా! ఏమది.

కృష్ణ— ఇది దురన్యాయము. నిశ్చయముగా.

విజయ— ఏమయ్యా! నిన్ను పిలిచినపుడు పలుకవేమి?

కృష్ణ— నాకు లక్ష్యము లేదు! అమ్మాయి! నాకు లక్ష్యము లేదబ్బాయి! నేను బ్రతికియున్నంతకాలము నిన్ను 'అబ్బాయి' యనియే పిలుతును. నేను మీతండ్రిగారితోఁ బెరిగినాను— మిమ్ముల నిద్దఱను పుట్టకముందునుండి యెఱుఁగుదును— కనుక నిది దురన్యాయమని నిర్భయముగాఁ జెప్పుచున్నాను.

విజ— దురన్యాయమేది?

కృష్ణ— మీ చిననాయన వర్తనము.

విజ— మా చిననాయనగారా! ఆయనవట్ల గౌరవముతో మాటాడుము—

కృష్ణ— (అడ్డుకొని) అతని పరివారము విషయమయి చాలగౌరవముతో మాటాడుచున్నాను. నీచిక్కులకుతోడు అతని పిండివంటలతో నీయిల్లు గుల్లగుచున్నది.

విమల— కృష్ణతాతా! ఊరుకో! నీయజమానుని నొప్పించుచున్నావు.

కృష్ణ— అమ్మాయీ! ఆమాట నిజమే! కాని విధిలేకున్నది.

విజ— ఏమిచేయుటకు నాస్థితి చాలునని నీయభిప్రాయమడుగుటకు నిన్నిక్కడికి రమ్మనలేదు.

కృష్ణ— లేదు. నిశ్చయముగా, ఏమిచేయుటకు నీస్థితి యిపుడు చాలదో ఆసంగతి చెప్పుటకే నేను వచ్చినాను. (వ్రేళ్లతో లెక్కించుచు) మీ చిననాయన యొకఁడు- ఆయన సేవకులిద్దఱు- ముగ్గురు- వాండ్రొక్కొక్కఁడు తక్కెడేసి మ్రింగుదురు. ఆతిండి నావంటివానికి వారమునకు సరిపడును. ఇఁక గుఱ్ఱపులాయములో నొక మహానుభావుఁడు చారల బొక్కువాఁడున్నాఁడు.

విజ— ఆ చారలబొక్కు మహానుభావుఁడెవరు?

కృష్ణ— మీ చిననాయనగారి వ్యాఘ్రేశ్వరుఁడు!

విజ— ఏమీ? బ్రాహ్మణబాలుఁడా?

కృష్ణ— కాదు. క్రూరమృగబాలుఁడు. ఇంతటితో నలుగురైరి.

విజ— దానిమాట కేమిలే!

అహల్యాబాయి.

మొదటి ప్రకరణము.

మహారాష్ట్ర దేశమునకుఁ గస్తూరితిలకమువలె నలరు శ్రీ పునహానగరము భయంకర శాసనుండగు శ్రీ పేష్వా మాధవరాయని పాలనమునందుండుటచేఁ జోర కిరాతభీతి లేక తన్నగరవాసులందఱు హాయిగ గుండియలపైఁ జేతులు వైచుకొని నిద్రించుచుండిరి.

ఆహాహా! రాత్రి సకలజంతుసంతతికిని నపారనిద్రాసుఖము నొసంగు మహోపకారియయ్యు, మదనప్రేరితులకును, విచారవినమ్రులకును, పాపకర్ములకును గంటికిఁ గూర్కు రానీయక నాలుగుజాములకాలమును నపకారిణియై యుండును గద! అయినను సర్వరహస్యములను దన కడుపున నిడుకొని కన్నతల్లివలెఁ గాపాడునట్టిది రాత్రియే గనుక మరాచారులకు గాక మానధనులకుఁ గూడ నది యుపకారియగు. ఆనాటి రాత్రి నగరమంతయుఁ గాలపురుషుండు వేసిన సమ్మోహనాస్త్రముచేత బద్ధమై పరవశత్వంబు నొందెనేమో యనునట్లు తమ ప్రాణంబులఁ బరమేశ్వరునకును, నర్థంబుల రాజసేవకులకును సంరక్షణార్థము నొప్పగించి నిద్రించుచుండిరి. వేయుగన్నులతో సర్వేశ్వరుండు రక్షింపఁ దమపని యేమున్నదనియో, నియమితకార్యంబుల మఱచియో, యవిలంఘనీయమగు నిద్రాదేవి కెదురాడ నేరకయో రాజభటులుఁగూడ నెక్కడివారక్కడ నిద్రింపుచుండిరి. తమపనియం దత్యంత శ్రద్ధాళువులు కొందఱు వీథులు గస్తీ దిరుగుచు నడుమనడుమ నిద్రవచ్చినపుడు స్తంభమునకో గోడకో జేరఁబడి కునికిపాట్లుపడుచు నట్టిట్టు పనిఁ జేయుచుండిరి. నగరమునందలి దీపములన్నియు నొకటితరువాత నొకటి క్రమమున నారిపోయెను. ఆ రాత్రి యొకబాలిక దీపములు పెట్టినది మొదలు పలుమాఱులు తమ పెరటితలుపు తెరచుచు మూయుచు మాటిమాటికిఁ దన ముద్దుమొగమ్ము బాటసారుల కగపడునట్లు తొంగితొంగి చూచుచుండెను. జాము రాత్రియగుతరువాత నొకమారు గట్లు చూచి వీథిలోనికి రావలెనని గుమ్మములో నడుగిడ నిద్దఱు బాటసారు లాదారి నేగుచుండిరి. అందుచే నామె వంగున లోనికిం జని దలుపుమూసెను. మఱి రెండుసారు లట్లు గృహము వెడలిపోవఁ బ్రయత్నించుచుండ నొకమాఱు తల్లి మేల్కని యామెస్థితినిగూర్చి పరీక్షించి నామెను బండుకొనఁ జేసెను. రెండవమాఱు తన చిన్నతమ్ముఁడు నిద్రలో దుస్స్వ

ష్నముం గని యేడ్చుటచే నాతని నూరడింపవలసివచ్చెను. రెండుజాములరాత్రి యైనవెనుక ద్వారము వెడలి యా సుందరి వచ్చునప్పటికిఁ దన కెదురుగ నరుగుపై నిద్రించు రాజభటుఁడు "పోకుపోకు జాగ్రత" యని పలువరించెను. రహస్యకృత్యములఁ జేయువారు ప్రపంచమునందలి యన్నియంశములుఁ దమవిషయమే యనుకొందురు గాన నీమె యామాటలకు వెఱచి యిలువెడల సాహసింపదయ్యెను. తుదకు నీకన్య రేయియంతయు నిదురలేకయే నిష్కారణముగ శ్రమపడి యింకఁ దనకుఁ దగు సమయము లభింపదనుకొనుచుండ జాముకోడి కుక్కురోయని కూసి యామెకు మఱింత విచారమును గలిగించెను. అయినను నామె తన ప్రయత్నము మానక కడపటిసారి తలుపుందెఱచిచూడ వీధిలో నిర్మనుష్యమైయుండెను. ఇంట నందఱుఁ దెలవాఱుజామున వీచు మందమారుతములు తమ్ము జోకబట్టి గాఢనిద్రం దేలుచుండిరి. అది తగినయదనని మదినెఱిగి యాసుందరి మార్గమెఱుఁగుటకుఁ దన రెండు కన్నులందక్క తక్కిన శరీరాంగకములనెల్ల గప్పు మేలిముసుంగు ధరించుకొని గృహావరణము దాటి యావలఁబడి తనకోరిక క్రేళ్లుదాటుచుండినట్లు తనగమనంబును నతివేగమై యుండునట్లు నడిచి తను నిర్ణయించుకొనిన స్థానమునకుంజనుచుండెను. అపుడు చీఁకటి పూర్ణముగనున్నను నాకాశమను పాలవెల్లిని విలాసార్థము గట్టిన పాదరసపు బుడ్డివలె దోఁచిన వేఁగుచుక్క మినుకుమినుకుమని వెలుతురు నిచ్చుట చేతను, ధవళధవళమగు మేలిముసుఁగు తనయొడలునంటుటచేతను నామె కితరులు నితరుల కామెయు నగుపడుచుండిరి. ఇట్లు కొంతదూర మాయింతి నడచినడచి యెవ్వరో మనుష్యులు త్రోవను వచ్చుటచే గొంతతడవొక యరుగుపై గూరుచుండి మఱలఁ దన ప్రయాణము సాగింపఁ గొంత నడచి నాలుగుసందులమొగదగ్గఱఁ దన గమ్యస్థానమునకు దారి యెఱుఁగక నిలుచుండెను. అప్రుడు తనముం దిరువదియైదు సంవత్సరముల యీడుగల మనుష్యుఁడు నడచిపోవుటఁ జూచి యొంటరిగ దీర్ఘాలోచన మొనర్చుచు శిరమున వెల్లపాగయు, వెల్లదేహమునఁ దెల్లయంగరకాయుధరించి మెల్లగాఁబోవు నొక శేత్రాయఁపువానిఁ గనుంగొని చకచక వానివైపునకు నడచి చల్లగ వానివీపున జేయివేసెను. అదివఱకు నిర్మనుష్యమగు వీధినిఁబోవు నీపురుషుఁడీ చల్లని హస్తస్పర్శముచే నులికిపడి తిరిగిచూచి యెదుట మబ్బుమఱుంగున మసలు నెలఁగుతెఱంగున ముసుంగుమఱుంగున మెలంగు నంగనంజూచి యాశ్చర్యపడి యామెతో మెల్లగ "నీవెవ్వరిదానవు, నాతో నేమిపనియున్నది" అని యడిగెను. ఆమెయు మృదూక్తులతో "నా పేరెందుకు? భవానీదేవి యాలయమునకు దారి నీ వెఱిఁగినచో జెప్పుము, నేనటుకుం బోవలయును" అని ప్రత్యుత్తరమొసంగ నాతఁడు

నీయెదుట నా చెట్లచాటున నొకమేడయున్నది. ఆమేడ కావలిదే భవానీ దేవాలయము." అనిచెప్పి యట్టిసమయంబునఁ జీఁకటియని శంకింపక, దురాచారులకు వెరువక, కావలివాండ్రకు జంకక నతిసాహసముతో నొంటరిగ బయనముచేయుచున్న యామె తెగువకు నాశ్చర్యమొందుచు నామెపైఁ గన్నులు నిగుడ్చి నిలువఁబడెను. ఆమాటలు వినఁబడినతోడనే యన్నెలఁత యాదేవళమువంక నరుగుచుండెను. ఈసుందరియాలయమునం దెవ్వరినిమిత్త మేపనికై జనుచున్నదో తెలియఁగోరి మన తెరువరి యామె వెనువెంటఁదగిలి యామెచే గనుఁగొనఁబడకుండ నడచుచుండెను. ఆమె యాలయమునుజేరి మూసియున్న కవాటములు గభాలున ద్రోసి లోనికిఁ జని దేవియున్న గుడితలుపులయొద్దకుం జని నిలిచెను. గర్భగుడితలుపులు మూయఁబడి నందున నామె ముహూర్తమాత్రము యోచించి గుడియెదుట నేల సాష్టాంగ నమస్కారమొనర్చి తనమొగ మా గుడిగడపపై మోపి కొంచెముసేపు వెక్కివెక్కి యేడువసాగెను. ఈనడుమ వెంటవచ్చిన యబ్బాలుఁడు బాలికస్థితికిఁ దొంటికంటె నక్కజపడుచు నొప్పవాల్పక నామెను జూచుచు నొకమూల నామెచే లక్షితుండు గానట్లు గూరుచుండెను. ఊరడించువారు లేనందున దుఃఖము వెంటనే యుపశమిల్లెను. బాలిక తేలికయగు హృదయముతో నచ్చటినుండి యిట్లనెను. "అమ్మా భవానీ! జగన్మాతా!! తండ్రిలేనిబిడ్డను నన్నిటు జేయుట నీకు ధర్మమా! ఇపుడు నామనస్సున కిష్టములేని యీకార్యము జేయుటకంటె నన్ను జంపివేయరాదా! ఈకార్యమునుండి తొలంగుమని మాయమ్మకు నేల దోఁచునట్లు జేయవు? తల్లీ నామనోరథము నెరవేరదేని నాకు విషమేగతి. ఆమాట నీకే దక్కఁగలదు. నా సాహసము నీవెఱుఁగనిదికాదుగదా" యని పరిపరివిధముల నమ్మహాదేవినిఁ బ్రార్థించి తెల్లవాఱుచుండుటచేఁ దన్నెవ్వరైనఁ గన్గొందురేమో యని మఱల గృహమునకుఁ దనవారు మేల్కొనకమున్న నరుగఁదలఁచి లేచెను. లేచుచుండఁగా "నీ మనోరథము నెరవేఱును భయపడకుము" అని యొక యమానుషవచన మామెచెవులకు వినవచ్చినట్లయ్యెను. అందుచే సఫలీకృత మనోరథనయ్యెదనని యామె సంపూర్ణోత్సాహము గలిగి గుడివెడలి పదిబారలు వచ్చునప్పటికి నావఱకాలయమున నక్కిన యక్కుమారుఁడు సుందరిం గలసికొనివచ్చుట కారంభించెను. తన రహస్యముల నాతఁ డాలకించెనేమొ యని యామె దిగులుగొని యాతని నసూయతోఁ జూచుచు నడువ నా వయసుకాఁడు పరవశుఁడై యామె హస్తముం బట్టుకొని "సౌందర్యమంతయు సంపూర్ణముగ నీసొమ్మైనది. ఇంక నేమివరములకై దేవినిఁ బ్రార్థించుచున్నావు? నావంటివానిపై దయయుంచుము" అని యాచేయి ముద్దుఁబెట్టికొన

యత్నించుచుండ నామె సహజముగ బలముఁగలదగుటచే సహజలక్షణమగు నధైర్యమును విడిచి చేయి విడలించుకొని కనులెఱ్ఱఁజేసి కోపముతో నాతనిఁ గసరఁబోయెను. కాని యాతఁ డామెను మఱలఁబట్టుకొని "నాతోరా, నీవెక్కడి కరుగఁగలవురా!" అని లాగఁదొడఁగెను. పడుచుకన్నియయగు తాను నిశాసమయమున నొంటరిగా వచ్చినందుకు విచారించి, విచారించినఁ గార్యము లేదని యరక్షితరక్షణియగు నాభవానీమాతం దలంచి హా! జగన్మాతా యని గద్గదస్వరముతో నఱచెను. ఆయఱపు గుడి యరుగుపై నిద్రించుచు నప్పుడే మేలఁకువగాంచిన యొక సన్యాసి విని "దురాత్మా యెవఁడవురా నీవు" అని దగ్గఱకువచ్చెను. వెంటనే యాదురాత్ముఁడు పిక్కబలముఁ జూపి యదృశ్యుఁడయ్యెను. సన్యాసి యామె నూరార్చి యిట్లొంటరిగా రాఁగూడదని చెప్పి యింటిదనుక సాయముఁజనియెను. ఆమె యిల్లుచేరి తనవారెఱుఁగకుండ మెల్లన మంచముపైఁ బవ్వళించెను.

రెండవ ప్రకరణము.

హొల్కారు రాజ్యమునకు రాజధానియగు నిందూరునగరమునకు నేడుక్రోసుల దూరమున, మహాభూయను పట్టణము కలదు. నిత్యకళ్యాణప్రదమగు పచ్చని యడవి నడుమ నా పురముండుటచే నుద్యానవనమందలి మేడలాగు ముద్దులు మూటగట్టుచు నుండుటయెగాక వ్యాధిగ్రస్తులకు నిరామయత నొసంగు నారోగ్యస్థానమై యలరుచుండును. దానికి మూఁడుక్రోసులదూరమున వింధ్యపర్వత సంబంధములగు కొండలచే నావరింపఁబడి యొక గూడెము కోటనడుమనున్న పల్లెవలె సురక్షితమై యుండును. ఆపల్లె కులవృత్తివలన జీవించు గొల్లలకు నివాసస్థానమై వారికిఁ గామిత సౌఖ్యప్రదాయినియై యుండును. ఆగొల్లలచే భగవదవతారమని పూజింపఁబడుచు మహానగరవాసులచే నాగతానాగతవేదియగు మహర్షియని యెన్నఁబడు నొక వృద్ధుఁడుండును. ముడతలుపడిన మొగమును యాకులన్నియుఁబండి రాలినవెనుక మోడగు చెట్టువలె నున్నదై వెండ్రుకలు లేకయున్న శిరస్సును, నాతఁడు కాలము దీరినవాఁడని వేనోళ్లఁ జాటుచున్నను నాతని యద్భుతదార్ఢ్యమును, దంతపటిమయుఁ జెవుడు రామియు, గమనవేగమును నతఁడంత యీడుగలవాఁడా యని సందియము గొలుపును. రాత్రులు కొంచెము రేచీఁకటితప్ప నేత్రరోగముగూడ పగటివేళల నెద్దియు లేదు. కనులయెదుట బంధుగణమెల్ల నశించుటయుఁ దనకుఁ జిరాయువు గలుగుటయుఁ జూచి యావృద్ధుఁడు తనను పెట్లు గడచునని చింతించుటప్పుడప్పుడు కలదుగాని మూఢభక్తిగల గొల్లలు మహానుభావుఁడని వాని కఖిలోపచారములు

చేయుచుండుగా. దిక్కులేనివారికి దేవుఁడే దిక్కునైనఁ జూపునుగదా! గొల్లలందఱు మహర్షులు వసియింపఁదగు పర్ణశాలవలె నొక కుటీరమును నిర్మించి యందాతని నుంచిరి. శతవత్సరపూర్ణుఁడైనను మనోబలము చెడనివాఁడగుటచే రాజకార్యముల యందుఁగూడ నతని యాలోచన మమోఘము. పూర్వకాలపు సంగతుల నెఱుఁగఁ గోరినవారును, క్రొత్తపనులఁ దలపెట్టి యవి నెరవేరునో లేదో యను సందేహము గలవారును నీవృద్ధునడిగి వాని యిచ్ఛాప్రకారము వర్తింతురు. ఒకనాఁడు సాయంకాలమున గడియరాత్రియైనతరువాత నొక పడుచువాఁడు సత్యఋషియని ప్రసిద్ధికెక్కిన వృద్ధునియొద్దకుఁ బాదచారియై వచ్చుచుండెను. వంపులుతిరిగి తుమ్మెదరెక్కలతో నెక్కసక్కెము సేయు మీసముల సౌరును, వెడఁదనుదురు సోయగమును, చెవుల స్పృశించు కొనలుగల కనులతీరును చక్కనివారిలోఁ జక్కనివాఁడని యతనికి బిరుదునామము గలుగుటకుఁ గారణములయ్యెను. యౌవనమంగసౌష్ఠవమును బరిపూర్ణముసేయ విద్య, గుణసౌష్ఠవమును పూర్ణముచేసెను. చిన్ననాటనుండియు సాముకసరతులు చేయుటచే దండలుతిరిగిన భుజములును, విశాలవక్షమును, మూర్తిని స్తోత్రపాత్రములుగఁ జేసినట్టులె విద్యవలనఁ గలిగిన శాంతమును, సువర్తనయుఁ గీర్తిని సుజనస్తోత్రపాత్రముగఁ జేసెను. బలమునకుఁ గార్యములయందలి చలము వానికివన్నె దెచ్చును. చుట్టుజరీగల యెఱ్ఱపట్టుతలపాగయు, పచ్చపట్టు అంగరకాయు, తెల్లని మడుపుదోవతియు, వలెవాటుగనిడ్డ యుత్తరీయమును వాని యలంకారమును సమాప్తముచేసెను. ఆ వన్నెకాఁడు సత్యఋషి కుటీరమును బ్రాపించి తలుపుఁద్రోసి ప్రత్యుత్తరము రానందున నచట నిలువంబడియుండెను. వృద్ధుఁడు లోన నెవరితోడనో గుసగుసలాడుచున్నట్లు శబ్దము వినవచ్చెను. ఆమాటలు వినఁబడకమున్నే శ్యామసుందరదత్తు మరల తలుపుఁద్రోయుటచే ఋషి తననిమిత్త మెవరో వచ్చినారని లోపలనున్న మనుష్యుని వెడలిపొమ్మని యానతిచ్చి తలుపుఁదీసెను. అంతట వృద్ధుఁడు శ్యామసుందరుని రమ్మని పిలువ నాతఁడు కుటీరము వెడలి ముసుఁగువేసికొని జనుచున్న యతిదీర్ఘకాయుని, మహాసత్త్వునిఁ దేరిపారిచూచుచు వెంటనే లోనికిం జనఁడయ్యెను. ఆ పురుషుఁ డెవఁడై యుండునని యోచించుచు శ్యామసుందరుఁడు లోనికిఁజని లెక్కకుమించిన చిరుగులతో నేలవేయఁబడియున్న ప్రాతకంబళముపై వృద్ధుఁడొసంగిన యాతిథ్యమునకు సంతసించి కూర్చుండెను. కూర్చుండినతరువాత వారొకరితో నొకరిట్లు మాట్లాడిరి.

ఋషి— నాయనా నీవెవ్వరిచే నంపఁబడి నానిమిత్తము వచ్చినావు! నీపేరు శ్యామసుందరదత్తు కాదా?

శ్యామ— ఔను. రాధాకాంతరావుగారు తమదర్శనము చేసి యాయన తమతో మొన్న మనవిచేసిన యంశమునుగూర్చి తమ రాలోచించిరేమో యని తెలిసికొని రమ్మనిరి.

ఋషి— (తలయూచి) ఆఁ, నేనావిషయమై యోచించినాను. తుదనెగ్గుట కష్టసాధ్యము.

శ్యామ— కష్టమునకునేమి? వారిధనముఁదినుచు మేము వారిపక్షమునఁ గష్టపడుదుము. శ్రమకేమియు సంశయింపము.

ఋషి— మీరెంత కృతజ్ఞతతోఁ బనిచేసినను నామె స్త్రీకదా, పురుషులమై కక్షవహించి తుదనెగ్గుట యసాధ్యము. నేనిట్టి వెన్నిచూచినాను? ఆమె జస్వంతరావు చెప్పినట్లు వినుటమంచిది.

అని, యాతఁడు తన యభిప్రాయమెఱిఁగింప దత్తునకు ముఖవికాసము రవ్వంత మందమగుటఁ గనిపెట్టి ఋషి యాతనికి ధైర్యముగలుగునట్లు మరల "అయినను దైవము మనపక్షమున నున్నాఁడు. హోల్కారువంశమును మొదటి నుండియు నెఱిఁగిన నేను, మన రాణి గెలుచునట్లు నా యాశీర్వచన మొసంగెద" నని హెచ్చరించెను.

శ్యామ— అయ్యా! మీరు రాణిగారి పూర్వుల నెఱుఁగుదురా? మీవయసెంత?

ఋషి— నావయసెంతయున్నదో నేనెఱుఁగను. సంగతులనుబట్టి తెలిసికొనుము.

శ్యామ— మీరు శివాజీ మహారాజు నెఱుఁగుదురా?

ఋషి— సరిసరి. నాకర్మముకాల నేను శివాజీ నెఱుఁగకపోవలెనా? అతఁడు మృతినొందినప్పటికి నేను పండ్రెండేండ్లవాఁడను.

శ్యామ— శంభాజీ, సాహుమహారాజులను జక్కఁగా నెఱుఁగుదురని నే దలంచుచున్నాను.

ఋషి— బాగున్నది. సాహు మొన్నటివాఁడు కాదటయ్యా? నాకనుల ముందటఁ బుట్టి, నాకనులముందట మృతినొందినవాఁడు.

శ్యామ— ఔరంగజేబును మీరు స్వయముగా నెన్నఁడైనఁ జూచినారా?

ఋషి— అలంఘురును జూచినారా యని యడుగుచున్నావా? అలంఘురు సేనలతో యుద్ధముచేసినవారెవరు నేనుకానా?

శ్యామ— పీష్వాబాలాజీ విశ్వనాథులఁగూర్చి మిమ్ముడుగ నక్కఱయే లేదు. వారందఱు మీకు లెక్కలేదు.

ఋషి— నిన్నటివాండ్రసంగతి నన్నడిగెదవేమి? పూర్వాంశముల నేమైన

నడుగవలసినయెడల నడుగుము.

శ్యామ — మల్హారురావు హోల్కారుగారి బాల్యము మీరు చక్కఁగ నెఱుఁగుదురు కాఁబోలు.

ఋషి— మల్హారురావు గారు, ఆయన తండ్రియు నేనును మిగుల స్నేహితులము.

శ్యామ — అట్లయిన నూఱు సంవత్సరముల యీమధ్య మీ రెఱుఁగని యంశములు లేవు. మీరు జాంబవంతునికన్న నేమాత్రమో కొంచెము పెద్దగా గనుపించుచున్నారు.

ఋషి—ఎన్నియెఱిగిన నేమి? ఎంతవయస్సున్న నేమి? ఈమెకు సహాయము నర్పఁగలిగితి నేని నాజన్మము ధన్యతఁ గాంచును. కృతజ్ఞులామెచుట్టును లేరుగనుక యామె నిరపాయమైన స్థితిలో లేదు.

శ్యామ— (తొందరతో) ఎవరు కృతజ్ఞులుగారు?

ఋషి—ఎవరును గారు. రానోజీ, దౌలతురావు, గోమాజీ దక్కఁ దక్కినవారెవ్వరును గృతజ్ఞులుగారు. రాధాకాంతరావుగూడ మంచివాఁడని చెప్పవచ్చును.

రాధాకాంతరావు విషయములో ఋషి పలికిన సందిగ్ధవచనములు శ్యామసుందరుని మనసునకుఁ గొంత వ్యాకులపాటుఁ గలిగింప నదివఱకు తాను కన్నులారఁ జూచుచుండినదానికి, నేఁడు చెవులార విన్నదానికిఁ గల వ్యత్యాసమునకుఁ గారణమూహించుచుండెను. మార్పుఁ జెందినవాని ముఖవైఖరి నవలోకించి, ఋషి యేమో మరలఁ బలుకఁ బ్రయత్నించుచుండ దన పెదవులఁ గదుపుచుండ నంతలో కుటీరపు వాకిట. "అయ్యో! అయ్యో! నిష్కారణ మిద్దఱును జచ్చిపోవుచున్నారు. రక్షింపుఁడు రక్షింపుఁడు. కటకటా! ఆడుదిగూడ దారుణముగ వధపాలగుచున్నది. రండిరండి." అని యెవ్వఁడో యంగలార్చుచుఁ బరువెత్తసాగెను. కరుణార్ద్రహృదయుఁడగు శ్యామసుందరుఁడు యోగితో సంభాషణము మాని యోగియింటి గోడపైనున్న చిలుకకొయ్యకుఁ దగిల్పఁబడిన విల్లును నమ్ములం గొని మొలలోనున్న చిన్న కైజారు నూడఁబెఱికి యాస్థలమువంకఁ జనెను. ఋషి యార్తనాదముసేయు నాపురుషునిఁ బిలిచి యాపదఁ బొందినవా రెవ్వరని యడిగెనుగాని వాఁడు పేరుఁ జెప్పకయే దత్తును వెంబడింపఁబోయెను. అప్పుడు ఋషి తనలో "ఈదినముననో రేపో యాతఁడు వచ్చునని తెలిసినది. ఈ యదృష్టహీనుఁడు వాఁడై యుండఁడుగద" యని వితర్కించుకొని యేమియుం దోఁచక యిటునటుఁ దిరుగులాడుచు నెందుచేతను యాస్థానమునకుమాత్రము మరుగక తామరాకులోని నీరుతీరున తటతట పరితపించుచుండెను.

మూడవ ప్రకరణము.

రానోజీ పల్హారున కప్పటికి పదునాఱు సంవత్సరములకంటె నొకటి రెండెక్కువ యుండునే కాని తక్కువ లేవు. చిన్నతనమందు మలహారురావు హోల్కారునకుఁ దమలపాకుల చుట్టలను, దుస్తులను నందించు నీచసేవకకోటిలో నివాఁడై యాప్రభువ ననుగ్రహమునకుఁ బాత్రుఁడై సైన్యమున నొక సరదారయ్యెను. తెలివితేటలుగల మహారాష్ట్రుఁ డగుటచే నతిత్వరితముగ రాజ్యమునందున్న ముఖ్యోద్యోగస్థులలో నొకఁడై మలహారురావు చనిపోవునప్పటికి ప్రధానవర్గములో నొకఁడయ్యెను. ఈతఁడు సత్కులీనుఁడును, సదాచారుఁడును గాకుండినను మిగుల ప్రజ్ఞఁగలవాఁడు. అందు యుక్తులకుఁ బెట్టినది పేరు. మోసమున నితని జెప్పి మఱియొకరినిఁ జెప్పవలయును. అతఁడు సౌందర్యము లేని నల్లని మోటమనుష్యుఁడని చెప్పుటకంటె వాని యాకారము వర్ణింపనక్కఱలేదు. ప్రథమకళత్రము వియోగమొందుటచే మఱల వివాహమాడఁ బ్రయత్నించి తన ప్రియమిత్రుఁడగు హరిహరపాండ్యాజీ సహాయమున సౌందర్యశాలి యగు నొకకన్యం జేకొని మఱికొన్ని రాజకార్యవిషయములగు నుత్తరములు సంగ్రహించుకొని యిండూరునగరమునకు వచ్చుచుండె. ఆరాత్రి యెట్లయిన మహూపురముఁ జేరవలయునని నిశ్చయించి ప్రొద్దుపోయిన వెనుకఁగూడఁ బయనమొనర్చుచుఁ దాము వచ్చునప్పటికి వంటకములఁ జేయించి సిద్ధముగనుండుమని దుండిరావునంపెను. పల్లకియందుఁ బదునెనిమిదివత్సరముల వయసుగల సుందరియొర్తు గూర్చుండి తలుపులించుక తెఱచి చుట్టునున్న కొండలను, మహావృక్షములను, నిష్కలుషమైన యాకాశమునుఁ జూచుచుండెను. ఓంకారనాదములతో బోయలు పల్లకిమోయుచుఁ దనవెంట రాఁగ రానోజీ పల్హారు గడియగడియకు సకిలించుచు నలసి మోయలేక దన్ను మోయుచున్న గుఱ్ఱము నెక్కి యిరుప్రక్కల నిరువు రాయుధపాణులగు భటులు గొల్వఁ బడలికతోఁ బయనమొనర్చుచుండెను. మార్గశ్రమచేఁ జెన్నుచెదరి విసికియున్న యాసుదతి పల్లకికిసరిగా మధ్యమధ్య నొకమాఱు తన గుఱ్ఱమును నడిపించుచు "కమలా నీవు మిగుల శ్రమపడినట్లున్నావు. వచ్చినంతదూరము రానక్కఱలేదు. కావలసినయెడల నాదగ్గఱనున్న రొట్టెలు నాల్గు తినుము" అని యూరార్పుమాటలు పలుకుచు వడిగ నడుగులు వేయుమని బోయలను హెచ్చరించుచు రానోజీ రెండుగడియల రాత్రికి ఋషి వసించు ప్రదేశమునకు సమీపముగ వచ్చెను. అది కృష్ణపక్షమున కారంభమగుటచే నా పాడ్యమినాఁడు చంద్రోదయము రెండుగడియలకగుచుండెను. తూర్పునఁ దెల్లనివ్వాలువఁబఱచినట్లు రేఖలు గానఁబడెను.

మూడవ ప్రకరణము.

రానోజీ పల్కారున కప్పటికి ఏబదిసంవత్సరములకంటె నొకటిరెండెక్కువ యుండునే కాని తక్కువ లేవు. చిన్నతనమందు మలహారురావు హొల్కారునకుఁ దమలపాకుల చుట్టలను, దుస్తులను నందించు నీచసేవకకోటిలో నివాఁడై యా ప్రభువు ననుగ్రహమునకుఁ బాత్రుఁడై సైన్యమున నొక సరదారయ్యెను. తెలివితేటలుగల మహారాష్ట్రుఁ డగుటచే నతిత్వరితముగ రాజ్యమునందున్న ముఖ్యోద్యోగస్థులలో నొకఁడై మలహారురావు చనిపోవునప్పటికి ప్రధానవర్గములో నొకఁడయ్యెను. ఈతఁడు సత్కులీనుఁడును, సదాచారుఁడును గాకుండినను మిగుల ప్రజ్ఞఁగలవాఁడు. అందు యుక్తులకుఁ బెట్టినది పేరు. మోసమున నితని జెప్పి మఱియొకరినిఁ జెప్పవలయును. అతఁడు సౌందర్యము లేని నల్లని మోటమనుష్యుఁడని చెప్పుటకంటె వాని యాకారము వర్ణింపనక్కఱలేదు. ప్రథమకళత్రము వియోగమొందుటచే మఱల వివాహమాడఁ బ్రయత్నించి తన ప్రియమిత్రుఁడగు హరిహరపాండ్యాజీ సహాయమున సౌందర్యశాలి యగు నొకకన్యం జేకొని మఱికొన్ని రాజకార్యవిషయములగు నుత్తరములు సంగ్రహించుకొని యిందూరునగరమునకు వచ్చుచుండె. ఆరాత్రి యెట్లయిన మహూపురముఁ జేరవలయునని నిశ్చయించి ప్రొద్దుపోయినవెనుకఁగూడఁ బయనమొనర్చుచుఁ దాము వచ్చునప్పటికి వంటకములఁ జేయించి సిద్ధముగనుండుమని దుండిరావునంపెను. పల్లకియందుఁ బదునెనిమిదివత్సరముల వయసుగల సుందరియోర్తు గూర్చుండి తలుపులించుక తెఱచి చుట్టునున్న కొండలను, మహావృక్షములను, నిష్కలుషమైన యాకాశమునుఁ జూచుచుండెను. ఓంకారనాదములతో బోయలు పల్లకిమోయుచుఁ దనవెంట రాగ రానోజీ పల్కారు గడియగడియకు సకిలించుచు నలసి మోయలేక దన్ను మోయుచున్న గుఱ్ఱము నెక్కి యిరుప్రక్కల నిరువురాయుధపాణులగు భటులు గొల్వఁ బడలికతోఁ బయనమొనర్చుచుండెను. మార్గశ్రమచేఁ జెన్నుచెదరి విసికియున్న యా సుదతి పల్లకికిసరిగా మధ్యమధ్య నొకమాఱు తన గుఱ్ఱమును నడిపించుచు ““కమలా! నీవు మిగుల శ్రమపడినట్లున్నావు. వచ్చినంతదూరము రానక్కఱలేదు. కావలసినయెడల నాదగ్గఱనున్న రొట్టెలు నాల్గు తినుము” అని యూరార్పుమాటలు పలుకుచు వడిగ నడుగులు వేయుమని బోయలను హెచ్చరించుచు రానోజీ రెండుగడియల రాత్రికి ఋషి వసియించు ప్రదేశమునకు సమీపముగ వచ్చెను. అది కృష్ణపక్షమున కారంభమగుటచే నా పాడ్యమినాఁడు చంద్రోదయము రెండుగడియల కగుచుండెను. తూర్పునఁ దెల్లదువ్వలువఁబఱచినట్లు రేఖలు గానఁబడెను.

అట్లు పయనము చేయు నామనుష్యులయెదుట చెవులు బ్రద్దలగునట్లు మోరయెత్తి ఘుణిల్లు ఘుణిల్లుమని అంకెవేయుచు నొక వృషభము కాలిడెక్కతో నేలదువ్వి దుమ్ము వ్యాపింపఁజేయుచు భయంకరాకారముతో దారికడ్డముగ నిలిచియుండెను. మార్గము నుండి యాయెద్దు ముద్దువలెఁ దొలఁగనందునఁ దాము పోవుటకు నెద్దును బెదరింపుమని రాణోజీ తన సేవకులలో నొకని నాజ్ఞాపించెను. మందబుద్ధియు మోట చొరవయుఁగల నాసేవకుఁడు ద్విపాదపశువుగనుక నాపశువును బెదరఁగొట్టుట కుపాయమేదియులేక దనపైనున్న యెఱ్ఱగుడ్డవిప్పి హూత్తుహూత్తని యాగుడ్డ దానిపై వేయఁ బోయెను. ఆ పశువటివఱకొక కారుదున్నపోతుతోఁ బోరాడి దానిచే గాయములు తగుల నొచ్చి కడుఁగోపముతో నుండెను. అంతలో గుఱ్ఱమొకసారి సకిలించెను. బోయ లోంకారమెక్కువచేసిరి. ఎఱ్ఱగుడ్డఁ జూచుటచే బెదరి, బోయల యోంకారముచేఁ గలవలపడి, గుఱ్ఱపు సకిలింపుల సహింపనోపక నాలపోతు మార్గస్థుల గుండెలు వ్రక్కలగునట్లు అంకెవేసి గుబాలున వారిపైఁబడెను. దీనికంతకుఁ గారణుఁడైన మూర్ఖ సేవకుఁడు దాని బారినుండి తప్పించుకొని యావలఁబడెను. ఆమనుష్యునివెనుకనే వచ్చుచున్న రాణోజీపై నాజంతువు పడి ముసుముందు నడువలేక సగముచచ్చిన యశ్వముపైఁబడి దానిని నేలఁగూలఁద్రోయ వాహనముతోఁగూడ నాతఁడును నేలఁ గూలెను. కూలినతోడనె నాతఁడు లేవఁ బ్రయత్నించుచుండు నంతలో గుఱ్ఱముమీఁద నుండి యాతనిమీఁదికి దుమికి యప్పాపపుఁ బశువు దేహమెఱుఁగక సూదిమొనలవలె వాడిగనున్న కొమ్ములతో నాతని గుండెలమీఁదను, డొక్కలోను, నెమరకణతమీఁదను దన యిచ్చవచ్చినట్లు గాయములుచేసి వెడలు క్రొన్నెత్తురుతోఁ దనకొమ్ముల నలంకరించెను. సేవకు లిరువురును భయకంపితులై నాయుధములు తమంతటఁ దామె వారిచేతులనుండి నేలజార వెనుక దిరిగిచూడక పరువెత్తిరి. బోయలు మోయుపల్లకి నచ్చటవిడిచి చెల్లాచెదరై నలుదెసలకుఁ బరుగెత్తిరి. ఒకనిముషమున నచ్చట క్రింద పడిన నాయకుఁడును, పల్లకిలోనున్న సుందరియుం దక్క నెవ్వరు లేరైరి. పారిపోయిన సేవకులలో నొకఁడు తన స్వామిపై జాలిగల్గి ఋషికుటీరము దగ్గఱకు వచ్చి యా ఘోరవార్త నచటివారికిఁ దెలుపుటయు శ్యామసుందరదత్తు సహాయార్థము బయలు దేఱుటయు మీరందఱు నెరుగుదురుగదా. శ్యామసుందరుఁడు కడువేగమున నడచి

౯. ఈలోన నాస్త్రీ, పడియున్న రాణోజీని, దన యసహాయస్థితినిఁ జూచి కదలి పోవుటకు సంగసులాడక కొయ్యయయ్యెను. బోయలు పల్లకి దింపుటయు జీపై నెద్దుపడుటయు నామె యెఱుఁగును కాని తఱువాత నేమి జరిగెనో యా గదు. పండుకొన్న దేహము పండుకొన్నట్లె యుండెను. చూచెడు కనులు ట్లుండెను. ఇట్లామె మహాభీతితో నుండ నాయెద్దు కోపాగ్ని చల్లారక పోవుటచేఁ

గాఁబోలు చంగున నాపల్లకిమీఁదఁబడి కొమ్ములతో గుభిల్లు గుభిల్లుమని యాపల్లకిం బొడుచుచు తన మహాబలముచే దాని నడ్డముగాఁ బడఁద్రోసి దానిపై నెక్కి తన్ని పగులఁగొట్టుచుండెను. ఆ నారీమణి స్మారకము లేక మొదటమాత్ర మొక కేక వేసి మూర్ఛిల్లి యందు బడియుండెను. అంతలో దత్తు తత్తరపాటునవచ్చి. యనతిదూరమున నామె కేకవిని యతి త్వరితమునవచ్చి మన స్థిమితమునుఁ జిక్కఁబట్టి విల్లుపయోగింప నెంచి యసమానప్రజ్ఞగల మహారాష్ట్రుఁ డగుటచే వరుసగా రెండు బాణముల దాని మొగమున నాటనేసెను. వెంటనే యది రోసముచే పైఁబడ నుంకింప నతఁడు మఱి రెండు బాణములను రెండుకన్నులమీఁదఁ గీలింప నది యంబాయని నేలఁబడెను. వెంటనే యా సేవకుఁడువచ్చి తన కత్తితో దానిని నఱికి తన యసహాయశూరతఁ జూపెను. అపుడు దత్తు పల్లకి యథాప్రకారముగఁ బట్టించి తలుపులఁ దెఱచి యందు మాటలాడనేరని పోతపసిండిబొమ్మయై, నిలుకడఁగన్న మెఱుపుఁ దీగయై, మన్మథ రాజ్యలక్ష్మియై, పడుచువాండ్ర బాధించు హృదయశల్యమై నిశ్చేష్టురాలగు నయ్యతివం జూచి యామెను రమ్మని పిలువ నామె పలుకదయ్యె. ఆమెను లేవఁదీయుటకుఁ దనకు సహాయము చేయుమని సేవకు నడుగ వాఁడు "నిద్రపోయెడుదానిని లేపెదరేమి? ఆమెనుఁ బండుకొననిమ్ము. నీవిటురా" అని మందలించెను. కొంచెము చల్లనినీరు తెమ్మని సేవకునంపి తానే యమ్మగువను సందిటఁబట్టి పల్లకినుండి లేవఁదీసి యొక చెట్టుమొదట పైబట్టపఱచి క్రాసున కామె మేనుజేఱునట్లు కూరుచుండఁబెట్టి పడకుండ నామెనుఁ దానుగూడఁబట్టుకొనియుండెను. ఆమె జీవచ్ఛవమై మాటయు, కదలికయు లేక యెటులుంచిన నటులుండెను. మేనెల్లఁ జిఱుచెమ్మటలు గ్రమ్మి కణములుగా బరిణమించి మొగమున ముత్యాలువెట్టినట్లు వింతవిన్నాణము నొసంగెను. విలాసార్థ మామెకొప్పున గ్రుచ్చిన మల్లెపుష్పములు నలుదెసల జాఱి యామెవలె పసివాడి యుండెను. వట్రువలై పెద్దవగు పిఱుందుల స్పృశియించు నిడుదవెండ్రుకలు మొగమ్ము నంతయు గ్రమ్మునట్లు చీకాకుపడుటచే నామె వదనము ధూమచ్ఛాయతోఁగూడు గ్రహణకాలచంద్రునివలె నుండెను. చెమ్మటలచేఁ గరఁగి మొగమంతయు వ్యాపించిన కుంకుమబొట్టు ముఖారవిందమున కొక్క యారుణ్యమును దెచ్చి సంధ్యారాగములో నున్న చంద్రమండలములాగు మొగమునకు వన్నెవెట్టెను. బెదరిన లేడికన్నులవలె చలించు నేత్రములును, భయమున వడఁకు గాత్రమును, నందకత్తియల గరువమ ణఁచియు, దొండపండునకు బంధువగు మోవియు నామె యందమునకు వింత య నీయ నెడలెరుంగని స్థితియందుండియు నామె మోహినీదేవివలె నుండెను. రాంగు లెట్టి యవస్థలోనున్నను స్తోత్రపాత్రలె కద! శ్యామసుందరదత్తు కమల మొగమువంక కోరికలూర కనుల కఱవుదీఱ నూహ లెంతదూరమోపార ప

తెప్పవాల్చకచూచి యామెకు సముచితోపచారములఁ జేసెను. ఇంతలో సేవకుఁడు నీరుదెచ్చుటయు, చల్లని యాజల మామెమొగమునఁగొట్టి నామె కొంత సేదదేఱి కొంచెము నీరుద్రావి మఱల సొమ్మసిలి తిరిగి కొంత యుదకముఁద్రోలి కనువిచ్చెను. కనువిచ్చి యాసుందరి భువనసుందర విగ్రహుఁడగు శ్యామసుందరుఁ గనుఁగొని సిగ్గునఁ దలవంచి పరపురుషునియెదుటఁ గూరుచుండుట కిష్టములేక మెల్లఁగాలేచి యావలకుఁ జరిగి క్రిందపడిచిన యుత్తరీయము మేలిముసుఁగుగా వేసికొని, యాతఁ డెవఁడా యని యాలోచించుచుఁ బ్రభు వెట్లుండెనని సేవకునడిగెను. ఈనడుమ శ్యామసుందరుఁడు రాణోజీయొద్దకుఁ బోయి శరీరమునిండ గాయములఁ జూచి యాతఁడు జీవించుట యసాధ్యమని యెంచియుఁ దగుచికిత్స చేయఁదలఁచి మెల్లఁగఁ దానును సేవకుఁడును వానినెత్తి పల్లకిలో పరుండఁబెట్టిరి. అప్పుడు రాణోజీ "నాభార్య నాభార్య" యని మెల్లగాననఁ "నీభార్యసురక్షితముగనున్నది భయములేద"ని దత్తు ప్రత్యుత్తరమొసంగి రెండుగుడ్డలు మసిచేసి యా గాయములకుఁ గట్టుకట్టెను. ఆ రెండు మాటలు గాక నెన్నిసారులు పిలిచినను రాణోజీ పలుకక తనలో తాను పలుమాఱు పలువరింపఁదొడంగెను. సేవకునివలనఁ దనప్రభు వింకను సురక్షితుఁడని యెఱిఁగి కమలాభాయి "ఇంకను జీవించియున్నాఁడా, దైవమునకు నాపై నింత కోపమేల నాకు సుగతి యెట్లగును. ఎద్దు నాకు పూర్వముగ నుపకారము చేయలేదు. నన్ను జంపినను మేలుగానుండును." అని తనలో విచారించెను. ఇంతలో బోయలు తిరిగివచ్చుటచే రాణోజీని పల్లకిలో మోయించి గూడెమునుండి బండి తెప్పించి కమల నందుఁ గూర్చుండబెట్టి వారి నందఱిని మహూనగరమునకు శ్యామసుందరదత్తు తీసికొని పోయెను.

నాల్గవ ప్రకరణము.

మహూగ్రామమున మురళీధరదాసను నొక మనుష్యుఁడు సుందరియు గుణవతియునగు నానందభాయియను భార్యతోఁ గాపురముఁ జేయుచుండెను. అతఁడు పిల్లలుగలవాఁడును బీదవాఁడునైనను గొంచెము వ్రాఁతనేర్చినవాఁడగుటచే హజారుమల్లను మారువాడీ వర్తకునియొద్ద లెక్కలువ్రాయుచు స్వల్పజీతమును గ్రహించుచు మిగుల గౌరవముఁగలిగి కాలక్షేపము సేయును. ఆనందభాయి యిప్పటికి ముప్పదివత్సరములు వయస్సుగలదై మగనికంటె మూఁడుసంవత్సరములు చిన్నదైయుండెను. మురళీధరదాసు పొడుగుగ నుండును గాని బక్కపలుచని పసిఁడివన్నెగల శరీరముతో నందగాఁడని పేరొందినవాఁడే. రమారమి జాము రాత్రి యగునప్పటికి శరీరమెఱుఁగక

పడియున్న రాణోజీని, దిక్కులేక భయవివశురాలైన కమలాభాయిని వెంటఁబెట్టుకొని శ్యామసుందరదత్తు మహూనగరముఁ బ్రవేశించి మురళీధరదాసు గృహమునకు రమ్మని బోయల కానతిచ్చి తాను ముందుగా నాగృహమువైపు జనెను. భోజనముచేసి భాగవతము చదువుకొనుచున్న మురళీధరునియెదుట శ్యామసుందరుఁడు నిలువ నతఁడమితానందమునొంది భార్యను బిలిచి "మన దత్తువచ్చినాఁడు. మన దత్తు" అని యఱచెను. ఆనందభాయి చాలకాలముక్రిందటఁ జూచుటచే దత్తును జేరరమ్మని "ఏమి నాయనా యింతకాలము జాగుచేసినావు" అని తలపైఁ జేయివేసి నిమిరెను. "అక్కయ్యా! నారాకకేమిగాని శ్రీరాణీ యహల్యాభాయిగారి కొలువులో గొప్ప యుద్యోగియగు రాణోజీ, చచ్చుటకు సిద్ధముగనున్నాఁడు. అతనితో భార్యకూడ వచ్చినది. వారివిషయమై మన మతిజాగ్రత పుచ్చుకొనవలెను." అని జరిగిన వృత్తాంతము నంతయుఁ దన బావకును సోదరికినిఁ దెలియపరచెను. అంతలో మన కమల యెక్కిన బండియుఁ బల్లకియు వచ్చినందున నిస్పృహుఁడగు రాణోజీని మెల్లమెల్లఁగఁ జేతుల మీఁద వేసికొని లోపలికిఁ దెచ్చి యొక గదిలో నొక పరుపుమీఁదఁ బండుకొనబెట్టిరి. పాపము రాణోజీ మూల్గుటయేగాని బాధ యిదియని చెప్పనేరక పిలిచినఁ బలుకక ప్రక్కపైఁ గొట్టుకొనసాగెను. వారారాత్రి యొక్క ప్రాణవైద్యుని రప్పించి యాతనిఁ జూపఁగా నతఁడు పెదవి విరచి "రోగి బ్రతుకుట దుర్లభ"మని చెప్పెను. ఆనందభాయి కమలాభాయిని మిగుల గౌరవముగ లోనికిందెచ్చి కొంచె మెంగిలపరచి దుఃఖభారమున నాత్మహత్యఁ జేసికొనునేమోయని కడు మెలకువతోఁ గాపాడుచు నామె నొక నిముషమును వదలక నడుమనడుమ నామె యందమున కాశ్చర్యమునందుచు "కాకి ముక్కునకు దొండపండుఁ గట్టినట్లు ముదివానికీ చిన్నదానిని తల్లిదండ్రు లెట్లిచ్చిరో కదా! ఆ ముసలివానితోనైన నింత పసపు కుంకుమఁ బెట్టుకొని పదికాలములపాటు కాపురముఁజేయనీయక దైవ మామెకు ఘోర వైపరీత్యముఁ దెచ్చిపెట్టుఁగాఁబోలును ఈరూప మడవిఁగాచిన వెన్నెలయగునా" యని విచారపడుచు నామెపైఁ జేయివైచి పండుకొనెను. రాణోజీస్థితిఁజూచి మురళీధరదాసతని తమ్ముఁడగు దౌలతురావునకు నొక మనుష్యునిచే వర్తమానమంపెను. ముందు రాణోజీకి వంటచేయుటకుఁ బంపఁబడిన దుండిరావు గంజాయిదుకాణమున దిట్టముగ గంజాయిద్రాగి మెలకువలేక పండుకొనియుండ మార్గమున నెద్దును బెదరించిన లక్ష్మణుఁడు దుకాణమునకు గంజాయికిఁబోయి దుండినిలేపి జరిగిన వృత్తాంతమును జెప్పిపంపెను. దుండిరావచ్చుటికి వచ్చి, తన యజమానునకు సహాయమొద్దియు నొనర్పఁజాలక యాతని నాధారముగఁ జేసికొని తాను పన్నిన పన్నుగడలన్నియు వ్యర్థములయ్యెనని చింతించుచు నిద్రనాపలేక రెండుకునుకులు కునికెను. ఈనడుమ నానందభాయి కొంచెము కన్నుమూసినందున

పలువిధములగు తలంపులు మనస్సున మల్లడిగొనుటచే తెప్పపాటులేక నిట్టూర్పు విడుచుచు కమల లేచికూర్చుని కన్నులనిండ ముక్తాఫలములవలె గ్రందుకొనియున్న బాష్పములు మాటిమాటికిఁ దుడుచుకొనుచు మిగుల దుఃఖించుచు "అమ్మా! నీవెంత కఠినురాలవు. నీవు నాకుఁ జేసిన యీద్రోహమునకు నేనీజన్మమున మఱల మీదగ్గఱకు రాను. అంత మీరుమిక్కిలివచ్చిన నిచ్చటనే శరీరసమాప్తము చేసెదను. దైవమా! నాకేల మరణముఁ గలుగఁజేయవు? ఆయెద్దు నన్నేల గ్రుమ్మకపోవలె? ఈయనపని యెట్లయినను నేను దురదృష్టవంతురాలనే" యని వగచుచుండెను. అంతలో నానందభాయి మేలుకొని ప్రక్కలో నామె లేకుండుటకుఁ గలవలపడి లేచి దూరమునఁ గూర్చుండిన యాకన్నియం జూచి తన యజాగ్రత్తవలన నపాయమప్పటికి రానందుకు సంతోషించెను కాని యప్పుడప్పుడె తొందరతో తన కన్నీళ్లగుపడకుండఁ గమల తుడుచుకొనినను నామె దుఃఖించుచున్నట్టు లానంద తెలిసికొని మితిమీరిన జాలిచే నామె దగ్గఱగఁ జని స్త్రీయగుటచే స్వాభావికలక్షణము పోకుండఁ దానుగూడఁ గంటఁ దడిఁబెట్టుకొని "అమ్మా! యేల వాపోయెదవు? నీ ముఖసౌందర్యమును, నీవిలాసమును జూడఁగా మఱియొక యుపద్రవము జరుగఁగూడదని నాకుఁ దోఁచుచున్నది. అయినను విలపించినఁ గార్యమేమి? నీభర్త ప్రాణములవిషయమై గాక మఱి యేవిషయమైనను నాతమ్ముఁడు నీకు కావలసిన సాయము చేయును. అతఁడు మంచివాఁడు" అని యూరడించెను కమల యప్పుడు తన వెనుకటియవస్థయెల్ల మనస్సునం దట్టుటచే నొకమారామె యొడిలోఁ దలఁబెట్టుకొని గట్టిగ రోదనమొనర్చి "అమ్మా నీవు మా తల్లివంటిదానవు. నీతమ్ముఁడు మిగుల మంచివాఁడు. అన్నివిధముల నంతటివానిఁ జూచి యెఱుఁగను. ప్రాణములు నిలిపిన మహాత్ముఁ డతఁడు కాఁడా? ఎన్నటికైన నాకతఁడే దిక్కని నేను నమ్ముకొని యుంటిని." అని పలికెను. ఇంతలో శ్యామసుందరదత్తు తలుపుఁదెరచి గదిలోని కరుదెంచుటచే వారి సంభాషణము ముగిసెను. కమల యాతనిఁ జూచి చటుక్కున లేచి గోడకుఁజేరి నిలిచి సిగ్గునఁ దలవంచి పదాంగుళముతో నేలవ్రాయుచుండెను. ఆమె వైపు చూడిక్కనిగుడించి దత్తు తన సోదరితో "అక్కయ్యా! రాణోజీగారికి రవ్వంత నిలబాటుచేసినదని తోఁచుచున్నది. కుదురవచ్చునని నా కాశకలదు." అని తనరాకచే వారి సంభాషణ యాగినదనియుఁ గమల సిగ్గున నిలువవలసివచ్చినదనియుఁ దానాగది విడిచి వీధిలోనికిం జని యేమియుందోఁచక నిటునటు పచారుసేయుచుండెను. అప్పుడు రెండుజాములరాత్రికంటె నధికముగఁ బ్రొద్దుపోవుటచే వీధులలో నెవరును లేరైరి. పిండి యారఁబోసినట్లు వెన్నెల ధవళధవళమై వ్యాపించియుండ నున్నతసౌధముల యొక్కయుఁ దమయింటి కావలనున్న దేవాలయముయొక్కయు నీడలు వీధిలోనికి వ్యాపించి యసమానమైన సౌందర్యము నెలికించుచుండెను. ఆ వెన్నెలకెరటములలో

ముసింగి యానందము నొందుచు శ్యామసుందరుఁడా సాయంకాలము తన హృదయము నపహరించిన దొంగను బలుమారు దలఁచుకొని మనస్తాపము నొందసాగెను. "ఆహాహా! ఏమి! ఆ కమలసోయగము! ఆమె సార్థకనామ. నిజముగ లక్ష్మియె. వేయిజన్మములకైన నేనీమెను మఱువఁజాలను. ఈమె నాయది. ఎంత వెఱ్ఱివాఁడను. పరధనమైన యామె నాసొత్తనుటకంటె వెఱ్ఱియేమున్నది? ఈ రాణోజీ చావక బ్రతుకునా? ఛీఛీ మోహపాశమునఁ దగిలి పాపమనక పుట్టెడు దుఃఖములోనున్న యామెభర్త మరణమును గోరుచున్న నా హృదయము వజ్రమాయేమి! ఆతఁడు జీవింపకపోయినమాత్రమున నాకామె లభించుటయెట్లు? ఆమె పతివ్రతగదా, అయినను సర్వేశ్వరుఁడఘటనఘటనాసమర్థుఁడుగదా" అని మెల్లమెల్లన లోనికిం జనెను. అక్కడికిఁ బదునాల్గుమైళ్ల దూరముననున్న నింబూరునగరమునకు మనుష్యుఁడుపోయి దౌలతరావును వెంటఁ బెట్టుకొని తెల్లవారునప్పటికి వచ్చెను. దౌలతరావు శవమువలె పడియున్న సోదరునిఁ జూచి విలపించి యాతనిఁ బొరుగూరనుండనీయఁ జనదని కమలను సహోదరునిఁ బ్రయాణము జేసి పల్లకిలో వాసిమంచి, దుండిరావును సేవకులు వెంటరాఁబయలు దేరెను. కమల హృదయము ఆనందభాయియొద్దనుండి బయలుదేర నెప్పటియట్లు చింతిల్లుచుండెను. శ్యామసుందరుఁడామెను సాగనంపుటకుఁ గడుదూరమరిగి, కమలావియోగమున వివర్ణముఖుఁడై. దౌలతరావును వీడ్కొని యింటికిఁ జనెను. కొంతదూర మిట్లు పయనము సాగినతరువాత రాణోజీ మిగుల నాయాసమొందఁ బల్లకిఁ జెట్టుక్రిందఁ దింపిరి. దౌలతరావు గుండెలఁ బాదుకొని యేడ్వనారంభించెను. కమల నిశ్చేష్టితురాలయ్యెను. పల్లకిలోనున్న రాణోజీ పల్లకిలోనే మృతినొందెను.

అయిదవ ప్రకరణము.

రాణోజీ పలాస్కరునకు దౌలతురావు తమ్ముఁడు. వయసున నితఁడు రాణోజీకిఁ దమ్ముఁడైనను గుణములయం దతఁడె దౌలతరావన్నయనియు, రూపమున నచ్చముగ నన్నగారినోటనుండి యూడిపడినటులుండెననియుఁ జెప్పఁదగును. అభిమానముచేత నతనిభార్యయుఁ బక్షపాతముచేత నతని స్నేహితులును, నీలమేఘశ్యాముఁడని వర్ణింతురుగాని యతఁడు నిజముగ మాలకాకివలె కడునల్లనై యందమనుమాటయైన లేని వికారాకారుఁడు. దుబ్బులవలెఁ దెగపెరిగిన మీసముల నలుపునకును వానిమొగము యొక్క నలుపునకును, రవంతయు భేదముండదు. ఆతని చక్కదనమంతటితో సమాప్తము నొందక యెత్తుగఁ బెరిగిన బొజ్జకడుపుతోడను, శరీరముయొక్క విపరీతపు లావుతోడను, కొంచెము దీర్ఘమగు ముక్కుతోడను, జూచువారికి నవ్వుఁ బుట్టించు

చుండెను. అన్నకు కుయుక్తులలో సహాయులై యిరువురును గొప్పయుద్యోగములు సంపాదించి, హొూల్కారు సంస్థానమున మంచివారని పేరుసంపాదింపకపోయినను, దేశమున దుర్మార్గులనకయునను పేరువహించిరి. అట్లుండియు నంతవఱకుఁ దమయేలిక విషయమై ద్రోహమును దలఁచి యుండలేదు.

ఇట్లు రాణోజీ తనపాలిటి మృత్యుదేవతయైవచ్చిన యెద్దుచే గాయములు దగిలినందునఁ బల్లకియందు మృతినొందిన దౌలతురావు శవము నందె యుంచి జాముప్రొద్దెక్కువఱకు కమలాభాయితో నిండూరునగరముఁ బ్రవేశించెను శవమును దన గృహమునకుఁ గొనిపోక స్మశానమున కాదారినిఁ గొనిపోయి కమల నింటికంపి తనభార్య కప్పగింపుమని దుండిరావునంపి బంధుజనులను రుద్రభూమికి రమ్మని వర్తమానమంపి వారు వచ్చినతరువాత తన సోదరునకు యథావిధిగ నగ్నిసంస్కారము చేసెను. అక్కడకు వచ్చిన కులస్థులందఱును, మనుష్యులు కాలముదప్పినతరువాత వివాహమాడఁగూడదనియు దైవవశమునకు నెవ్వరేమిచేయఁగలరనియు నంత సుందరికి వివాహమైన నెలకే వైధవ్యమువచ్చుట యన్యాయమనియు నామెకు నీ దురవస్థకే యీశ్వరుఁడీపెండ్లి సంకల్పించెననియు బహువిధముల జాలినొందిరి. దౌలతురావు భార్యయగు దుర్గాభాయి పెద్దపెట్టున నేడ్చుచు వీధిగుమ్మముదగ్గఱ కెదురుగవచ్చి తోడికోడలిని, కౌఁగిలించుకొని రోదనముచేసి "అమ్మా తోటికోడండ్రమని పట్టుమని మనమిద్దఱమును నొక నెలనైనను గాపురముచేయనైతిమి. నీవెంత దురదృష్టవంతురాలవో యేభోగమనుభవింపకముందె పసపు కుంకుమయైన మనసుదీరపెట్టుకొనకముందె, యొక ముచ్చటచ్చట దీరకముందె పెండ్లియైన నెలకె యీలాగైతివిగదా! అమ్మా! మొదటి పర్యాయమే నిన్ను బ్రాఁతలోఁ జూడవలసివచ్చెఁగదా. తల్లీ నీవింకా వచ్చినతరువాత నిద్దఱమును గాపురముఁ జేయవలె ననుకొన్నాను కాని యింతవఱకు వచ్చునని యెఱుఁగనుతల్లీ' అని పరిపరిభంగుల నంగలార్చి కమలయుఁ గొంచెము దుఃఖింప నామె నూరార్చి దానూరకుండెను. కమల యెందుచేతనో ధైర్యముఁ జిక్కఁబట్టి యంత విస్తారముగాఁ బొగలుట మాని గుండె రాయిఁజేసికొనెను. అగ్నిసంస్కారాదులఁజేసి దౌలతరావు కర్మ నారంభించి రెండుదినములు గడచినవెనుక దుండిరావునుబిల్చి, కమలనుగూర్చి కొన్నిసంగతు లడుగఁదలఁచి యిట్లనియె.

దౌల— ఓరీ! దుండీ! మాయింటికి నెంత దుర్దశవచ్చినది. నాకు నా కుడి హస్తము పడిపోయినదిగదా, యింక నాబ్రతుకేల?

దుండి— అవును దైవవశమున కేమిచేయఁగలము? మీకేమి మూడేండ్లదామె మీ వదినగారిమాటఁ దలఁచిన నాగుండెలు తాళుటలేదు.

దౌల— ఆహాహా! ఏమి యీపెయందము! దైవము మిక్కిలి యయోగ్యపుఁ

బని చేసినాఁడు. ఇంతటి యందకత్తెను నేనెందును జూచి యెఱుఁగను. ఇటువంటి కన్య యెంత యదృష్టవంతునకు భార్యయగును.

దుండి--(కొంచెమాలోచించి సందేహముతో) ఆమె యెక్కడి కరుగఁగలదు? పాపము, ఇఁక నీవెదిక్కు నిన్నుగని పెట్టుకొనియుండునుగనుక నీవామె సుఖముఁ జూడుము.

దౌల — మఱే. ఆమె నాదగ్గఱనుండునా? పుట్టినింటి కరుగునేమో. అయితే నీమెను మా యన్నగారు వివాహమాడినాఁడా?

దుండి— వివాహమైనపుడు నేనక్కడ లేనుగాని పెండ్లియైనదని మీయన్నగారు నాతోఁ జెప్పినారు. త్రోవలోఁ దన్నడిగినవారందఱితోడను ఈమె తనభార్యయనియె చెప్పెను. పెండ్లియగుట సందేహము లేదు.

దౌల— అయినదా? నేను కాలేదనుకొన్నాను. సరే. ఇఁక విచారమె లేదు.

దుండి— విచారమెందుకు? నాదగ్గఱ దాఁచక నీమనసునసున్నది చెప్పు. నీకు నేమైన నాశకలదా? మనకు లాభించునెడలఁ బెండ్లికాలేదని చెప్పుదము.

దౌల— మిత్రుఁడా! నీవు నాకేమయిన సహాయముఁ జేసెదేని యీకమలను మాయన్న పెండ్లియాడలేదని చెప్పి నేను వివాహమాడవలెననియున్నది. నీవు నన్ను మఱియొకలాగెంచవద్దు.

దుండి— నీకుఁ బ్రియముఁ జేయుటకంటె నాకుఁ గర్తవ్యమేమున్నది? ఆమెను నయమున భయమున లొంగఁదీసి నీకు వివాహముఁ జేయింతు. ఈ పదిదినముల కర్మ ముగిసినదాక నోరెత్తఁబోకు.

అని వారు మాటలాడుకొనుచుండ దుర్గభాయి లోపలినుండి వచ్చి కమలభాయి దురవస్థకుఁ గొంచెము విచారించి, యామెతల్లికినిఁ దమ్మునకును వర్తమానము నంపుమని భర్తతోఁ జెప్పెను. సాధారణముగ నేమి కారణముచేతనోగాని దుండిరావునకు దుర్గయనినచో నొకవిధమైన భయము గలదు. అందుచే నామెవచ్చినతోడనే లేచి, యతఁడు మెల్లగా జారెను. తరువాత దౌలతురావు కమలపుట్టినింటికి వర్తమానము నంపుటకు సమ్మతించి తన మనోరథమును భార్యకు నెఱిగింపఁగోరి యామె యొద్ద భయముగలవాఁడగుటచే రవంత సంశయించి యూరకుండెను. దుర్గభాయి సద్వంశమునఁ బుట్టి, సద్గుణములుకల యొక సుందరి సదాచారుఁడు కాని యామెభర్త సద్గుణపుంజము గు భార్యకు జడియుట స్వభావమేయగుటచేత దౌలతరావున కామె పిఱికి మందైనను నీమూర్ఖుఁడు చీవాట్లకు వెఱువక యప్పుడప్పుడు తన మనోరథముల నామెకుం దెలిపి యామెచే మందలింపఁబడు వాడుకగూడ గలదు. దౌలతరావు దుర్గనుజూచి సంశయమెల్ల విడిచి యిట్లనియెను.

SCIENCE PAPER SERIES No. 4.

HEAT. ఉష్ణము.

చాలకాలమువరకును ఉష్ణము పదార్థమని పూర్వికులలో జ్ఞానులుసయితము నమ్మియుండిరి. కాని ప్రకృతమం దట్టి యభిప్రాయమును ప్రకృతిశాస్త్రజ్ఞు లేరుగాని యామోదించుట గానము. నిజముగా నుష్ణము పదార్థమైనచో వస్తువులన్నియు వేడిగా నున్నపు డెక్కువ తూఁగవలసినదే కదా. ఇట్లెప్పుడైనను జరుగునని చెప్పుట పిచ్చితనము కాక మరియొకటి కానేరదు. ఉష్ణము శక్తిస్వరూపముగాని పదార్థము కాదు. ఈశక్తి రాపిడివలన గలుగుట మనకందరికి ననుభవనీయమే కదా. ఇప్పటికిని గూడ యజ్ఞాదిక్రతువులయం దెట్లు అగ్నిని గలుగఁజేసికొనెదరో మనమందర మెరుగుదుము. సాధారణముగ చిన్నచిన్న పల్లెలయందును గ్రామములయందును చుట్టలుత్రాగు జనులు రెండు ఉక్కుతునకలను కొద్దిగ దూదినిని ఒకసంచిలోవేసి కూడ ఎల్లప్పుడును దీసికొనిపోవుచుందురు. వలయునప్పుడెల్ల నా తునకల రాపిడిచే అగ్నికణములను దూదిలోఁ బ్రవేశింపచేసి యగ్నిని సంపాదించుకొందురు. ఇట్టిసమయమున నెట్టిపదార్థముగాని కలుగుటలేదు. రాపిడి గలుగచేయుటకు మనము వ్యయపరచిన బలము, ఉక్కుతునకలయందలి యణువులయందు చలనము పుట్టించుచు, నట్టిచలనశక్తి నిట్లు వెల్లడిపరచుచున్నది. ఇదియే ఉష్ణస్వభావమైయున్నది.

ఉష్ణమువలన పదార్థములు విరివియగుచున్నవి. ఏపదార్థముగాని ఉష్ణశక్తికి లోనైనప్పుడు కొంత మార్పును చెందుచున్నది. ఇందువలన స్వభావ మెన్నటికిని మారుటలేదు. కఠినమైన వెండికడ్డి నొకదానిని తగుకాలము మూసలోనుంచి కాచిన యెడ నది నీరగుచున్నది. ఈనీరును తగినంత ఉష్ణసహాయముచే నావిరియగునట్లు చేయవచ్చును. పదార్థ మెట్టిస్థితిలో నున్నను కఠినమైయున్నను, ద్రవముగానుండినను, లేక వాయుస్వరూపము ధరించినను, బరు వెంతమాత్రము తగ్గనేరదు. స్వభావ మెన్నటికిని మారదు. సర్వసాధారణముగ కఠినపదార్థము ద్రవపదార్థముగ మారినప్పు డెక్కువస్థలము నాక్రమించుకొనును ద్రవముగా నున్నప్పటికన్న యావిరిగనుండునపు డింతకంటె నెక్కుడుస్థలము నాక్రమించుట నిశ్చయము. దీనికి కారణమేమయి యుండవచ్చును. స్వభావము మారదు. అణుపదార్థములవిభాగములు. ఉష్ణశక్తి యన చలనశక్తియే. ఈ చలనము పదార్థఅణుస్వరూపముల తరంగంబుల పొరలుచు వానిని దూరదూరముగ నుంచుచుండును. అందువలననే యుష్ణము హెచ్చినకొలది పదార్థములు ఎక్కుడు విరివిని చెందుచున్నవి.

కఠినపదార్థములలోకూడ నన్నియు నేకరీతిగ నుష్ణప్రసారమువలన విరివిని చెందుటలేదు. స్వభావమునుబట్టి మార్పులు గలుగుచున్నవి. ఇనుమును మంచుగడ్డయు కఠినపదార్థములే కాని అధిక ఉష్ణము చేర్చినంగాని ఇనుము కరగనేరదు. నిమిష మాత్రమున అతి స్వల్పమగు వేడిమిచే మంచుగడ్డ నీరగుచున్నది. నీరును పాదరసమును ద్రవపదార్థములే యయినను, సమానముగ గాచఁబడినప్పుడు నిర్ణయకాలములో నీటికంటె పాదరసము ముప్పదిరెట్లెక్కువగ కాగును. గనుకనే శాస్త్రజ్ఞులు ప్రతి పదార్థమునకు ఉష్ణశక్తి (అనగా ఉష్ణమును పొందగలశక్తి) స్వభావమునుబట్టి మారుచుండునని చెప్పుచున్నారు.

ఉష్ణమువలన పదార్థములందు గన్పట్టు మార్పులంబట్టి ఉష్ణశక్తినికూడ ధాన్యాదులవలె, కొలుచుటకు సాధనము లేర్పడియున్నవి. ఎట్టిపదార్థమయినను కొంత యుష్ణబలమునకు తగుపాటి మార్పును బొందకమానదు. ఉష్ణము హెచ్చినచో మార్పు హెచ్చుచున్నది. మొదటిది తగ్గినచో రెండవదిగూడ తగ్గుచుండును. కాని కఠిన పదార్థము బహుస్వల్పముగను ద్రవపదార్థములు సామాన్యముగను వాయుపదార్థము లత్యధికముగను ఉష్ణమువలని మార్పును జెందుచున్నవి. అందువలన నిట్టి కొలతకు తరుచు ద్రవపదార్థములనే యుపయోగించుచుందురు. ఇట్లు మన మేరుకొను ద్రవపదార్థము రెండువిధముల మన కంగీకారముగ నుండవలసియుండును. ఉష్ణ మెంత స్వల్పమయిన నందుకు తగుపాటి మార్పును గనపరచవలెను. ఇదియునుంగాక సాధారణోష్ణోద్రేకమునకు వాయుస్వరూపమై యావిరిగ మారకుండవలెను. ఈవిషయ ములలోఁ దృప్తికరముగ ప్రవర్తించు ద్రవపదార్థము పాదరసముగనున్నది. కనుకనే శాస్త్రజ్ఞులు ఉష్ణపరిమితి నిర్ణయసాధనముల (Thermometers)లోఁ బాదరసమునే యుపయోగించుచున్నారు.

ఇట్టి సాధననిర్మాణమునుగూర్చి కొంత ముచ్చటింతము. కుంకుడుగింజకన్న నెక్కువ పరిమాణము లేనట్టియు, లోపల గుల్లగా నుండునట్టియు, ఒక గుండ్రని గాజుకాయ ముఖమునకు మిక్కిలి సూక్ష్మమైన తూముగల సన్నని గాజుకాడ నొక టంటియుండిన నొక విచిత్రమైన గాజుసాధన మేర్పడుచున్నది. గాజుకాయ కడు చిన్నదిగను, కాడ కడు సన్నముగను ఉండును. ఈకాడ ముఖము దెరచియుండును. ఈ సాధనమునకు గంఠపూర్తిగ ప్రథమమున బాదరసము నెక్కించి యటువెనుక లోపలనుండు పాదరసము యావిరియై పైకి నెగయునంతవరకు యీ గాజుసాధనమును కాచవలయును. అపుడు దానిముఖము మూసివేసి కళపెళ ఉడుకుచున్న నీటియావిరిపైనుంచిన లోపలనున్న పాదరసము గాజుకాడకు కొంతయెత్తున నిలిచి యుండును. ఆస్థలము గుర్తించి గీటుపెట్టవలయును. తరువాత ఈ సాధనమును

నీరగుచున్న మంచుగడ్డలలో నుంచిన పాదరసపంక్తి క్రిందికి దిగి గాజుకాయకు సమీపమున నిలిచియుండును. ఇక్కడను వెనుకటివలెనే గీటుపెట్టి గుర్తించవలయును. ఈ గుర్తులమధ్యనున్న స్థలమును సాధారణముగ నూరు అంశెలుగ భాగించియున్నారు. వీనినే డిగ్రీలని (Degrees) పిలుచుచున్నారు. ఏతద్భాగములనుగూడ నంతర్భాగములుగఁ జేసినచో ఉష్ణమువలనఁ గలుగు స్వల్పభేదములను సహితము గన్పెట్టవచ్చును. మనము చంకలోగాని, నాలుకక్రిందగాని, చేతితోగాని గాజుబుడ్డినిబట్టి యుంచినయెడల మన శరీరమందుండు అంతరాగ్నియొక్క స్థితిగతులు బయలుపడగలవు. సాధారణముగ మనకు వాడుకలో సంభవించు శీతలము మంచుగడ్డ శీతలముకన్నను, ఉష్ణము నీటిఆవిరివేడిమికన్నను, మించియుండవు గనుక ఆ సాధనమందిట్టి హద్దుల నేర్పరచికొనిరి అతిశీతలమును, అత్యుష్ణమును గనిపెట్టుటకు వేరు నిర్మాణముగల సాధనములను గల్పించికొనియున్నారు.

ఉష్ణమువలన కలుగు మార్పుల కొందు గొన్ని యుదాహరణముల బొందుపరచుచున్నాము. మనలో ననేకులు ఇనుపదారి నెన్నడైన చూచియుండవచ్చును. ఆమార్గమున నుంచిన యినుపకమ్ములు ఒకదానికొకటి యంటియుండక కొంచెము ఎడముగ నుండును. అట్లుండనియెడల రాపిడిచేతను గ్రీష్మకాలమందలి వేడిమిచేతను కమ్మి పొడవై రెండవకమ్మితో కలిసి ఒకదానినొకటి త్రోసికొనలేక పైకి పొడుచుకొని యుండును. అందువలన ధూమశకటము దారితప్పి క్రిందపడవచ్చును.

బండిచక్రమునకు ఇనుపపట్టాను తగిలించుకొరకు ముందు దానినిగాల్చి తరువాత ఆ పట్టాను చక్రముదగ్గరబెట్టి చల్లార్చుదురు. కాల్చబడినపుడు వృద్ధిచెందిన ఇనుపపట్టా నీళ్లుపోయుటవలన జల్లపడి హ్రాస్వముచెంది చక్రమునకు దిట్టముగ తగులుకొనును.

ద్రవపదార్థములును కఠినపదార్థములవలెనే యుష్ణమువలన వృద్ధిచెందునుగాని నీరు కొన్నిసమయములయందీ నిబంధనకు లోబడియుండదు. నాలుగు డిగ్రీలకుపైన ఉదక మన్ని ద్రవపదార్థములవలెనే ఉష్ణముచే వృద్ధియు, శీతలంబున సూక్ష్మమును చెందుచుండును. కాని నాలుగు డిగ్రీలకుముందు అనగా ౦, ౧, ౨, ౩ డిగ్రీలు సమీపించునపుడు నీరు శీతలముచే వృద్ధిచెందును. ఇందున కుదాహరణంబుగ నీటితో నిండినట్టియు, మూతి బిగియబడినట్టియు నొక గాజుబుడ్డిని దీసికొందము. దీనిని తగినంత శీతలమునకు లోబరచినచో లోపలినీరు ఘనీభవించును. నిజముగా ద్రవముగా నున్నప్పటికన్న ఘనీభవించిన సమయమున నీరు సూక్ష్మదేహము బొందుచో ఘనీభవించిన నీటిగడ్డ బుడ్డిలోన ఇమిడి ఉండును. కాని యట్లుండక మూతిని భేదించి ఒకప్పుడు బుడ్డిని పగులగొట్టి బయలువెడలును. ఇట్టి కారణముననే చలికాలమున ఉత్తర దక్షిణ

ధ్రువసమీపమున నుండు దేశములలో పర్వతములు పగిలి రాళ్లతివేగమున పైన విడిపడు చున్నవి. రాతిలోనున్న నీరు ఘనీభవించుటచే యిట్లు సంభవించును.

ఇంతియగాక నీరిట్లు నిబంధన నుల్లంఘింపక యుండినయెడల ప్రపంచములోఁ జాలభాగము వాసయోగ్యముగ నుండనేరదు. ఒక చిన్నచెరువులోని నీరు ఘనీభవించుటకు సిద్ధముగ నున్నపుడు, పైనున్న నీటితెరముందు ఘనీభవించును. ఈ ఘనీభవించిన నీరు నీటికన్న బరువైనచో గ్రిందికిపోవును. ఇట్లే క్రమక్రమముగ చెరువులోని నీరంతయు, ఉపరిభాగమునుండి నీటి క్రిందిభాగమువరకు పర్వతమువలె ఘనీభవించి యుండును. ఈలాగున, సముద్రములు, చెరువులు, నదులు వేయేల శీతలదేశమందలి నీటియాధారములన్నియు పర్వతములవలె కఠినముగ నుండును. అట్టి సమయంబున నలుగు రైదుగురు సూర్యు లుదయించినను ఘనీభవించిన నీరు, ద్రవపదార్థము కానేరదు. ఓడలు నడువఁజాలవు. నీటిలోని జంతుజాలము చచ్చిపోవును. ఇట్టి మహోపద్రవము మాన్పుటకే కాఁబోలు సర్వేశ్వరుఁడు నీరిట్లువ్యవహరించునట్లేర్పరచియున్నాఁడు. ఆహా- ఏమి ఈచిత్రము- ప్రకృతిశాస్త్రము చదివినకొలఁది దేవునిమహిమ యందలి నమ్మకము దినదినప్రవర్ధమానమగుచున్నది.

ప్రపంచము గుండ్రముగను అందు రెండువంతులు జలమయముగను ఉండియున్నది. ఇందు నిరక్షరేఖకు సమీపముననుండు దేశములు ఉష్ణముగను, ధ్రువసమీపముననుండు దేశములు శీతలముగను ధ్రువములకును నిరక్షరేఖకును మధ్యగానుండు దేశములు సమశీతోష్ణములుగను ఉండును. ఉష్ణకాలమునందు ఉష్ణమండలములందలి సముద్రపునీరు (అనగా ఉపరిభాగపునీరు) కాగి తేలిక అయి ఉపరిభాగమార్గమున శీతలమండలము చేరుచుండును. శీతలమండలపునీరు బరువుగ నుండుటచే నీటి క్రింది భాగముగుండ ఉష్ణదేశప్రాంతములకు పోవుచున్నది. ఇట్టి ఏర్పాటుచే ఉష్ణదేశమున నున్నవారికి శీతలమును, శీతలమండలమున నుండువారికి ఉష్ణమును కలుగుచున్నది. ఉత్తర అమెరికాదేశసమీపమున సముద్రమధ్యమున పారుచుండు వేడినీటికాలువ ఇట్టి నిబంధనల ననుసరించియే కలుగుచున్నది. ఉష్ణప్రాంతములనుండి శీతమండలములకుఁబోవుచున్నది. వేడినీటిప్రవాహము గాని మరియొకటి కానేరదు. (The Gulf stream). మనలను చుట్టియుండుననిలము గూడ మన కిట్టిలాభములను గలుగజేయుచున్నది. ఉష్ణమండలముపై వీచుగాలి వేడిమిచే చులకనయై మింటికెగసి యాకాశపథమున ధ్రువమండలప్రాంతదేశములకు పోవును. అట్లే శీతల మండలమందలి గాలి చల్లదనముచే బరువెక్కిన భూభాగమున కంటియుండి క్రమక్రమమున ఉష్ణదేశములకు జారివచ్చుచున్నది. ఇవియే మనకున్న ముఖ్య వాయుప్రవాహములు. కాని దేశకాల స్థితులనుపట్టి ఇవి మారి యనేకవిధములుగ పారుచున్నవి.

కఠినపదార్థము లెన్నడుగాని ఉష్ణములేక ద్రవపదార్థములు కానేరవు. మరియు ద్రవపదార్థమున కుష్ణసహాయముండినంగాని వాయుస్వరూపము ధరింపజాలదు. కాని ఇంచుక కొకవిశేషము కద్దు పెద్దమంచుగడ్డను తీసికొని పరిశీలించినయెడల, అది నీరు అగుట మొదలుకొని పూర్ణముగ అగువరకు, థర్మామేటరువల్ల మన కెట్టిభేదమును కనుపడదు.

ఇట్లే ద్రవపదార్థములు వాయుస్వరూపములగునపుడుకూడ కనిపెట్టవచ్చును. ఇట్టిసమయములందు ఉష్ణము గ్రహింపబడకపోలేదు. కాని యది గుప్తముగ నణగి యున్నది. దీనినె లేటెంటు ఉష్ణము (Latent heat) అని వక్కాణించుచున్నారు. తదనుకూలముగ ఆవిరి ద్రవపదార్థముగ మారినప్పుడీగుప్తమైన యుష్ణము బయలువడుచున్నది. ద్రవపదార్థములు కఠినపదార్థములు అగునపుడుకూడ నిట్లే గుప్తమయిన యుష్ణము కన్పెట్టబడుచున్నది. ఇందునకు కొన్ని నిదర్శనంబుల నిచ్చుచున్నారము. చెమటపట్టినప్పుడు వీవనలతో విసరికొంటిమా ఒడలు చల్లగనుండును. మన యొంటి నున్న నీరు మన శరీరమందలి యుష్ణసహాయమువలననే యావిరియగుచున్నది. అందువలన చల్లగనుండునట్లనుభవించుచున్నాము. మార్గములపై నీళ్లు చల్లబడినపుడు చుట్టునుండు గాలి చల్లపడుచున్నది. నీరు ఆవిరియగుటకు వలసిన యుష్ణము ఆవరించియుండిన గాలివలన గలుగుచున్నదిగనుక ఇట్లు సంభవించును. ఒక మట్టి కూజాలో నీరుపోసి పాత్రపై తడిగుడ్డ కప్పినచో తడిగుడ్డ యారిపోవుటచే నీరు చల్లబడుచున్నది. నీరు ఇంకునట్టిపాత్రలలోనుండు నీరు ఒకప్పుడు చిన్నచిన్న మంచు కణములుగ మారిపోవునంత శీతలమగుటకూడ కద్దు. గాలిని తీసివేయగలిగిన (air pump) యంత్ర ఆవరణములో నొక పింగానిపాత్రనుంచి అందులో నీరుపోసి యంత్రబలముచే గాలిని తీసివేసినచో ఆనీటిలో చాలభాగ మావిరియగును. ఇందుకు కావలసిన వేడిమినీటినుండియే తీసుకొనిపోబడుటచే మిగిలిననీరు మంచుగడ్డయగును.

ద్రవపదార్థములనుండి వెలువడు యావిరి బలముగలదై యుండి తన బలమును జుట్టుప్రక్కలనున్న వస్తువులందు గనుపరచుచుండును. బరువునను, ఆకృతియందును, విరివియందునను సమముగనుండి ఒకమూతి తెరచికొని రెండవమూతి మూసియున్న గాజుగొట్టముల రెంటిని తీసికొని వానినిండ పాదరసము నెక్కించవలయును. అటు
టి రెండుమూడుబిందువుల నీటి నొకగొట్టమునను అంతియే పరిమాణముగల
బిందువు లింకొకదానిలోనున్న పాదరసముపైనుంచి ఈగొట్టముల ముఖములను
నవ్రేళ్లతో నణచిపెట్టియుండి పాదరసమున్న యొక పెద్దగిన్నెలో వీనిని తలక్రిందుగ
మనట్లుంచవలయును. తలక్రిందులు చేసినప్పుడా ద్రవబిందువులు పాదరసముకన్న
క యగుటంజేసి గొట్టముల చివరకుపోయి నిలుచును. ఇట్లు కొంతకాల

ఱుంచినచో ప్రథమమందిగొట్టము లందున్న పాదరసపంక్తి సమానమైయున్నను క్రమ
క్రమమున ఈదరున్న గొట్టమందలి పాదరసము క్రిందికి త్వరలో దిగిపోవును. రెండవ
దానియందిట్లు బహుస్వల్పముగ జరుగును. దీనికి కారణమేమైయుండవచ్చును.
గొట్టముల రెంటిలోనున్న ద్రవబిందువులు యావిరియగుచున్నది. కాని ఈదరతిత్వరలో
ఉష్ణప్రసారమంతలేకయే యావిరియగును. నీరును ఆవిరియగుచుండినను అంతత్వరలో
కానేరదు. అందువలన ఈదరు ఆవిరి వృద్ధియై తనబలముచే పాదరసమును ద్రోసివేసి
తానాగొట్టము నాక్రమించియుండును రెండవగొట్టములోని నీటియావిరి స్వల్పముగ
నుండినను తన బలముచే పాదరసమును గొంతవరకు త్రోసివేయుచున్నది ఆవిరిబలము
ఆయా యావిరియందలి శీతోష్ణస్థితినిబట్టియు, పదార్థస్వభావమునుబట్టియునుకూడ
నుండును.

ఎట్టిపదార్థముగాని ఆవిరియగునపు డట్టి ద్రవపదార్థము నణచుచుండు వాయు
బలమును జయించినంగాని ఆవిరి బయటరానేరదు. గనుకనే నీరావిరి కానైయున్న
పుడు పైన వ్యాపించియున్న వాయువును త్రోలివేయవలసియుండును ఇట్లే వాయు
పదార్థముగాని లేకుండిన స్థలమున ఆవిరియగునపు డతిసులభముగ నట్టి యావిరి
బయలువెడలును. కాని ఇట్టి గాలిలేని స్థలము మూయబడిన పాత్రయయినచో ముందు
బయలువెడలిన యావిరి తరువాత బయలుదేరెడి యావిరి కడ్డుపడును. అట్టిసమయమున
యతి కఠినమునను, అత్యుష్ణప్రసారముచేతను గాని ఎట్టి ద్రవపదార్థమును వాయుస్వరూ
పము పొందజాలదు. కాబట్టి దిట్టముగ మూయబడిన పాత్రలో నీరు ఆవిరియగుచు
న్నపుడు కొంతవర కతిసులభముగ ఆవిరియైనను క్రమక్రమమున నూటపాతిక
నూటయేబది డిగ్రీల యుష్ణము ప్రసరింపచేసినను నీరావిరి కాకయుండును.

ప్రకృతిశాస్త్రజ్ఞులు మనచుట్టును ఆవరించియుండు వాయువు ఏబదిమైళ్లకన్న
నెక్కుడు దూరముగ నుండదని చెప్పుచున్నారు. అట్లుండిన సముద్రముపై ప్రసరించు
గాలియింత ఎత్తుగనుండును. గనుక అక్కడనున్న పదార్థములపై గనుపరుపబడు వాయుబల
మెక్కువగనుండును. మిక్కిలి ఎత్తయిన పర్వతప్రాంతములయందంత బలముండజాలదు.
ఏబదిమైళ్లలోను కొంతతగ్గును గనుక వాయుబలము (అనగా అణచుశక్తి) కొంచెముగ
తగ్గును. అట్టి ప్రదేశములందు నీరు మొదలైనవి అతిత్వరగానే యావిరియగును.
అందుకు నిదర్శనంబుగ, సాధారణముగ నూరుడిగ్రీల యుష్ణమున కావిరియగు నీర
తొంబదియారు డిగ్రీలకే యావిరియగుట కలదు. గనుక పర్వతశిఖరవాసులు ఎక
వేడిచేగాని నీటిలో ఉడకని వంటపదార్థములను బిగియపడిన దృఢమైన పాత్రము
ఘడికించుకొనుచుందురు. ఉష్ణము త్రిమార్గగామియై యొకచోటనుండి మరియొకచో
పోవుచుండును. ఈమార్గములు పదార్థస్వభావముల ననుసరించియుండును. ప్ర

మార్గము ఏకపంక్తిని వ్రేలాడగట్టిన గోళీకాయల చలనగమనమును పోలియుండును. ఒక కఠినపదార్థమునుండి మరియొక్క కఠినపదార్థమున ప్రవేశించునపు డుష్ణము పైని చెప్పినయట్లు గమనించుచుండును. ఒక చివర నిప్పులోనున్న ఇత్తడికాడను చేత బట్టినచో వేడిగనుండును. ఉష్ణము ఒకస్థలమునుండి మరియొకస్థలమునకు కఠినపదార్థగామియై పోవురీతిని కండక్షన్ అని పిలుచుచున్నారు (Conduction). పదార్థము లన్నిటియందును ఉష్ణము గమనింపచాలదు. కొన్నిపదార్థములు కండక్టర్సు (Conductors) అనగా కండక్షనుకు తగినవియు మరికొన్ని తగనివియు నున్నవి. ద్వితీయ మార్గమెట్టిదో చూడవలెనన్న కాగుచున్న నీటిలో రంపపుపొడుముంచినచో తేట పడుచున్నది. క్రిందనున్న నీరుకాగి తేలికయై పైకిపోవును. పైనున్ననీరు చల్లదనముచే బరువుగ నుండుటచే క్రిందికిదిగును. ఈ గమనిక పొట్టుమూలమున మనకంటపడు చున్నది. దీనినే కన్వెక్షన్ (Convection) అని పిలుచుచున్నారు. ఉష్ణము వాయుపథమున నొకచోటనుండి మరియొకస్థలమునకు బోవునపుడు రేడియేషన్ అని పిలుచుచున్నారు (Radiation). ఇదియే మూడవమార్గము. సూర్యునివద్దనుండి మనకు నుష్ణ మిట్లు ప్రసరించుచున్నది.

కండక్షనను ఉష్ణగమనికవలని లాభము లనేకములు గలవు. క్రొవ్వువత్తిదీపమున కెదురుగ దోమతెరవంటి సన్నని ఇనుపతీగెలతో నల్లిన తెర నొకదానినుంచినచో దీపపుకాంతి ఈతెరకు దిగువున చాలవరకు తగ్గును. ఒకప్పుడు దీప మారిపోవుటయు కూడకలదు. అపుడు అగ్నిప్రసారము తెరకావల గలిగించినచో దీపము తెరకూర్ధ్వముగ వెలుగును. ఇనుము మంచి కండక్టరుగనుక ఉష్ణమంతయు నిమిషములో నన్నివైపుల వ్యాపింపచేయబడును. గనుక దీపమునకు దగినయుష్ణములేక కాంతిగలిగి దీపము వెలుగనేరదు. సర్ హంఫ్రీడేవీ యను శాస్త్రజ్ఞుం డీబుద్ధిజ్ఞానముచే బొగ్గుగనులలో పని చేయువారికి గొప్ప మహోపకారము చేసియున్నాడు. ఇదివరలో గనులలోనుండు అపాయవాయువులు దీపపు ఉష్ణముచే మండి పనివాండ్రనందరిని చంపుటయేకాక గని నంతను మాపుచేయుచు వచ్చినవి. ఇపుడు గనులలో ఉపయోగింపబడు లాంతరుకు చుట్టును ఇనుపతెరలు కట్టియుండును. అందువలన తగినంత ఉష్ణము దొరకక అపాయమైన గాలులు విరక్తిచే నూరకుండి పనివాండ్రను బాధపెట్టకయుండి యున్నది.

బొచ్చుతోచేసిన వస్త్రములు మనము సాధారణముగ ధరించుదుము. బొచ్చు గాకపోవుటచే శరీరమందలి యుష్ణమును పైకిం బోనీక లోపల నణచిపెట్టి ను. అందువలన మనకు వెచ్చగనుండును.

మంచుగడ్డలను మనదేశములలో ఒకచోటినుండి మరియొకచోటికి తీసికొనిపోవు పొట్టులోను ఊకలోను కట్టి తీసికొనిపోవుచుందుము. ఊకయు పొట్టును

కండక్టర్సు కాని కారణముచే గడ్డ నీరు కానేరదు.

బొగ్గుగుండ ఎంతమాత్రమును ఉష్ణము పోచాలదు. ఒకవైపున కాలుచున్న బొగ్గున మన కెంతమాత్రము అపాయములేకయే సులభముగ చేత పట్టవచ్చును. వజ్రములు గోమేదకములు మొదలగు విలువగలిగిన రాళ్లు కండక్టర్సు గాజట్టివి కాదు. గనుక వివాదాంశముగ గాజురాయిని యారాళ్లను పెదవివద్ద పెట్టిచూచినచో విలువగల రాళ్లు పెట్టినపుడు చల్లగనుండును. దీనివలన కొంత విమర్శజ్ఞానము కలుగుచున్నది.

సర్వేశ్వరుఁడు శీతలమండలములో నివసించు కుక్క, ఎలుగు మొదలగుజంతువులకు దళమైన బొచ్చును, ఉష్ణదేశమందలి ఒంటె కోతి మొదలగువానికి పలచని చర్మమును అమర్చియున్నవాఁడు. ఆహా ఏమి ఈ సర్వేశ్వరునికృప. తదనుగుణ్యమైన సౌఖ్యమును గలుగజేసి జంతుజాల మంతటిని సంతోషపెట్టుచున్నాడు.

ఆవిరికి బలముగలదని వేరుగ నొక్కి వక్కాణింపనేల. నీరు కాచునపుడు పాత్ర దిట్టమైనదిగనుండి మూత పలచనదిగను తగుపాటిదిగను ఉండినయెడ నీటియావిరిచే నట్టిమూత పైకి క్రిందికి నెగసిపడుచుండును. ధూమయంత్రమును కనిపెట్టిన వాట్సు దొరగా రిట్టి పరిశీలనచేతనే ప్రపంచమందందఱిని తమకు కృతజ్ఞులుగ చేసికొన్నవారు. ఇకాలంబున నెక్కడచూచినను, ఏపనికైనను, ఆవిరియంత్రముల నుపయోగించుచున్నారు. ఇనుపసామానులు చేయుట, యంత్రములు చేయుట, కాకితములు చేయుట. ఇంకను ఎన్నోపనులు నెరవేర్చుట, యావిరిబలముననే జరుగుచున్నది. ఎవరయినను బుద్ధిమంతులు ఆవిరిబలమువలన పని జరగునపుడు, నీటియావిరినే యుపయోగించిన కాని పని జరగనేరదా యని యడిగిన నడుగవచ్చును. అపును వేరు ఆవిరిఁ గూడ నట్టిపనులకు నుపయోగింపవచ్చును కాని వర్తకవ్యాపారము చేయునప్పుడు మిక్కిలి సమృద్ధిగను వ్యయమంతలేకుండగను జరుగుపనులనే ఏర్పరచుకొనవలయును. నీటికన్న సమృద్ధిగను చవుకగను దొరకు ద్రవపదార్థ మెన్నటికిని మనము కనుగొనజాలము గాన దీని నుపయోగించుచున్నారు. నీటిని నొక ఇనుపభాండమున కాచినపుడు వెడలెడి యావిరిగొట్టములమూలముగ ఇంకొకపాత్రలో చేరును. ఈ పాత్ర కావలివైపున ముందుకును వెనుకకును ఆడగలిగిన మూత యొకటిగలదు. ఆవిరి ప్రవేశించినపుడు ఆమూత కదలి వెనుకకును ముందుకును ఆడుచుండును. ఈ చలన మిచ్చవచ్చిన ట్లుపయోగింపవచ్చును. ఈ చలనమునే తగిన యేర్పాటులచే త్రిప్పుడుయంత్రః బరువునెత్తు యంత్రములకును, దంపునట్టి యంత్రములకును, బండ్లను నడ ఉపయోగించవచ్చును. ఇదియే ధూమయంత్రమర్మము.

శుక్రనీతిసారము.

క. శ్రీవిఘ్నేశ్వరుఁ బ్రణుతుం । గావించి తెనుంగొనర్తుఁ గావ్యనికాయం
బోవాసవేయదేవ స । దావాస నిరంతరార్చితార్చాభావా.

క. శ్రీరాజిత శౌర్యాధిక । భూరమణావశ్యవేద్య భూతిప్రదదే
వాంగుళ శుక్రనయవి । స్తారము సకలార్థశాస్త్రసారము వినుమా.

జగజ్జన్మస్థితిలయకర్తం బరమాత్ముని మ్రొక్కి శుక్రుఁడు దన్నుఁ బూజించి స్తుతి నమస్కారములొనర్చి యడిగిన తొలువేలుపులకు సప్రమాణముగ నీతిశాస్త్ర ముపదేశించెను. ఈ శాస్త్రము మున్ను లోకోపకారమునకు సర్వవేది విధాత శతలక్షశ్లోకపరిమిత మొనర్చెను. వశిష్ఠాదులము మేము దత్సారము నల్పాయుష్కులగు రాజాదుల మేలుకొఱకు యుక్తిబహుళముగ సంక్షేపించితిమి. ఒక్కొక యంశమును దెలుపు నితరశాస్త్రములమాట యేటికి? అందఱకు సుఖజీవనసాధనమును లోకము నిలుపు నదియు నీతిశాస్త్రమె. సర్వపురుషార్థ సాధనముగావున రాజాదులు దీనిం జదువు నది. ఇది యెఱుంగుటవారు చదురుగదిరి పగఱఁ ద్రుంచియెల్ల ప్రజలనల్లసిల్లం జేయుదురు. వ్యాకరణము చదువమిఁ బదములు, తర్కము పఠింపమిఁ బదార్థములు, పూర్వమీమాంసం దెలియమి యజ్ఞాదికర్మనిర్ణయములు, వేదాంతశ్రవణము చేయమి శరీరాదుల భంగురత్వాదులును దెలియవా? ఇవి యీయాశాస్త్రములు చేసిన వారియభిమతమును బుద్ధిప్రావీణ్యమును దెలుపుచు నామతమునందు రుచిగల జనులచే నవలంబింపఁబడినవి. లోకవ్యవహారమున కవి యేల? భోజనము లేమిని దేహము నిలువనియట్లు నీతి లేమిని సమస్తలోకవ్యాపారము సాగదు. సర్వసమ్మతము సకలాభీష్టప్రదము నగు నీతిశాస్త్ర మఖిలరక్షకుఁడగుట రాజునకు నత్యావశ్యకము. అపథ్యము భుజించువారికి రోగములవలె నీతిలేనివారికి నప్పుడు గొందఱుఁ గొంతకాలమునకుఁ గొందఱు విరోధులగుదురు. పథ్యభోజులకు రోగములవలె నీతిమంతులకు విరోధులు తత్కాలమునఁ గొందఱుఁ గొంతకాలమునకుఁ గొందఱు లేకపోదురు. రాజునకు దుష్టనిగ్రహ శిష్టానుగ్రహములు పరమధర్మములు. అవి రెండును నీతిలేనిదొరకు దొరకవు. అనీతియె భూపతికెల్లపుడు భయమును వైరివృద్ధిని నత్యంతబలక్షయమును గలిగించు గొప్పలోపము. నీతిదూరుఁడై విచ్చలవిడి సంచరించు భూపాలుఁ డాపదలపాలగును. అట్టివానిఁ గొలుచుట కత్తివాతిని నాల్కతో నడఁచుట. నీతిమంతుఁడగు భూకాంతుని సేవించుట సుకరము. నీతిబలములు రెండునుగలదొర సిరి విరివియగును. ఎట్లు గోరకుండ దేశమంతయుఁ దనకు మేలుచేయ సమకట్టునో, అట్లు చక్కఁగ హితముగోరు భూనాధుఁడు ప్రవర్తింప


వలయును. మండలము దండు మంత్రులు మొదలగువారును వేరగుట భూరమణుని నీతి నైపుణములలేమియె. సుజనరంజనుండు దుర్జనతర్జనుండు సకలానందనుండునగు రాజనందనుండు తన యాలోచనచే భూజనులతేజు గైకొనుచుఁ బ్రాచీనజనపుణ్యమ్మున నీ నేలయేలఁజాలును. చలివాన యెండలచేతను జ్యోతులగతి ప్రకృతిరూపములచేతను ప్రియమప్రియము హెచ్చుతగ్గగు నాచారముచేతను గాలము మాఱుచుండును. ఆచారము నడుపును గాన రాజు కాలము మంచిచెడ్డలు గలిగించువాఁడు. కాలము తనంతనె మంచిది చెడ్డదియునగునేని కొందఱు ధార్మికులేలకారు? జనులు రాజు దండించునని వెఱచితమ తమ సత్కర్మములు విడువకుందురు. ఈలోకమున స్వధర్మము ననుసరించినవాఁడె కడుఁ దేజరిల్లును. అది విడిచిన సుఖము కలుగదు. అదియె గొప్పతపము. సర్వదా దీనిఁ జేసినవానికి సురలును గింకరులగుదురు. ఇఁక నరులఁ జెప్పవలెనే? బలువెఱపు గలిగించు మంచిదండనములచే నరుల నిజధర్మపరుల నొనరించి భూవరుఁడు దాను నట్టివాఁడగావలయును. ఒండువిధమైనఁ దేజితుఁగును. పట్టాభిషేకముననో ప్రకారాంతరముననో దొరతనమందిన యతఁడు తనయం దేలోపము లేక బుద్ధినీతి బలశౌర్యములతో నెల్లజనుల ననుదినముఁ బ్రోచుచు నపరాధుల సదా దండించునది. ఎప్పుడు మెలఁకువగలవానికిఁ గొలఁది ధనమును బెనుపొందును. నీతిధనాదులుగల వానికిఁ బశుప్రాయులును వశులగుదురు. సాత్వికము రాజసము తామసమునని తపము త్రివిధము. తేఁడెట్టితప మత్యంత మరయునో యట్టివాఁడగును. నిజధర్మము వీడక ప్రజలఁ గాచుచు నగ్నియజ్ఞములాచరించి పగతురఁ బరిమార్చుచుఁ జాగమున విన్నాణియై శూరుఁడు నోరుపుగలవాఁడు భోగములరాగరహితుఁడునగు సాత్వికుఁడు తుద నిత్యానందమందును. కనికరము లేక కండకావరముగలిగి కల్లలాడుచు బాధలుపెట్టువాఁడు తామసుఁడు నరకవాసియగును. మోసగాఁడు, అపకారి, భోగలంపటుఁడునై, పిసినితనము, కపటము, కలహప్రీతి, నీతిలేమి, నీచులచెలిమిగలిగి, యొకటితలంచి యొండొకటి వాక్రుచ్చి వేఱొకటిచేయు రాజాధముఁడు పశుపక్షి పాదపాదిజన్మమేదియే నొందును. సాత్వికతామస రాజసులు దేవాసుర మానవాంశ సంభూతులు. సత్వతమస్సులు సమమైన మనుష్యులగుదురు. మనుజుఁడు సత్వాదులలో దేనినాశ్రయించిన నట్టివాఁడె యదృష్టము ననగును. కావున సత్వమున మనము నిలుపునది. ఇందుఁ గలిమి లేములకుఁ గారణము లీ పుట్టువుననో తొలుబాముననో చేసిన పుణ్యపాపములె. క్షణమైనఁ గ్రియారహితుఁ డెవఁడేని కలఁడా? పుట్టుచేతనె బ్రాహ్మణుఁడు క్షత్రియుఁడు వైశ్యుఁడు శూద్రుఁడు మ్లేచ్ఛుఁడు కాఁడు. వీరు గుణ క్రియలచేతనె భేదముగలవారైరి. ఒక బ్రహ్మవలననే పుట్టినవారందఱు బ్రాహ్మణులు

కారా? వర్ణమువలనఁగాని కన్నవానివలనఁగాని బ్రహ్మవర్చసమును బొందఁడు.
శమదమదయాగుణములు జ్ఞానయజనోపాసన దేవతారాధన క్రియలు గలవాఁడు
బ్రాహ్మణుఁడు. సుజనావనకుజనదండనాది క్రియాదక్షుఁడు దమ పరాక్రమాదిగుణ
ధనుఁడు క్షత్రియుఁడు. కర్షణగోరక్షణములు చేయుచు నిత్యము సరకు లమ్మనుగొనను
నేర్పున జీవించువారు వైశ్యులు. ద్విజులపూజయందాసక్తిగలిగి కొలుచుచు జితేంద్రి
యులు శమోత్సాహవంతులునై నాగళ్ళు కట్టెలు గడ్డిమోచు నలఁతివారు శూద్రులు.
ఆత్మధర్మాచరణము మాని కనికరము మాలి పరులనొంచుచు నవివేకమున సర్వదా చంప
చండాలురు మ్లేచ్ఛులు. నరులకుఁ బూర్వకర్మఫలభోగమునకుఁ దగునట్టు పుణ్యముననో
పాపముననో తలంపు పుట్టును. అది తొలఁగి, యెవఁడు నేదియుఁ జేయఁ
జాలఁడు, కాఁగలదానికిఁ దగునట్టు తలంచును, అట్టివారె సహాయులును
దొరకుదురు. పూర్వకర్మాధీనముగా సర్వము జరుగునని నిశ్చయించిన నిది కార్య
మిది యకార్యమను నుపదేశములు నిష్ఫలములగును. హెచ్చు తెలివి మెచ్చునడ
వడియుఁ గలవారు పౌరుషము మెత్తురు. మగఁటిమిలేమిని జతనము చేయలేనివారు
దైవము నెన్నింతురు. గతజన్మకృతములు సుకృతదురితములు దైవము, వర్తమానజనన
కృతములు పౌరుషము నందురు. ఈ రెండె సర్వమున కాధారము, ఎప్పుడును
బ్రబలమొ దుర్బలమొ నడంచునుగా. ఫలములగు సుఖదుఃఖములచేతనె, వాని బలా
బలములు దెలియునుగాని లాతిచొప్పనఁగాదు. మనకుఁ గనఁబడు కారణము
చేతనె ఫలమందుట గానరాదు. అదిపూర్వజన్మ కర్మనిమిత్తము గాని వెఱతెఱఁగునఁ
గాదని నిర్ణయము. అల్పవ్యాపారము చేత నైతము మానవులకు మహాఫలము గలుగు
టయు పూర్వకర్మము చేతనె యగును. మనుజులకీ జన్మపుఁ గ్రియచేతనె గలుగు ఫలము
నకుఁ బూర్వకర్మమువలనఁ జెమురువత్తియుఁగల దివియకు గాలివలనవలె రక్షణ మా
వశ్యకముగావునఁ గొందఱు భూతవర్తమాన కర్మజమునందురు. అవశ్యముగాఁగల
కార్యములకుఁ బరిహారముండినఁ దెలివి బలుములకొలఁది ఖలుల బ్రుందించుట గడు
మంచిది. మందమధ్యాధికములుగ సుఖదుఃఖములిచ్చు పూర్వకర్మము త్రివిధముగ
నారయునది. రావణునకు వనభంగమున నొక్క వానరునివలనను, భీష్మాదులకు
గోగ్రహణమున నొక్క నరునివలనను దైవప్రాతికూల్యమును, రామార్జునులకుఁ
దదానుకూల్యమును, స్పష్టమయ్యె. దైవము సుముఖమైనన నల్పక్రియయు ననల్పఫలయగును.
విముఖమైన గొప్పక్రియయు ననిష్టఫలదాయినియగు. బలిచక్రవర్తి దానముచేతను
హరిశ్చంద్ర మహారాజు సత్యముచేతను బద్ధులైరి. శాస్త్రముచే సదసత్క్రియ లిష్టా
నిష్టఫలదములని యెఱింగి యసత్కర్మము మాని సత్కర్మము నాచరింపవలెను. కాలము

నకుఁ గారణముగావున సుకృతదురితములకును గారణమగు రాజు తన శౌర్యముచేతను దీక్ష్ణదండముచేతను బ్రజలను స్వధర్మమున నిలుపవలయును. స్వామి, అమాత్యుఁడు, మిత్రము, ధనము, రాష్ట్రము, దుర్గము, బలమునని రాజ్యమునకు నేడంగములు. అందు రాజు మూర్ధము, అమాత్యుఁడు నేత్రము, మిత్రము శ్రోత్రము, ధనము వదనము, రాష్ట్రము పాదములు, దుర్గము హస్తములు, బలము మనము. రాజాదులు వృద్ధిసంతులు కాఁదగు మేలిగుణములు దెలిపెద. సంద్రమును జందురుఁడుబలె నీఁగమును వృద్ధి నొందించువాఁడు నేత్రానందకరుండునై చక్కఁగ నడుపురాజు లేకుండినఁ బ్రజ కడలింజుక్కానుకాఁడులేని యోడవలె నశించును. పాలకుండు లేకున్నఁ దమతమ ధర్మమున జనులు నిలువరు. ప్రజలేకున్న నీనేలనేలికయు శోభనొందమి సందియుంబె? న్యాయమున నడిచిన జనపతి తన్ను జనులను, ధర్మార్థకామసంపన్నులఁ జేయుటయు లాతివిధమయిన విపన్నులఁ గావించుటయుఁ దప్పదు. పృథుయుధిష్ఠిరులు ధర్మమున వశపఱిచికొని వసుధననుభవించిరి. అధర్మమున వేననహుషులు నశించిరి. కావున ధర్మము పురస్కరించుకొని పార్థివుండర్థమునకు యత్నింపవలయును. ధర్మపరుఁడగు నరవరుఁడు దేవాంశజుఁడు; ఇతరుఁ డసురాంశజుఁడు ధర్మమడంచి ప్రజల బాధించును. ఇన్ద్రాగ్నియమవరుణానిలకుబేరసూర్యచంద్రాంశములఁ దాల్చితనయాలోకనమున భూమిపతి చరాచరనియామకుఁడగును. రక్షణదక్షుఁడగు మహాక్షితిపుండింద్రునివలె భాగహారి, వాయువు గంధమునకువలె శుభాశుభకర్మములకుఁ బ్రేరకుఁడు రవివలెఁ దమోనుదుఁడు ధర్మప్రవర్తకుఁడు నధర్మనాశకుఁడు, దండధరునివలె దుష్కర్మదండకుఁడు, రక్తుఁడై సర్వభాగముల ననుభవించుచు నగ్నివలెశుచి, వరుణుఁడు రసములచే బలె తనధనములచే సర్వపోషకుఁడు, ధనాధిపతి నిధులరక్షించు విధమున ధనరక్షణదక్షుఁడు, చంద్రుఁడు వెలుఁగులచేఁ బలె తన గుణకర్మములచే నాహ్లాదకరుఁడు కావలెను. చంద్రాంశము లేక యితరాంశములన్నిటిచేత రాజు రాజిల్లఁడు. పితృ మాతృ గురు భ్రాతృబంధుయమ కుబేరులను నీ యేడ్వుర గుణములు గలవాఁడె రాజు. తండ్రివలెఁ దన ప్రజకు గుణములవఱుపఁజాలుట, తల్లివలె నపరాధములు క్షమించుట పోషించుట, శిష్యునకు గురువువలె సువిద్యఁ జదివించుట హితముపదేశించుట, తండ్రిధనమునుండి సోదరునివలె యథాశాస్త్రము తన భాగము పంచికొనుట, చుట్టమువలెఁ దన్ను స్త్రీలను ధనమును రహస్యమును రక్షించుట, కుబేరునివలె ధనమిచ్చుట, యమునివలె దండించుట, మిక్కిలి వృద్ధిపొందఁగల చక్రవర్తియందీ యేడుగుణములుండును. వీనిని రాజెన్నఁడును విడువఁజనదు.

మొసళ్ళు

మొసలి బల్లిజాతిలోనిది. దాని వీపుపైని బల్లికివలె మెత్తని చర్మముండక బుడిపెలవరుసలుగల కొమ్మువంటి పదార్థముతో చేయఁబడిన చర్మముండి మొసలికి రక్షణముగానుండును; ప్రక్కలను చర్మముపైని గుండ్రని చిన్న పొలుసులు నిండి యుండును; కడుపుమాత్రము మృదువయి నలుచదరములైన పొలుసులను గలిగి యుండును. ఇది చూపులకు పెద్దబల్లివలె కనఁబడినను, మిక్కిలి భయంకరమయిన క్రూరజంతువు. మొసలియొక్క రూపము క్రిందిపటమునఁ జూపఁబడియున్నది—



దీనితోఁక శరీరమునకంటెను పొడుగుగానుండును. దీనివీపు పొడుగునను బుడుపులు నాలుగు వరుసలుగానుండి కడపట నొక్కటిగా చేరును. తెడ్డువలె నుపయోగపడుటకయి తోఁకయొక్క ప్రక్కలు గుండ్రముగానుండక చదరముగానుండును. మొసలియొక్క వీపు నల్లరేఖలందందుఁగలిగి గోధుమవర్ణముకలదిగానుండును; కాళ్ళయొక్కయు కడుపుయొక్కయు అడుగుభాగము తెలుపుతోఁ గూడిన పసిమివర్ణము కలదిగానుండును. కాళ్ళు పొట్టివిగా నుండును; ముందటికాళ్ల కయిదేసి వేళ్లుండి కడపటి రెంటికినిదక్క మిగిలినవానికి గోళ్లుండును; వెనుకకాళ్లకు నాలుగేసి వేళ్లుండి కడపటి దానికిఁదక్క మిగిలివానికి గోళ్లుండును. కప్పకాళ్ళకువలె వానివేళ్ల మధ్యను చర్మముండును. తల మిక్కిలి దీర్ఘమయి ముందుభాగమునందు ముక్కు రంధ్రములను గలదిగానుండును; ఆముక్కురంధ్రములకు కనుఱెప్పలవంటి మూతలుండి వలసినప్పుడు మూయుటకును తెఱచుటకును అనుకూలముగానుండును. దౌడలు చెవులవఱకును తెఱచుటకనుకూలముగా నున్నందున, ఎంత పెద్ద జంతువునైనను మొసలి నోటిలో ననాయాసముగా పట్టఁగలుగును. దౌడలలో వెనుకవైపునకు వంగి యొక్కొక్క వరుసనే పళ్లుండి యీ విదౌడలు దగ్గఱగాఁ జేర్చినప్పుడొందొంటిలో నమరి సందులేక యుండును. పళ్లు వెనుకవైపునకు వంగియుండుటచేత మొసలినోటిలో పడినజంతువు విడిపించుకొని యీవలఁబడుట దుర్ఘటము. మొసలికి దౌడలనంటి పెదవులు లేనందున దానిపళ్లు అంపపుపండ్లవలె సదా వెలికిఁ గనఁబడుచుండును. దీనికి నాలికలేదని

భ్రమింతురుగాని దీనినాలుక చలనములేక క్రిందిదౌడనంటుకొని యుండును. కన్నులు చిన్నవయి ప్రకాశించుచుండును. ఇతరజంతువులకువలె రెండు కనుతెప్పలుండుటయే కాక నీటియడుగున నున్నప్పుడు రక్షణముగానుండుటకొఱ కద్దమువంటి ప్రకాశమానమయిన చర్మముకూడ పయిపొరగా నుండును. ముక్కురంధ్రములకువలెనే చెవిరంధ్రములకును వలసినప్పుడు తీయుటకును మూయుటకును దగిన చర్మపు మూతలుండును. ఈ ప్రకారముగానే గొంతుకలోపలఁగూడ నాకతోలుమూఁతయుండి మొసలి నీటిలో మునిగినప్పుడు నీరు లోపలికిపోకుండ వారించును. ఇట్టిమూఁత యుండుటచేత మొసలి జంతువును నోటఁగఱచికొని నీటిలోనికి లోఁతునకుఁ బోయినప్పుడు నీరెంతమాత్రమును లోపలికిపోదు. ఒక జాతి మొసళ్ళు దేశమునందలి గంగాది నదులలోను మడుగులలోను విస్తారముగానున్నవి. వీనిలో పెద్దవి యిరువదియడుగుల పొడుగుండును; వీనికిపళ్లు నూఱువఱకునుండును. ఇవి సాధారణముగా చేపలను తినియే జీవనము చేయుచున్నను, నీటిలో పడవైచిన శవములను గొన్నిసమయములయందు బ్రతికియున్న మనుష్యులను నీటిలోదిగిన యితరజంతువులనుపట్టి భక్షించును.

మొసళ్ల నెత్తురు మనుష్యరక్తమువలె వెచ్చగానుండక చల్లగా నుండును. మొసళ్లు నదీతీరములయందలి యిసుకతిన్నెలలో పల్లముత్రవ్వి వానిలో నెండాకులు వేసి గ్రుడ్లుపెట్టును. ఒక్కయాఁడుమొసలి యొక్కొక్కసారి యిరువదిమొదలుకొని యేఁబదివఱకును గ్రుడ్లుపెట్టి పిల్లలను జేయును. గ్రుడ్లుపెట్టిన నలువదిదినములలో నెండవేఁడిమిచేత నాఱేసి యంగుళములపొడవుగల పిల్లలు కలుగును. అప్పుడు తల్లిపిల్లలను నీటిలోనికిఁ దీసికొనిపోయి యవి స్వయముగా నాహారమును సంపాదించుకొనఁగలుగునంతవఱకును సగము జీర్ణమయిన యాహారమును బెట్టుచుండును.


మొసలి వ్యాఘ్రమువలె క్రూరమయినజంతువు. అది నీటిపయి నీఁదెడు బాతులు మొదలగువానిని, నీరుపట్టుతీర్చుకొనుటకై జలములోదిగిన పందులు మొదలగువానిని, నీటిలోనుండెడు చేఁపలనుగూడఁబట్టి చంపితినును. చేఁపలను పట్టుకొనుటకై నీటిలో నెంతదూరమయినను తఱుముకొనిపోవును. పంది, కుక్క, మొదలయినవానిని పట్టుకొన్నప్పుడవి చచ్చుటకయి లోతునీటిలోనికీడ్చుకొనిపోవును. ముక్కురంధ్రములుమాత్రము నీటిపైకెత్తి, మనుష్యులను జంతువులను బట్టుకొనుటకయి యది దినములకొలఁది నీటిరేవుల సమీపమున వేచియుండును. ఈ క్రూరజంతువును సంహరించుటకయి మనుష్యులు వివిధోపాయములను పన్నియున్నారు. కొందఱు పెద్ద గాలములకు పందిమాంసమును గ్రుచ్చి నీటిలోవేసి మొసలి దానిని మ్రింగినప్పుడు దానిని పయికీడ్చి, ఒడ్డుచేరినతరువాత దానికన్నులలో దుమ్ముకొట్టి గుడ్డి దానిని జేసి

తరువాత సులభముగాఁ జంపుదురు. మఱికొందఱు పడవలలోఁ బోయి సన్నని దారముల కొనకు గాలముకట్టి వాడిగల యాగాలమును దానియొక్క చర్మములో మెత్తని భాగమునందు గ్రుచ్చుదురు. అది త్రాడుకొఱికి ముక్కలు చేయుటకయి ప్రయత్నించునుగాని యాత్రాడొక్కసగ్గము గాక యక్కడక్కడ ముడివెట్టబడి విడిగానున్న యిరువది ముప్పది సన్నదారములకూడిక యగుటచేత కొఱుకఁడుపడక దారములు పండ్లసందునఁ జిక్కుకొని దానిప్రయత్నము నిష్ఫలమగును. ఆదారములతో దానిని నీటి యుపరిభాగమునకులాగి మనుష్యులు మరలమఱియొక వాడిగాలముతో పొడిచి చంపుదురు. ఆఫ్రికాఖండమునందలి నీగ్రోజాతివారు చేతవాడికత్తినిధరించి మహాసాహసముతో నీటిలోమునిఁగి మొసలి యడుగునకుఁబోయి దానిని కడుపులోఁ బొడిచి చంపుదురు. మొసలి నీటిలో తిన్నగా మహావేగముతో పరుగెత్తఁగలుగును గాని ప్రక్కలకంత శీఘ్రముగా తిరుగఁజాలదు. కాఁబట్టి మనుష్యులు దాని యుపద్రవమును తప్పించుకొనుటకయి వంపులుతిరిగి యడ్డదిడ్డములుగా నీఁదుదురు.

పూర్వకాలమునం దీజిప్టుదేశస్థులు మొసళ్లను పూజించెడివారు. ప్రతికుటుంబమువారును దా మొక్కొక్క మొసలిని పెంచి దానికాభరణములును పవిత్రాహారమును బెట్టి పూజించి చచ్చినప్పుడు దానినూరేగించి యుత్సవముచేసి పాతిపెట్టెడివారు. ఆదేశములోనే యింకొకజాతివారు మొసళ్లనుజంపి భక్షించెడువారు. అందుచే నారెండుతెగలవారికిని తఱచుగా కలహములు జరగుచుండెను. గ్రద్దలు మొదలయిన పక్షులును ముంగులు మొదలైన చతుష్పాదజంతువులును మొసలిగుడ్లను తిని వాని సంఖ్య తగ్గునట్లు చేయుచుండును. మొసలిగుడ్లు బాతుగుడ్లంత లేసియుండి కొంచెము కోలగానుండును. అనావృష్టిచేత చెఱువులు మొదలయిన వింకఁబాఱినప్పుడు కొన్ని సమయములయందు మొసళ్లు గ్రామములమీఁదఁబడి పశువులను జంపుటయుఁ గలదు. ౧౮౭౭వ సంవత్సరమున గొప్పయనావృష్టి సంభవించినప్పుడు సింహళద్వీపములోని కోర్నెగల్లిగ్రామసమీపముననున్న చెఱువునుండి రాత్రివేళ మొసళ్లు పైలుదేఱి పట్టణముమీఁదుగా చేరువనున్న వేఱొక చెఱువునకుఁ బోయెనఁట. అప్పుడు కొన్ని మొసళ్లు బావులలోఁ బడెనఁట; కొన్ని తోఁటలలోని కంచెలలో చిక్కుకొని మనుష్యులచేతఁ జంపఁబడెనఁట. వరపుచేత జలాశయములింకఁ బాఱుటవలన సామా

ా దొరకెడి యాహారము దొరకనప్పుడు మొసళ్లు బురదలోఁజొచ్చి పూడి
ద్రనాందియుండి వర్షములు కురిసినతరువాత లేచి పైలువెడలును. ఒకయుద్యో
గిన చెఱువులో తన గుడారమును వేయించెననియు, ఒకనాటిరాత్రి యతఁడు
మంచముక్రింద నేలకదలి యంచుండి మొసలియొకటి బయలువెడలెననియు,

జంతుచరిత్రకారులొక కథను వ్రాసియున్నారు.



అమెరికా ఖండమునం దింకొకజాతి మొసళ్లు గలవు. అవి సాధారణముగా మత్స్యములను తినియే బ్రదికినను కొన్ని సమయములయందు మనుష్యులను కొన్ని యితరములైన పెద్దజంతువులను బట్టుకొని యీడ్చుకొనిపోవును. అక్కడి యీ మొసళ్లు శీతకాలములో యోగనిద్రపూని చచ్చినట్లు పడియుండి యెండకాలము రాఁగానే లేచి మరల తిరుగసాగును. ఈ జంతువులక్కడ నదులలోను సరస్సులలోను మందలుగానుండును. ఇవి తాము మ్రింగలేనంత పెద్దజంతువును పట్టుకొన్నప్పుడు ఆ జంతువును నదియొక్క గట్టున గోయిత్రవ్వి కుళ్ళనారంభించువఱకు నందుంచి, తరువాత వెల్లగించుకొనివచ్చి నదీకూలమునందలి దుబ్బులలోఁ బెట్టుకొని తినును.

భీమలింగాష్టకము.

సంస్కృత భుజంగప్రయాతవృత్తములు

ఉమావామసంగం హిమానీసమాంగం । రమాసూనుభంగం సమానాంతరంగం ।
హిమాంశూత్తమాంగం క్షమాభృన్నిషంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభా
జటాజూటగంగం కృపానిఘ్నపాంగం । శ్రితార్త్యోఘభంగం హతద్విడ్రణాంగ
నదన్నాట్యరంగం లసజ్జ్యాభుజంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభాంగ
స్ఫురద్రౌప్యశృంగం సుహృత్పద్మభృంగం । మదేభప్రభంగం మృడానీభుజం
కనద్దోస్తురంగం దయార్ద్రాంతరంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభా

స్వభాస్వద్భుజంగం విభాస్వద్దృగంగం । ప్రభాస్వద్ధిగంగం సుచర్మాంచితాంగం।
తరత్స్వప్రసంగం దళద్ధ్వానవాంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభాంగం. ౪.
అఘౌఘప్రభంగం విపద్వ్యాఃపతంగం । స్వవేష్టగంగం సటాంభోత్తమాంగం।
వహచ్ఛ్రీగజాంగం మహాభూశతాంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభాంగం. ౫.
జటాక్షిఃపిశంగం జగత్పూరకాంగం । ఖచూడోత్తమాంగం కగంగాతరంగం।
రవిగ్లౌరథాంగం రథాంగ్యంతరంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభాంగం. ౬.
సుహృత్స్వాంతరంగం సురూపాప్త్యనంగం । త్రిలోకేడితాంగం త్రిశూత్త శృంగం।
జగద్ధేత్వపాంగం కురంగీదృగంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభాంగం ౭.
పురాభీకరాంగం సుధానందదాంగం । ధరాభృత్పురంగం మురార్యంగనాంగం।
విరాగాతిశుంగం కరాంతఃకురంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభాంగం. ౮.
ఇదంపావనం చంద్రశాస్త్రిప్రణీతం । శుభాభీష్టదం శైవగీతాష్టకంయే।
దినాంతే నిశాంతే శివాయత్తచిత్తాః పఠేయుః। పురారేర్దయార్హాభవేయుః. ౯.

పోతుకూచి - చంద్రయ్యశాస్త్రి.

దేశాభిమానము. [౧౮౯౩వ సం॥ వివేకవర్ధనినుండి గైకొనబడినది.

దేశాభిమానమనఁగా స్వదేశముమీఁద ప్రేమాధిక్యము కలిగియుండుట. ఏవస్తువుమీఁదనైన నభిమాన మున్నందునకు ఫలము దానిని మంచిస్థితికిఁ దెచ్చుటకై ప్రయత్నించుటగాని దానిని భట్టువలె పొగడుటకాదు. దేశాభిమానమనఁగా దేశములోని జనులమీఁది యభిమానమే యగుటచేత దేశాభిమానలేశముగల ప్రతి పురుషుఁడును తనదేశమునందలి లోపములను తెలిపి తొలఁగించి జనులను మంచిస్థితిలోనికిఁ దెచ్చుటకును, గుణాధిక్య మొందున్నను గ్రహించునట్లుచేసి స్వదేశజనులు విద్యావివేకములుగలవారి దృష్టియందు గౌరవార్హులగునట్లు చేయుటకును, సర్వవిధముల ప్రయత్నము చేయవలయును. చేయవలసిన కృత్యమిట్లుండఁగా మనదేశమునం దిప్పుడు ప్రబుద్ధులనేకులు బయలుదేఱి దురభిమానముచేత దేశమునందలి దురాచారములను మూఢవిశ్వాసములనుగూడ సదాచారములుగాను వివేకిజన సమాదరణీయ ంగాను పొగడి తన్మూలమున జనులలో మతోన్మాదమును దురాగ్రహమును వృద్ధి పచు, ఇతరదేశములవారియందున్న గుణములనుగూడ దోషములుగా ఘోషించి మనస్సులలో నన్యజాతులవారిమీఁద ద్వేషమును బురికొల్పుచు, దేశము నభివృద్ధి ము లేకుండఁ బాడుచేయుచు మూఢజనులు మెచ్చుకొనునట్లుగా తామేమో

మహాదేశాభిమానులయినట్లుగా నటించుచున్నారు. ఇట్టి యపూర్వ దేశాభిమానులు దేశమున కిప్పుడు చేయుచున్న చేటు గింతంతయని చెప్పుటకు శక్యము కాదు. గుణములనెందున్నను బొగడుట శ్లాఘ్యమేయయినను, అయినవానిని కానివానినిగూ నేకరీతిగా పొగడుటమాత్రము శ్లాఘాపాత్రము కాదు. అవిచారపూర్వకములైన యిట్టి పొగడ్తలవలన జనులలో దురభిమానమును దుర్గర్వమును బలిసి యుక్తాయుక్త విచారము చెడిపోయి దేశమున కభివృద్ధికిమారుగా క్షీణదశ సంప్రాప్తమగుచున్నది. గర్వమెప్పుడును మూర్ఖత్వసూచకము. తామే గొప్పవారమని జనులెప్పుడు గర్వపడ నారంభింతురో నాటినుండియు నిజమైన వృద్ధియు సత్యగ్రహణబుద్ధియు వారిని విడిచి దూరముగా తొలఁగనారంభించును. ఒక దేశముయొక్క యభివృద్ధిని పాడు చేయుటకై గర్వముతో సమానమయిన శత్రువు లోకములో మఱి యేదియులేదు. కాఁబట్టి దేశాభిమానులమని నటించెడు మహానుభావులందఱును దేశక్షేమమే యణుమాత్రమయినను తమ మనస్సులలో నున్నపక్షమున, పనికిమాలిన పొగడ్తలు పొగడి జనులను గర్వితులనుజేసి చెడఁగొట్టుటకు తొడుపడక సత్యమును దెలిపి చేతనైనంత వఱకు వారికన్నులు తెఱపి వారభివృద్ధిపొందుటకుఁ దగినమార్గమును జూపుటకయి పాటుపడవలెను. ఇట్లు చెప్పుటవలన మన పూర్వులు బుద్ధిహీనులనియు మనలో నేదియు మంచిదిలేదనియు మాయభిప్రాయ మెంతమాత్రమును గాదు. చుట్టుపట్ల దేశములవారజ్ఞానాంధకారమున మునిఁగి హీనదశయందున్న కాలములో మన పూర్వులు జ్ఞానజ్యోతి వహించి యున్నతపదము నొంది సర్వజన శ్లాఘాపాత్రులుగా నుండిరన్న సత్యమును మే మెఱుఁగనివారము కాము. వారి యప్పటి మహోన్నత స్థితియు వారు దేశమునకుఁ జేసినమేలును దలఁచుకొనఁగా మేమిప్పుడును సంతోషము పట్టఁజాలకున్నాము. అయినను తొంటివారి యున్నతస్థితిని దలఁచుకొన్నప్పుడు మా హృదయమున కెంతసంతోషము కలుగుచున్నదో యిప్పటివారి హీనస్థితి తలఁపునఁ బొడసినప్పుడు మాహృదయమున కంతఖేదము కలిగి, సత్యగ్రహణ పరాయణులయిన యట్టి మహామహుల సంతతివారమయ్యును వారివంశ్యులమని నోరుతెఱచి వివేకులతోఁ జెప్పుకొనుటకు సిగ్గుపడవలసిన నీచదశకు వచ్చియున్నాముగదాయన్న విచారమే మమ్మిప్పుడాదుర్దశను తొలఁగించుకొను సాధనము నాలోచించుటకుఁ బురికొల్పుచున్నది. మన పూర్వులు నిజముగా గొప్పవారేయయినను మనకు గొప్పతనము కావలసినచో మన యిప్పటియోగ్యతవలన రావలసినదేకాని మన పూర్వులు వారని విఱ్ఱవీఁగుటవలన నించుకేనియు రాదు. మనము నిజముగా గొప్పవారము కాఁగోరెదుపక్షమున మనపూర్వులు విడిచిపోయిన సుజ్ఞాన నిక్షేపమ్మునుపొం

నుగుణచరితల నూఁతగొని వారివలెఁగాఁజూచుటయే కాక వారికాలమునందు లేని నూతనజ్ఞానధనమునుగూడ సంపాదించి వారిని మించుటకయిగూడఁ బ్రయత్నము చేయవలయును నూతనజ్ఞానము సంపాదింపవలయునన్న మాటచేతఁ గొందఱదరిపడి మన పూర్వులు సర్వజ్ఞులుకారా, వారిని మించఁ బ్రవర్తించుట యసాధ్యసాహసము కాదా, వారికంటె భిన్నాచారములను బూనుట యపచారముకాదా, యని మమ్ము దూలనాడవచ్చును. మన పూర్వులేకాదు మఱియెవ్వరి పూర్వులునుగూడ సర్వజ్ఞులు కారు. దేవుఁడొక్కఁడుమాత్రమే సర్వజ్ఞుఁడుగాని మనుష్యులందఱును ప్రాచీను లయినను నవీనులయినను తప్పక మితజ్ఞులే. మనుష్యులను సర్వజ్ఞులనుట యీశ్వర దూషణము. మనకువలెనే మన పూర్వులకును భ్రిమప్రమాదాదులు సహజగుణములు. మన పూర్వులయందును మనము దిద్దుకొనవలసిన లోపము లనేకములున్నవి. పూర్వుల సదాచారములనుమాత్ర మనుసరించి దురాచారములను సంస్కరించుకొని దేశ క్షేమకరములయిన నూతనాచారముల నవలంబించుచుండుటవలననే జనులెప్పుడును నభివృద్ధిపొందఁగలుగుదురు. అట్లుచేయక తమ పూర్వులే సర్వజ్ఞులని గర్వపడుచు తమపెద్దల దురాచారములను సహితము సదాచారములని యవిచారపూర్వకముగా నమ్మి యాచరించుచు పూర్వాచారవిరుద్ధములన్న హేతువుచేత లాభకరములయిన నూతనాచారములను నిరాకరించుచు వత్తురేని జను లభివృద్ధిలేక యంతకంతకుచెడి కడపట వివేకులదృష్టియందు పరిహాసాస్పదులగుదురు. గుణాగుణ విమర్శనము చేయక యంధప్రాయముగా పూర్వాచారములనెల్ల దేవతలనువలె నారాధించుచు వచ్చుటచేతనే మనదేశమున కనంతములయిన యనర్థము లాపాదిల్లినవి. కాఁబట్టి సత్యము దేవతకాని పూర్వాచారము దేవతకాదని బోధించి యెల్లవారల హృదయములందును ఈసత్యము నాటుకొనునట్లు చేయుటయే దేశాభిమాన మాన నీయులకెల్లను ప్రథమకర్తవ్యమయిన పరమధర్మము. అయినను మనదేశమునం దిప్పుడు చదువుకొన్నవారు సహితము తాము చదువుకొన్న చదువును వివేకమును పడఁగలిపి మూఢాచారములకు దాసులయి పామరులకు ప్రియముగానుండుటకై వానిని పొగడుచుండుట యెంతయు శోచనీయముగా నున్నది. పట్టపరీక్షయందుఁ గృతార్థుఁడయిన మహానుభావుఁడొకఁడు మనదేశ మిప్పుడిన్ని ముహూర్తములతోను జాతకములతోను ధనహీనమయి యజ్ఞానాంధకారావృతమయి బాలవితంతుమయమయి దౌర్భాగ్యదశయందున్నను, పశ్చిమఖండమునందు పూర్వమెప్పుడో పిశాచములవలె నుండి వదలిపోయి యిప్పుడుమనదేశమునుపట్టుకొని పీడించుచున్న జ్యోతిశ్శాస్త్రము లోని ముహూర్తజాతక భాగములను శిరసావహించి శ్లాఘించుచు పశ్చిమఖండము

లోని ప్రకృతిశాస్త్ర రహస్యవేత్తలయిన విద్వాంసులు మన యీ జ్యోతిశ్శాస్త్ర పండితుల పాదములకు దాస్యముచేయుటకయిన నర్హులు కారని జయఘోష మిడుచున్నాఁడు. మఱియొక మహాత్ముఁడు తానుబొందిన పురాణశాస్త్ర పాండిత్యమంతయు సార్థక పడునట్లుగా పలువురు మహాజనులు సందర్శించుచు వచ్చుటవలన మహాత్ముల మనోబలమంతయు వైద్యుతశక్తివలె శిలలయందు ప్రవేశించి వానిని మహిమాఢ్యములను జేయునని సమర్థించి జనుల యారాధనమునకయి యీశ్వరునకు బదులుగా విగ్రహములను నెలకొల్పిన ధీమంతుల బుద్ధిమహిమను శేషునిమించి వేయినోళ్ళ మెచ్చుకొనుచున్నాఁడు. ఇంకొక గుణాఢ్యుఁడు తాను నేర్చుకొన్న యారోగ్యశాస్త్రములో సబ్బుమొదలయిన వస్తువులయందుఁ జెప్పఁబడిన మాలిన్యమును శుద్ధపఱచు గుణమును మృత్పిండములయందుఁ గనిపెట్టి కర్మకాండమునందు శౌచవిధిని గల్పించిన పురాణపురుషుల నిరుపమాన సర్వజ్ఞతను పూర్ణముగా వర్ణించుటకు తన కీశ్వరుఁడు ప్రసాదించిన నూఱునోళ్లును చాలవని చింతిల్లుచున్నాఁడు. ఇది యదియని చెప్పనేల? ఈ పుణ్యపురుషులు ప్రపంచముయొక్క బాల్యదశలో తత్కాలానుగుణముగా నేర్పఱుపఁబడిన ప్రతి మూఢాచారమును, స్వప్రయోజనపరులచే ధనాకర్షణార్థమై కల్పింపఁబడిన ప్రతి మూఢవ్రతమును, అసూయా పిశాచపిష్టులచే సృష్టింపఁబడిన ప్రతి క్రూరకర్మమును కాపాడుటకయి హేతుకల్పనములు చేయుటయందు తమబుద్ధిని పురాణవిద్యను ధారపోయుచున్నారు. ఈ యాచారములనే మన పూర్వులాచరించుచువచ్చినను వారవిమంచివని నమ్మి మనఃపూర్వకముగా నాచరించుచుండెడువారు. ఇంగ్లీషుచదువుకొన్న యీ పండితులో వేనియందును దమకు విశ్వాసము లేకపోయినను వేనిని దామాచరింపకపోయినను కపటవర్తనులయి దురాచారములను స్థాపించుటకయి పూర్వులెఱుఁగని క్రొత్తక్రొత్త కారణములను సృజించుచు లోకమును భ్రమింపఁజేయుచున్నారు. వీరింతటితోనైనను తృప్తిపొంది యూరకుండక దేశాభిమానలేశముగలవా రెవ్వరైనను దేశమునకు నష్టకరములయిన క్రూరాచారములను సంస్కరించు ప్రయత్నమున కించుక పూనఁగానే యట్టిసంస్కారప్రియులకు కపటవర్తనులనియు నాస్తికులనియు దేశానర్థదాయకులనియు మఱియుఁ దమకుఁదెలిసిన యట్టిశ్లాఘ్యములయిన యితరనామముల నన్నిటిని బెట్టి దూషించుచు తమ పాండిత్యము నన్వర్థముచేసికొని కృతార్థులగుచున్నారు. ఓ మహాశయులారా! పూర్వాచారములను భూషించుటయు నూతనాచారములను దూషించుటయు దేశాభిమానము కాదు. దేశమునకు భంగకరములుగానున్న దురాచారములను తొలఁగించుచు క్షేమకరములుగానున్న సదాచారములను నెలకొల్పుచు దేశాభివృద్ధికయి పాటుపడు

టయే నిజమయిన దేశాభిమానము. మనదేహమునఁ బుట్టిన వ్రణమని మనకది సుఖమియ్యదు; అరణ్యమునఁబుట్టిన చెట్టయిన మందు వ్యాధిని బోఁగొట్టి సుఖమియ్యకపోదు. సత్యమెక్కడిదైనను సుఖప్రదమును గ్రాహ్యము నేయఁగును. మీరీసత్యమును దృఢముగా మనస్సునందుడి జనులలో నన్యదేశములవారిమీఁద ద్వేషమును పురికొల్పక యనర్థదాయకమయిన యాచారము మనదయినను త్యజింపవలయుననియు శుభకరమైన యాచారమన్యులదయినను భజింపవలయుననియు బోధించి దేశమునందు సత్యాదరమును పరోపకారబుద్ధియు ప్రబలునట్లు చేయుఁడు. మన పూర్వులు విద్యా, ధనాదుల నార్జించి మనకు విడిచిపోయినందునను, మన పూర్వులకాలమునందు లభ్యముకాని నూతనశాస్త్రసంపద కొంత మన కధికముగా లభించినందునను ఈనూతన శాస్త్రసంపద మనపూర్వులకే లభించియుండినయెడల వారెట్లు ప్రవర్తించియుందురో యట్లును తమవంశజు లధికసంపదనుబొంది యధిక బుద్ధిమంతులయి యధిక యోగ్యముగాఁ బ్రవర్తించుచున్నారనివిన్న మనపూర్వు లెంత సంతోషింతురో యట్లును ప్రవర్తించుటకయి జనులను ప్రోత్సాహపఱుపుఁడు. తామేకార్యమును జేసినను పూర్వాచారమునుమాత్రము తృప్తిపఱుచుటకయి కాక యీశ్వరుని తృప్తిపఱుచుటకయి చూచుచుండునట్లు జనుల కుపదేశింపుఁడు.

సత్కార్యశూరత్వము. [౧౮౯౩వ సం|| వివేకవర్ధనినుండి గైకొనబడినది.

ఇంగ్లీసు విద్యాభ్యాసమువలనను, మనస్థితిని పశ్చిమఖండవాసులస్థితితో పోల్చి చూచుకొనుచుండుటవలనను, క్రైస్తవమతాచార్యులు మొదలయినవారు మనలోపముల నెత్తిచూపుచుండుటవలనను, మఱికొన్ని హేతువులచేతను మనదేశమునం దనేకుల మనస్సులలో నతృప్తియుదయించి కొన్ని విషయములయం దిప్పటిస్థితిని మార్చుకోవలెనన్న బుద్ధిపుట్టుచున్నది. ప్రస్తుతపుస్థితితో నతృప్తిపొంది యనేకు లనేకస్థలముల యందు చిలకాలమునుండి యుపన్యాసములిచ్చుచు ప్రసంగములు చేయుచుండుట దేశముయొక్క పురోభివృద్ధికి కొంత యనుకూలముగా నున్నదిగాని యెల్లకాలమును కార్యములులేక మాటలతోనే సరిపోవుచుండుటమాత్ర మంతగా శుభసూచకముగా నుండలేదు. కార్యశూరులులేక కేవల వాక్శూరులుమాత్రమే యున్నయెడల నేదేశమును నెప్పటికిని వృద్ధికానేరదు. ఏమిదోషముననోకాని మనదేశమునందు తాము సత్యమని నమ్మినదాని నాచరించెడు పురుషలక్షణమైన ధైర్యము మన మగవారిమనస్సులలో తలచూపకున్నది. మన విద్యాధికులు వాగాడంబరము చూపవలసివచ్చినప్పుడు

సభలలో నేమి పాండిత్యమునంతయు జూపి సింహకిశోరములవలె గర్జించువారైనను కార్యాచరణ శూరత్వమును జూపవలసివచ్చినప్పుడు గృహమునం దవ్వలవద్దను ముత్తవ్వలవద్దను నోరెత్తలేక మేఁకపిల్లల కన్నదమ్ములయి తమ పాండిత్యము నుపన్యాసమందిరములలోనే విడిచి మూఢురాండ్ర యాజ్ఞ జవదాటని పోటుబంట్లగుచున్నారు. ఇతరులకంటె తామెక్కువ తెలిసినవారమని విఱ్ఱవీఁగువారు సత్కార్యాచరణ ధైర్యమునుపూని యుపదేశములయందెట్లో యనుష్ఠానములయందు నట్లే తమ పుంస్త్వమును చూపఁగలిగినంగాని విద్యాధికులు తామును బాగుపడరు; లోకమును బాగుచేయనేరరు. తెలివికి లక్షణము తమకు తెలిసినదాని నాచరించుటకాని జ్ఞానహీనులకు భయపడి తెలియనివారివలె నటించుటగాదు. మనలో చదువుకొన్నవారు మాటలపోగులేకాని క్రియావంతులు కారనియు, వారిమాటలు కోటలు దాఁటునేకాని కాలు గడపదాఁటదనియు, మన విద్యాధికులమీఁద నిదివఱకే యన్యదేశస్థులవలన దుర్భరమైన నిందయొకటి పడియున్నది. మనమీఁదపడిన యీ నిందను మాటలవలనఁగాక చేష్టలవలనఁ బాపుకొనునట్లు కెల్లవారును కృషిచేయవలెను. న్యాయముగా మన మీఁదపడిన యీనిందను తమవర్తనమువలన నబద్ధముచేయఁగల పౌరుషములేనివారై, తామానింద కర్హులమని లోపల నెఱిఁగియు ఋజుమార్గమున దానిని పోఁగొట్టుకొనఁ జూడక కపటమార్గమవలంబించి యనేకులు తాము మున్ను మంచివికావని ఘోషించిన యాచారములే యిప్పుడు సర్వోత్కృష్టములయినవని చాటుచు, బుద్ధిపూర్వకముగా తాము వంచితులయి లోకమును వంచించుచున్నారు. ఇట్టివారిలోఁ గొందఱు తమపూర్వులొక్క రాజ్యాంగవిషయములలోఁగాక తక్కిన సమస్తవిషయములయందును సర్వజ్ఞులయిన ట్లభినయించుచు, తమయిల్లు బాగుచేసికొని కుటుంబముయొక్క సుఖాభివృద్ధికయి వారిని తిన్నగా పరిపాలింపలేనివారు తాము లోకమునంతను పరిపాలింపఁ గలుగునట్లుగా మనపూర్వులెన్నఁడు నెఱుఁగని స్వాతంత్ర్యములను పొందుటకయి శ్రమలేని వాక్పటుత్వమునుజూపి ప్రసిద్ధులు కాఁ జూచుచున్నారు. ఇట్లు చెప్పుటచేత రాజ్యాంగవిషయకములయిన స్వాతంత్ర్యములనిమిత్తము కృషిచేయరాదని మా యభిప్రాయమయినట్లు దీనిం జదువువా రెంతమాత్రమును గ్రహింపఁగూడదు. సమస్తవిషయములయందును జనులు తమ స్వాతంత్ర్యముల నిమిత్తమయి నిరంతరకృషి చేయుచుండవలయుననియే మా యభిప్రాయము. అయినను జనులు మతవిషయములయందును కులాచారవిషయములందును తమకుండవలసిన స్వాతంత్ర్యములను పొందుటకు తాము కృషిచేయక మూఢాచార్యులకును మూఢాచారములకును దాసులయి కడగండ్లపడుచున్నంతకాలము రాజ్యాంగవిషయకములయిన స్వాతంత్ర్య